శ్రీరస్తు.

పరిషత్పుస్తకభాండాగారము.



పరిషత్పత్త్రికనుండి పునర్ముద్రితము.

కాకినాడ:

ఆంధ్రసాహిత్యపరిషత్తువారిచే బ్రకటితము.

కాకినాడముద్రాక్షరశాల.

1931

వెల రు ౦-౦-౦.

పీఠిక.

పరిషత్పుస్తకభాండాగారములోని ముఖ్యగ్రంథములవిషయమై పరిషత్పత్రికలోఁ దఱచుగ వ్రాయఁబడుచున్నది. కొన్నిసంవత్సరములలోఁ బ్రచురింపఁబడినవానిని వేఱుగాఁ బ్రతులు తీయింపలేదు. ఇటీవల వానిని బాఠకులుపయోగించుకొనుచున్న యుక్తి ననుబట్టి ఇదిగూడఁ గొన్నికొన్ని గ్రంథములవిషయ మొక్కొక్కపుస్తకరూపముగానుండుట మంచిదని ద్వితీయభాగమునుండి యేర్పాటుచేసియున్నాము. ఇందనేకుల కనేకవిషయములు తెలియంగలవు. వివిధములగు చాటుధార లాయాగ్రంథములలో నున్నవానినిఁగూడ నిందెక్కించుచున్నారము. వానినింబట్టి పలువురుపురుషులఁ, బట్టణములఁ, గవులఁ దెలిసికొనుటకవకాశముగలదు. ఇదివఱకుఁ బ్రచురింపఁబడిన చాటుధారాదిపుస్తకములలోఁ జేరనిపద్యములుగూడ నిందున్నవని మానమ్మకము. ప్రస్తుత మీరీతి గ్రంథములలో మేము సాధారణముగా నాంధ్రగ్రంథములను గూర్చియే వ్రాయుచున్నారము. అందందు సంస్కృతగ్రంథములు చూపఁబడును. మా ప్రచురములలోఁ గవులపేరులు తెలియనిగ్రంథములు కొన్ని యున్నవి. వాని నెఱిఁగియున్నవారు మాకావిషయమెఱిఁగింతురేని మాపరిషత్తునకుఁ జాలసహాయమగును. ఈద్వితీయసంపుటము ప్రారంభించియు దీర్ఘకాలమగుటచేఁ బ్రమాదమున రెండుమూఁడువిషయములు స్థలాంతరములఁ జూపినవే చూపఁబడినవి, కాని రచనము భిన్నముగా నుండుటచేఁ బాఠకులు విసువరని తలంచెదము. ఆయాగ్రంథములలోనుండి తెలిసికొనవలసిన కవి, కృతిపతి, గ్రంథవిషయము మొదలగునవి సాధ్యమైనంత విస్తారముగను సంగ్రహముగను గూడఁ దెలుపఁబడుచుండును గావునఁ బాఠకుల కసంతుష్టి కలుగదని తలంచెదము. చరిత్రములు, ఇతిహాసములు, కావ్యములు, ప్రబంధములు, యక్షగానములు, జ్ఞానమార్గగ్రంథములును గద్యపద్యాత్మకములు పండితపామరరంజకము లిందుఁ గలవు. కావున సర్వజనాదరణీయమగునని విశ్వసించుచున్నారము.

ప్రజోత్పత్తిసంపుటమునుండి మరలఁ దృతీయభాగము ప్రారంభింపఁబడును.

శ్రీ

పరిషత్పుస్తక భాండాగారము.

ద్వితీయ భాగము.

—॥ విషయసూచిక ॥— పుట.

పరిషత్పుస్తకభాండాగారము.

(ద్వితీయభాగము.)

1. మహాభారతము-ఆదిపర్వము-గ్రం. సం. ౧-౧౧.

ఆంధ్రమహాభారతమునందలి యాదిపర్వప్రతులు. ఈ రెండును దక్షిణదేశమునుండి వచ్చినవి. భిన్నస్థలప్రతులు. వ్రాఁతలో మిగులఁ దప్పులున్నవి. ౧ సంఖ్యగలదానికంటె ౧౧ సంఖ్యదానిలో నన్నితప్పులు లేవు. ప్రారంభమున శ్రీఛాయాసమేత సూర్యనారాయణాయనమః శ్రీఅశ్వత్థనారాయణాయనమః క. హరిదానును వనవానును పరచితపరమోపవాను (౨) ప్రాంశుపయోదనీల తనుభాసితు (౩) అంబుజనాభాంబుజోజ్వల అనువానితర్వాత శ్రీవాణీగిరిజాశ్చిరాయ అని కలదు. ౧౧ సంఖ్య గలదానిలో శ్రీగణాధిపతయేనమః వాగీశాద్యాస్సుమనసా యనుశ్లోకముమాత్రము వ్రాసి పిమ్మట శ్రీవాణీగిరిజా యని మొదలిడెను. మాటలలోఁ జాలభేదములు గలవుగాన రెండు భిన్నమాతృకలనుండి వ్రాయఁబడినవని విదితము.

౧ లో — అని సకలభువనరక్షణప్రముఖులై - - వాణీపతుల స్తుతియించి

౧౧ లో — అని సకలభువనరక్షణప్రభువులైన - - వాణీపతుల స్తుతియించి

౧ లో — బలిమి నెయ్యమున భూవలయపతుల ౧౧ లో — బలిమి నియ్యని భూమివలయపతుల

౧ లో — నాకు ననవరతంబు శ్రీమహాభారతంబునందలి యభిప్రాయంబు పెద్దయునై యుండు

౧౧ లో — నాకు ననవరతంబును మహాభారతంబునందుల యభిలాష పెద్దయునై యున్నయెడ

౧ లో — పాయక పాకశాసనికి భారతఘోరరణంబునాటి నా
రాయణునట్లు మానసధరామరవంశవిభూషణుండు

౧౧ లో — పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణుపట్లు దాను ననుధామరవంశవిభూషణుండు.

ఇట్టి వెన్నియో భేదము లుండసిండు. "అనవరతార్థదాన యజనాభిరతుఁ డభరతాన్వయాంభినద్ధను" అను పద్యమునకుఁ దర్వాత ౧౧ దానిలో దధప్రాసమునకై మనము తాళ్లాము "కాంచనకట్టి పాటియుపకారము" అనుపద్యము విడిచి పెట్టఁ

బడినది. మఱియును ౧౧౧౨ సంఖ్యగలదానిలోఁగూడ నీపద్యమిటవిడువఁబడినది. ౧ దానిలో-ప్రథమాశ్వాసములో "సంబోధనచేసి చేసె నృపసుందర"యని ద్వితీయాశ్వాసము కడపట - సంచోదనచేసిచేసె నృపసుందర-యనియుం గలదు. ౧౧ లో ప్రథమాశ్వాసములో లేదు గాని ద్వితీయాశ్వాసములోఁ గలదు. "సంబోధనచేసిచేసెనృపసూదన"యనియున్నది. ౧ దానిలో ౧౧ లోఁగూడ "ఏడక్షోహిణు లెన్నఁ బాండవబలం బేకాదశాక్షోహిణుల్ సాధిం గౌరవసైన్య"మనియే యున్నది. ఆంధ్రగ్రంథములలో నగ్రగణ్యము గానఁ బ్రథమమున మంగళార్థ మీపుస్తకము నెత్తి చూపినారము. ౧న దానిలో సప్తమాశ్వాసము పూర్తిగా లేదు. ౧౯౭ పత్రములు. ౧౧ వది ఆదిపర్వము పూర్తిగ నున్నది. ౨౬౫ పత్రములు. కడపట—

క. వ్రాలా తప్పులు శత్రులు, చాలంగల వేను నట్టిశబ్దసంగతు లెరుగం
 గేలిం బెట్టక తిట్టక, పోలంగా దిద్దరయ్య బుధజనులారా.

గీ. వ్రాఁతతప్పువలన వాచకు లలుగక, తప్పు గలిగెనేని తగినయెడల
 వలయు నక్షరములు వెలయంగ నిలుపుఁడీ, సుకవులయినవారు సుస్థిరముగ.

సౌమ్యనామసంవత్సర కార్తీక బ-౧౨ ఆరంభం చేసి పుష్య శు ౧-లు సరికి ఆదిపర్వం యెనిమిది ఆస్వాసాలు కొత్తకోటకరణం తిమ్మప్ప వ్రాసినది సర్వం శ్రీకృష్ణార్పణమస్తు అనియున్నది. (కొత్తకోట - పుదుకోట.)

2. ముహూర్తమార్తాండము. గ్రం. సం. 2.

ముహూర్తభాగము—౧౬౦ శ్లోకముల గ్రంథము. మొదటి ౮౮ శ్లోకములు లేవు. కాని గ్రంథము ప్రారంభమున ౧-౨ పుటలవగుననే శ్రీరామాయనమః శ్రీగణేశాయనమః అథాగ్న్యాధానప్రకరణం న్యస్తేనాహ అని ప్రారంభించినాఁడు. మొదటి ౮౮ శ్లోకములు మొదటిభాగముక్రింద గణింపఁబడుచున్నదో యేమో. శ్లోకమును దానికి వ్యాఖ్యానమునుగా ౮౮ పత్రములగ్రంథము.

గద్యము—ఇతి శ్రీమదనంతాఖ్య చాతుర్జాన్యయజ్వపుత్ర నారాయణవిరచితాయాం ముహూర్తమార్తాండటీకాయాం మార్తండవల్లభాయాంముహూర్తమార్తండ స్సమాప్తః.

కవియే దీనికి వ్యాఖ్యానము వ్రాసెను. కవివంశాదికము.

ఆసీత్సీమమణౌరునామనగరే శ్రీకౌశికస్యాన్వయే
యోనంతో వాజసనేయపూజ్యచరణో మాధ్యందినేయాగ్రణీః

కృష్ణ స్తత్తనయ శ్రుతి స్మృతివిదా మగ్రేసరే జ్యోహరి
స్తత్పుత్రః శ్రుతివి ద్ద్రాజసగో నంతాగ్నిహోత్రిగురుః
తత్పుత్ర స్తదనుగ్రహాత్తధిషణో నారాయణాఖ్యాపుర
గ్రామే శిష్యగణేచ్ఛయా నిజకృతగ్రంథస్య టీకాం స్ఫుటాం
చక్రే తాం కృపయా పరోపకృతయే శోధ్యం మదుక్తం బుధై
ర్నానృశ్యస్య విలోక్య ధార్ష్ట్యమపి తే కుప్యంతి నోసజ్జనాః
సుఖనిధిపురుషార్థసాధనసమాభిస్సమాభిః
పరిమితశకకాలే ముహూర్తమార్తాండటీకాం
లిఖతి పఠతి విప్ర స్తోత్రభూయాద్ధరిత్ర్యాం
సుఖనిధిపురుషార్థ స్సాసమాహార్ష సుమాహార్.

3. చంద్రాంగదచరిత్రము—గ్రం. నం. ౧౨.

పైడిమఱ్ఱి వేంకటపతికవిరచితము. ౧-౨-౩-౪- ఆశ్వాసములు పూర్ణముగను ౫-వది యసంపూర్ణముగను గలదు. ప్రారంభమున—

ఉ. శ్రీగౌరీపతికార్ముకంబు నిజదోర్వీర్యంబునం గూకుదం
బై గాధేయమునీశ్వరప్రియతనుం బై భార్గవా మేయబా
హాగర్వాతిశయంబు దా సగణమీాయక్ జానకీకాంతతో
రాగంబొప్ప గృహప్రవేశ మగుశ్రీరాము న్నదిం గొల్చెదన్.

కవి తనవంశ మి ట్లొకపద్యమునం జెప్పుకొనియెను.

సీ. సకలసత్కవిపూజ్యసుకవిత్వసామ్రాజ్యనిర్వాహకుండు పెదపర్వతన్న
వివిధభాషాహార్యవిరచనాచాతుర్య సర్వంకషుండు పొట్టిపర్వతన్న
వరపద్యదాశారథాచాచమత్కారనిరుపమమతిశాలి తిరుమలన్న
యవధానకృతిగర్భకవితాచ్ఛసందర్భకీర్తితప్రజ్ఞుండు కేశవన్న
యనుం దనకు నన్నలుగ నుర్వి నొప్పుకృష్ణరాయభూషణకులరామరాజతనయు
కేశవాత్మజపర్వతాధీశు వేంకటాద్రి నీకావ్య మేనిత్తు నంకితముగ.

గద్యము—ఇది శ్రీమద్రామచంద్రచరణారవిందభృంగాయమాన మానస సకలశాస్త్రాధ్వరీరంప పైడిమఱ్ఱిపద్మనాభాధ్వరిసతంస కృపాభూషణ కృష్ణరాయ భూషణ పర్వతరాజతనయ వేంకటపతివిరచితం బైన - - - -

ఇందలికథ నిషధపురాధీశుం డైన యింద్రసేనుండు సంతానముం గోరి విష్ణు నారాధించి చంద్రాంగదుం డనుపుత్త్రుం బడయుట—చంద్రాంగదుని బాల్యము, యౌవనము, వేట—ఒక్కశారికనుదటిమిఁగొనిపోయిన నది యొకస్త్రీయై పలుకుట మొదలైనది.

ఇం దాఱవయాశ్వాసములోఁ గొంతభాగము లేదు. నీ మనినాఁడ బహు కాల మనవద్యగతి జనుల్ గొనియాడ భూమిపాల్పన మొనర్చి, వినినాఁడ నయ పరుల్ వినుపింప నయశాస్త్ర - - - అంతతో ముగిసినది. చాలకాలముక్రిం దట నెల్లూరిలో నీగ్రంథ మచ్చుపడినది. అప్పుడు వారికిని షష్ఠాశ్వాసము పూర్తిగా దొరకలేదు. కొన్నిపద్యములు:—

చ. అని తలయూఁచు నూఁచి వగ హాయను హాయని నవ్వు నవ్వి వ
చ్చినతను దూఱు దూఱి విధినీయను నీయని కుందుఁ గుంది ప
ర్వినవెతఁ దూలుఁ దూలి మదివేసరు వేసరి రోఁజు రోఁజి చే
కన్కనఁ జెయిఁ జేర్చుఁ జేర్చి హరికోసము మోసమువచ్చెనాకనున్. ౨ ఆ.

ఉ. ఆయెడఁ బంచబాణసమునగ్రసమగ్రజయోగ్రదోస్సమా
ఖ్యాయుత చిత్రసేనతనయా తనుసంభృతపాండిమావ్యాత
చ్ఛాయత వోలె నెంతయును జక్కనలొక్కట జోడుగూడ వే
వేయురియాఁడఁ దోఁచ రహిమీఱె వినిర్మలసాంద్రచంద్రికల్. ౫ ఆ.

ఇందుఁ బత్రసంఖ్య 126 గలదు, చతుర్థాశ్వాసము లేదు కావున 55-97 నడుమఁ గొన్నిపత్రములు విడువఁబడినవి.

4. కన్నశతకము. గ్రం. సం. ౩౮.

ఈశతకములో 135 కందపద్యములు గలవు. వేదాంతరహస్యార్థప్రతిపాదకము లైనచక్కనిపద్యములు. 18 పత్రముల చిన్నపుస్తకము 129 పద్యములు మొదట వ్రాయఁబడినవి. తక్కినపద్యములు తర్వాత వ్రాయఁబడినట్లు వ్రాఁత క్రొత్తప్రాఁతలు, అక్షరముల భేదమును దెల్పుచున్నవి. ప్రతిపద్యమునకును కన్నా యని మకుటముగలదు. కొన్నిపద్యములలో యెరగుడికన్నా, యినకులకన్నా, రవికులకన్నా యనియుఁ గ్రొత్తగా వ్రాయఁబడిన వానిలోఁ గన్నా యనియుఁ గలవు. మొదటిపద్యములు.

అబ్బురపు బాలపదముల, జొబ్బిల్లెడి రసముగ్రోల జోకవహింపన్
నిబ్బరపుఁగవిత లబ్బుట, యబ్బురమా యెఱుకగన్న యరగుడికన్నా. ౧
ఎబ్బెట్టునుతము రోయుచు, నిబ్బరముగ బాలపాదనీరజరసమున్
ఉబ్బుచుఁ గ్రోలిన యంతట, నిబ్బంగిని గవితలన్న యెరగుడికన్నా. ౨
అంజనిపుత్రుని కృపచే, రంజిల్లుచు శారదాంబ రసికత మెఱయన్
మంజుళవాక్యము లిచ్చెను, రంజితబాలాప్రసన్న రవికులకన్నా. 3

ముందర విజయుని కృపఁగని, యందుపయిఁగ యోగివరుని యనువునయిం
పొందఁగ బుచ్చనగురుఁడయ, నిందిర నీకబ్బెరన్న యెరగుడికన్నా.
పిల్లలమఱ్ఱి బుచ్చనగురు, చల్లని వాగమృతఘటన సమరసమొప్పఁగ
గల్లప్రపంచము రోసియు, నెల్లప్పుడు నెఱుకగన్న యెరగుడికన్నా. ౫
సుబ్బయగురుకృప నల్లను, నబ్బెను బాలాంబకరుణ యానందముతో
గొబ్బునఁ గైకొని మనుమీ, యిబ్బంగిని నెఱుకగన్న యెరగుడికన్నా. ౧౦

ఈపద్యములంబట్టి పిల్లలమఱ్ఱి బుచ్చన్నగురునికి శిష్యుఁడై బోధముం గాంచెననియును సుబ్బనగురునిచే బాలాంబప్రసాదముంగొని కవియయ్యె ననియు, ఆంజనేయోపాసకుఁడుగానుండె ననియు, గవివిషయము తెలియవచ్చును గాని కవిపేరెవ్వరో-ఒకవేళ యెఱగుడికన్నయ్య యేమో-యనియూహించుటకును నవకాశమున్నది. ఈకర్ణయ్య, కన్నయ్య యని వ్యవహరింపఁబడు నాతఁ డినకుల వంశజుఁడు క్షత్రియుఁ డనికొనవచ్చును:—

నాసికము మొదలఁ జూపము, భాసిల్లఁగ నుంచి చాలభావము గురుపై
నాసక్తితోడ నిల్పుట, యాసుఖమే నీవటన్న యరగుడికన్నా. ౧౬
గంగకు యమునకు సందున, సంగతిగా ద్రోవగనిన సమరసపూరా
రంగైన బ్రహ్మపదమున, కింగితమా యెఱుకగన్న యినకులకన్నా. ౫౧
అంతయుఁ దానని యుండుము, అంతకు మదినిల్వదేని యంతకు వెలియై
సంతోషమంది నిల్చిన, యంతేరా యెఱుకగన్న యెరగుడికన్నా. ౧౦౩

పద్యములలో వ్రాఁతకాండ్ర వ్రాఁతతప్పులు దొలఁగించిన బద్యములు శుద్ధముగా మృదువులుగా నున్నవి. గ్రామనామాదులలోఁ గొంతస్వేచ్ఛను విడిచిరిగావున యరగుడి, యెరగుడి, యని యతులలో రెండుదెఱఁగులవాడి యున్నాఁడు. ఎల్లన, యెల్లన, యల్లన యని యిట్లితరగ్రంథములలోఁగూడఁ గాననగును. ఇదిదక్షిణదేశప్రతి.

5. సభాపతి లక్షణము—వచనము—గ్రం. సం. ౨.

ఈపుస్తకమును దక్షిణదేశమునుండి వచ్చినదియే వేంకటకృష్ణప్పనాయకుని యహల్యాసంక్రందనములోఁ (దీనిని బరిషత్పాఠకు లిదివఱకే యెఱుఁగుదురు) జివర వ్రాయఁబడి యున్నది. 7 పత్రములు గలవు. పూర్వభాగము పూర్ణముగా నున్నది. ఉత్తరభాగము కొంత లేదు. కవియెవ్వరో తెలియదు. సభాపతులే కాదు సకలజనులు నెఱుంగవలసిన యనేకవిషయము లిందుఁ గలవు. ప్రారంభము.

క. శ్రీరమ్యుఁడు సంతతశృం, గారుఁడు రాజాన్వయప్రకాండుఁడును
దారూఢుఁడు సకలకలా, పారంగతుఁ డనఁగఁ దా సభాపతి వెలయున్

క. తరుణుండై నవరత్నా, భరణుండై గంధపుష్ప పరిమళయుతుఁడై
పరనారీ సోదరుఁడై, పరఁగినవాఁ డెన్నఁబడు సభాపతియనఁగన్.

క. నరపతియై ధనియైయును, స్థిరమతియై సకలవిబుధకవితావిద్యా
పరిణతుఁడై చతురుండై, పరఁగినవాఁ డెన్నమటి సభాపతియనఁగన్.

క. తనయుల మిత్రుల - - - నునిచిన సమీపమునఁ దనిన యోగులవిద్వ
జ్జనులను మాన్యులన - - - దగు నాఢ్యులు చుట్టును గూర్చుండఁదగున్.

క. భావజ్ఞులరసి కులసం, భావనగలవారి రాయబారులఁ గవులన్
తీరిని యథాసనంబుల, భావింపఁగ నుంపఁదగు సభాపతియనఁగన్.

క. వీరాహవమున విజయుఁడు, ధీరోదాత్తుండు సద్గుణనిధియై
యారయ సింహాసనమున, నారూఢత నొందుచుండు నాసభనడుమన్.

అని యిట్లు సభాపతిలక్షణము తెల్లనిన:—సోమసూర్యవంశోద్భవుండైనస్వామి యమాత్య రాష్ట్ర భృత్య కోశ దుర్గబలంబులను రాజసప్తాంగంబులు గలిగి, ఆందోళికాభరణాంబర వాహనచ్ఛత్ర రాజ్యాధిపతి కస్తూరికస్తూరితాంబూలంబులను సుచితసప్తాంగంబులుం గలిగి, సామభేదదానదండ మాయోపేక్షేంద్రజాలంబులను సప్తోపాయంబులుం గలిగి స్త్రీద్యూతపానమృగయా వాగ్దోషదండదోషనిరర్థకవ్యయంబులను సప్తవ్యసనంబులు విసర్జించి పౌరాణిక సుతనిధి దేవగేహ వన బ్రహ్మస్థాపన్యతటాక సత్కవితలను సప్తసంతానంబుల వెలసి విద్వాంస పౌరాణి కేతిహాసిక భట్ట పరిహాసక గాయక వందికులను సభాసప్తాంగంబులు గలిగి లవణేక్షుసురాసర్పిదధిక్షీరశుద్ధోదకంబు లనుసప్తసాగరంబులు గడచి - - - - - - దానధర్మపరోపకారంబులను ధర్మత్రయంబు నెఱింగి ప్రభుమంత్రోత్సాహంబులను శక్తిత్రయంబు గలిగి శత్రుమిత్రోదాసీనంబులను త్రివిధంబుల, నుత్పత్తిస్థితిలయస్వరూపత్రిగుణంబుల నెఱింగి, ప్రభాతమధ్యాహ్నసాయంకాలసంధ్యాత్రయ నియమవంతుండై - - - - అర్థకామమోక్షంబులను చతుర్విధపురుషార్థుఁడై వేదశాస్త్రపురాణేతిహాసంబులు....క్షౌరాభ్యంజన దంతధావనధౌతవస్త్రంబు లను చతుర్విధముల గరగరిక లెఱింగి వస్త్రాభరణగంధపుష్పంబు లను చతుర్విధశృంగారవంతుండై, ఉన్మదన మోహన వశీకరణ స-తాపంబు లను చతుర్విధ మదనమార్గంబులం దెలిసి - - - - - ధనధాన్యకుమారవస్త్రవాహనభూషణబంధుదాసదాసీజను లను నష్టైశ్వర్యంబులు గలిగి భోజన

వస్త్రగంధపుష్పతాంబూలప్రియకామినీసంగతగోష్ఠి. పూవుపాన్పు లను నష్టభోగంబు లనుభవించి - - - -

ఈరీతిగా రెండుభాగములందును, సంఖ్యలతో నిరువదితొమ్మిదిగణములు, యిరువదిప్రాసంబులు, నేఁబదియతులు, దోషములు నలంకారములు సంగీతరాగములు, నష్టాదశపురాణోపపురాణంబులు, ముప్పదిరెండాయుధములు ఛప్పన్నదేశంబులు - - - - జెప్పఁబడియున్నవి. సమయస్ఫూర్తి కిట్టివిషయములు గూడ తెలిసికొనియుండుట మంచిది పూర్ణప్రతి సంపాదించి పరిషత్పత్త్రికలో మున్ముందు పూర్తిగా ముద్రింపఁబడును. విషునామసంవత్సరము నవరాత్రులలో వ్రాయఁబడినది. రాయబ్బద్దిసుబ్బాశాస్త్రులవారి పుస్తకము. సుబ్బాశాస్త్రులవారే వ్రాసినట్లు కనఁబడుచున్నది.

6. ఆంధ్రకౌముది. గ్రం. సంఖ్య. ౧౬

ఇది, గణపవరపు వేంకటకవి సర్వలక్షణశిరోమణిలోని యాంధ్రవ్యాకరణభాగము. ఇది 31 పత్త్రములలో వ్రాయఁబడిన పెద్దసీసమాలిక—ఇందుఁ దత్సమపదములు, తద్భవములు, దేశ్యములు, గ్రామ్యోక్తులు, సంస్కృతసంజ్ఞాప్రకరణము, అజంతములు, విభక్తులు, సంధులు, ఆదేశయకారసంధి, పరరూపములు, హలంతసంధులు, లుప్తవర్ణపదసంధులు, ద్విత్వవిధానము, జస్త్వవిధానము, హలంతప్రథమ, ఏకవచనబహువచనరూపములు, దేశీమూల తెనుఁగుప్రథమైకవచనములు, సతిసప్తములు, అప్రాణివాచకాదంతాల సప్తమితృతీయల - - - అవ్యయములు, అప్రత్యయములు, ఆఱువిధములకారకములు, సమాసములు, కృదంతములు, క్విప్రత్యయములు, వర్గచతుర్థఘకారాంధకార - - - నకారణకారములు నట్రువసుడులు మొదలగునవి వివరింపఁబడినవి. ప్రారంభము—

క. శ్రీభామాసర్వోక్తిక, ధాభవనిజసుందహాస ధాగధగశ్రీ
శోభితశుభతత్కుచకుం, భాభోగకేలీన వేంకటాచలవాసా.
అవధరింపుము.

సీ.మా శ్రీకరమ్ముగను సంస్కృతమునకును బ్రాకృతమునకుఁగలలక్షణములు చెప్పి
తెనుఁగున నావిధమ్మున లక్షణము చేయరాకున్కి యదియు నేరంబు గాదు
తొల్లిటి సుకవు లెల్లను నను ధన్యుఁగావించు తలఁపింతె కాని యనుచుఁ
గుకవిజనాజ్ఞానఘోరాంధతమసము పోఁగొట్టఁ గల్గు కౌముదివిధాన
నిల మున్నుఁ దెనుఁగున నెవ్వా రెఱుంగని యాంధ్రకౌముది యనునట్టికృతిని

సీసమాలికగాఁగఁ జేసితి నిపుడున్న కవులకు రానున్న కవులకెల్ల
నుపకారముగఁ నిది యెపుడు నాచంద్రతారార్కమై కౌముదియటులు వెలయుఁ
గ నవిందు సంజ్ఞాప్రకరణమ్ము మొదలుగఁ దత్త్వప్రకరణము ల్దనరు నరుసఁ
నత్రిలింగపదంబు తద్భవం బగుటచేఁ దెలుఁగనఁ దగినట్టి తెలుఁగు ప్రాకృ
తాభిధానముగాన నాలక్షణమ్ములు తొలుతఁ గవులకెల్లఁ దెలియవలయు - - -
తత్సమదేశ్యతద్భవములఁ గలయని తేటనుడుగు లచ్చతెనుఁగనఁదగు
నదియెట్టులన నింకనలరు పేరు కొలంకు నూనె నా నాముదం బానవాలు
బండి పసర మొద్దు పండు పప్పప్పను దూకలాకులు నాకు బాకు మేకు
గుజ్జు మేనిక యెండ కోట వెన్నెల కొల్లగడి పులి నేల వలి పాడుగిన సిఁక
గ్రామాలు జాలు పురాణాలు దోసాలు శాస్త్రాలు వేదాలు సంబరాలు
గంతులు పొక్కులు గ్రద్దలు బొందలు గాసాలు మొదలుగాఁ గలపదములు
వాసేవు పైర్లు రాగేసేవు నీవ్వాను కూసుకుంటా గోంతిగుడ్డరాకు
పాడేవు కాలెత్తి యాడేవు వస్తానె నూసేవు దానికంతా సమీరె
ననుక్రియల్ మొదలైనయవి గ్రామ్యములు - - - - - - -
అఖిలప్రబంధమ్ములందలి లక్ష్యముల్ వేర్వేర నొకకొన్ని విస్తరింతు
నెమ్మెచ్చె నాఁగను దమ్ముంట్లు నాఁగను దివ్వెంతయనఁగ నాదంచెననఁగ
వానిదవంధ్య జీవనమనంగ ననలజ్యోతుండ నన నిచ్చుచుండు ననఁగ
నంతంతననఁగఁ బరమాత్మందురనఁ దామరసనేత్రలింప్లన బ్రహ్మాండన
శౌరిచ్ఛుభక్తి వేసారక నెంతధికంబన గురునాజ్ఞ గనుఁగొనసన
మీరప్పు డంద యొమ్మికను బొల్తిదియన నేయుచుయు ననసేయోయనంగ
- - - - - - - - - - - - - - నింకస్థావరాప్రాణి వాచకములగుటఁ
దగు నుకారాంతశబ్దము లకారాంతములను బంచమీ తృతీయలను సప్త
మినల బహువచనకతను రెండును జెలంగు గట్టునపచ్చనం గట్టవచ్చ
ననఁ జెలి ప్రేంఁ జూపెను ప్రేళ్లఁ జూపెనా నొకయూర నిల్చు వాండ్లనిల్చు.

ఇట్లీ వ్యాకరణమంతయు వ్రాయఁబడియున్నది. ఈ 16-వ పుస్తకములో శబ్దమంజరి (సం:) ఆంధ్రనామసంగ్రహము, అకారాది దేశీయ తెనుఁగులు; వేంకటేశాంధ్రము, ఆంధ్రకౌముది, ఆంధ్రశబ్దచింతామణి యనునవి గలవు. సిద్ధార్థినామసంవత్సరము ఆవణి నెల ౧౫-వ తేది గా చవేల్పు కృష్ణమరాజు స్వహస్త లిఖితమైన సర్వలక్షణశిరోమణియందలి యాంధ్రకౌముది తృతీయోల్లాసము సంపూర్ణము--- అని కలదు.

7. భగవద్గీతావచనము - గ్రం - సం - 37.

ఈవచన మెవ్వరు రచియించినదో తెలియరాదు. ఈసంపుటములో నిదియు, నవధూతస్వాముల గురుశిష్యసంవాదము, మహావాక్యము, నాత్మైకబోధమును గలవు. సంస్కృతమునకు సరియైన తెనుఁగువలెఁ గన్పట్టుచున్నది.

ప్రారంభము.

క. శ్రీరమణీహృదయప్రియ, సారసపత్త్రాయతాక్ష సకలాధ్యక్షా
హారికగుణావిలాస, శ్రీరాజితనుగుణజాల శ్రీగోపాలా.

వ. అవధరింపుము భవదీయచరిత్రాశయం బైనశ్రీమహాభారతంబున భీష్మపర్వంబునందుఁ గౌరవశ్రేష్ఠుఁ డైనధృతరాష్ట్రుండు వ్యాసవరప్రసాదలబ్ధదివ్యజ్ఞానసంపన్నుం డగుసంజయువలన భూగోళవిస్తారంబును జంబూఖండవినిర్మాణంబును జెప్పన్న దేశప్రవర్తనంబులును విని కౌరవులును బాండవులును గురుక్షేత్రంబునందు యుద్ధసన్నద్ధు లైనమునవారును బాండవులు నేమి గావించిరని యడిగిన ధృతరాష్ట్రునిం జూచి సంజయుం డి ట్లనియె. వ్యూహాకారంబుగా నిలిచియున్న పాండవబలంబు నీక్షించి దుర్యోధనుండు ద్రోణాచార్యసమీపంబునకుం జని యతనితో ని ట్లనియె. నీశిష్యుం డైనదృష్టద్యుమ్నునిచే వ్యూహాకారంబుగా నిర్మితం బై సన్నద్ధం బైనపాండవబలంబుం గనుంగొనుము. ఆసేనయందు భీమార్జునులకు సమానులు శూరు లగు మేటివిలుకాం డ్రెవ్వ రెవ్వ రంటేని యుధామన్యుండును, ఉత్తమౌజుండును—

- - - - - - - - -

ప్రకృతిపురుషయోగములో:—

భారతా క్షేత్రంబులయందలి క్షేత్రజ్ఞుం డగువాని నన్నుఁగాఁ దెలియుము. ఈక్షేత్రజ్ఞస్వరూపం బెఱింగెడిజ్ఞానంబు తనకు సమ్మతంబ క్షేత్రం బన నెట్టిది, ఏవికారంబు గలది, యెందువలన జనించినది, యెట్టువంటి భేదంబు గలది. క్షేత్రజ్ఞుం డన నెవ్వఁడు, ఎటువంటి ప్రభావంబు గలవాఁడు. ఆయర్థంబు సంక్షేపంబుగా వివరించెద.”

ఇట్లు సర్వత్ర మృదుమధురముగా వ్రాయఁబడినది.

ధాతృనామసంవత్సర మాఘశు ౧౨ సోమవారమువరకు రాజశ్రీ చేనన కొండరామప్పనాయనివారి కొమారుడు బొజ్జానాయనివారికి శ్రీశైలపతికొమారుడు వాసుదేవుడు వ్రాసిన భగవద్గీతావచనము ౧౮ అధ్యాయాలు సంపూర్ణము

శీఘ్రమేవవివాహప్రతిష్ఠాసిద్ధిరస్తు అనేకరాజ్యాభివృద్ధిరస్తు దేవతాబ్రాహ్మణే ష్వచంచలా భక్తిరస్తు. అనవరతభూసురాశీర్వాదసిద్ధిరస్తు. - - - అని యున్నది.

8. చిల్లరపద్యములు - గ్రం - సం - 69.

ఇది యొక 16 పత్రముల చిన్నపుస్తకము ఇందు దక్షిణదేశములో నున్న ప్రసిద్ధులపై పద్యములు వ్రాయఁబడినవి. పుదుక్కోట నుదురుపాటి రామస్వామయ్యగారిచ్చినది ఇందుఁ గొన్ని మనుచరిత్రము వసుచరిత్రము విజయవిలాసము మొదలగు గ్రంథములలోని పద్యములును గలవు గువ్వలచెన్నశతకము, కవిచౌడప్పశతకములలోనివియు నున్నవి. కొన్ని పద్యము లిం దిచ్చుచున్నారము

సీ. పలికెనాకపురంపుఁబలుకులై దననంపు మొలకలై ఘుమఘుమల్ దొలఁకఁ బలుకు
నవ్వినా విరవాజిదువ్వలై తెఱఁగంటిబువ్వలై ధళధళల్ పొసఁగ నవ్వుఁ
జూచినా యమృతాంశు రోచులై కరుణాబ్ధివీచులై నిగనిగల్ వెలయఁ జూచు
నిచ్చినా వేయింటి కెచ్చులై ముత్యాలపచ్చలై మదిఁ గవుల్ మెచ్చ నిచ్చు
బుధులమన్నించు క్షేమమీనిధులఁ బెంచు, స్వజనులను బ్రోచు మదవైరిజనుల నేఁ
బ్రియుదశభువనమధ్యమాభిఖ్య భువన, పాలనపటుండు రాజగోపాలవిభుఁడు [చుఁ

క. వకుళవననిత్యవాసిని, సకలాభీష్టముల నిచ్చు చక్కనితల్లీ
ప్రకటితము సేయు నీకృప, నృకలుషగిరిభేదశంబ శ్రీబృహదంబా.

మ. గణుతింప న్వశమా భవద్విజయజాగ్రద్వీరవిద్యావిజృం
భణపాండిత్యము నీకుఁ జెల్లు భళిరా భద్రేభఘుంటాఘుణం
ఘుణనిక్వాణనిరాఘ్యనిర్భరమహాగంభీరభేరీధణం
ధణధాణంధణధాణిరాయరఘునాథా యోధయూథాగ్రణీ.

క. అందఱు నీసరిదొరలా, మందరధరకుహరవిహగమాణమృగేంద్రా
స్పందితనిజజయపటహా, మందరవా రాయభూప మధురాలాపా.

క. కోటిగదా వితరణశత, కోటిగదా నుతి సహస్రకోటీరలుఠ
త్కోటి గదా పాదతులా, కోటి బలీ కోటిరాజగోపాలపతీ.

క. అహాహా నీపలుకా శ్రీ, మహిశాకుచగంధగంధవహ మోముహ్యా
త్కుహానానృపరిదృఢీయః, కహకహారవ ముప్పుఁ బచ్చకస్తురికుప్పా.

క. వచియించెద నొకపరి నీ, రుచిరంగుణప్రథితకీర్తిరుక్ప్రకితసుధా
రుచిబలహారి విచికిలహారి, ఖచరలహరికాతరంగ కస్తురిరంగా.

క. ఎంతు న్నిను వరమురళీ, కాంతారవపుషితఘోష కాంతాలసదే
కాంతాలసకాంతాలస, కాంతాలసదంతరంగ కస్తురిరంగా.

క. శంకా నాకంక భవ, త్ర్యంకగుణను శమనదమన కేళీహాళీ
ఝాంకరణ ఘనహాసరోమరు, దంకూరక్రమణ వేంకటాచలరమణా.

క. కొద్దిగఁ జలించె నామది, నిద్దావా తెలుపుఁ జెలుకు నేజానుంధా
ముద్దియవా యొకతీయుని, ముద్దియవా చెలి కోసంగ ముద్దులమంగా.

క. చెందొవలవిందు నీముఖ, మందముసకు సంది కైశ్య ముళనింది పరా
కెందుస నీయుగమున నిర, పొందినదే పొందు విను కహారానందీ.

క. శ్రీమంతుఁడ వై పదనుత, సామంతుఁడ వై మనీషిసన్నుతవిలస
ద్ధీమంతుఁడ వై వర్ధిల్లు, రైమంతా ముద్దువముగ రాజవతంసా.

శా. తంజాధీశుఁడు పంపఁగా వత్తుము లుత్సాహంబుతో వచ్చు నీ
గంజాతిండినురాటిషోజులపయిం గత్తై త్వఁగా నేలరా
కెంజం జొత్తుగు నీదుచేతికరడా కీయాంతఘా కేసునిరా
కంజాక్షీసుమచాప ముద్దువిజయుత్సాపా నృపాలద్విపా.

మ. చిలుతా తాళునా గొగ్గి యానుకొనునో చేదస్తునా నిల్చునో
తలుకుం గేడెపుఁబిల్ల నష్టముగనో (ష్ట) త్తనవచ్చునో యొష్టినర్
ఘళుఘల్ ఘల్లుఘణేల్ ఘళీక్కురని క్రక్కల్ సేయునీఖడ్గకో
శల మొక్కొక్కెపుఁ బోవ ముద్దువడుగత్సాపా నృపాలద్విపా.

క. కుంకుమ లేదో మృగమద, పంకము లేదో పటీరపాంసువు లేదో
సంకుమదము లేదో యుశు, భంకర మగుభస్మమేల బాలాసిక్ష.

క. దాతకుఁ బద్యము లిచ్చిన, నాతఁడు ధన మొసఁగఁ గవుల కవుడే సెలవో
గూఁతురి నమ్మిన రీతిసి, రీతిని చంద్రగిరిరామకృష్ణనృపాలా.

క. కలిమిగలనాఁడె మనుజుఁడు, విలసితసత్కీర్తిచేత వెలయఁగవలదా
కలి మేము పొల్లకాలము, కులగిరులా కదలకున్న గువ్వలచెన్నా.

క. రంపలగొడుకులు యాచక, తంటంబుల కేమి త్రవ్వి తలకెత్తేరా
రెండాకు లోక్కపోఁకయుఁ, గొండనుమిరా దానశర్వ కోమటిగుర్వా.

క. కోమటి వేమన త్యాగము, భూమి ప్రసిద్ధంబు కల్పభూజము చెంతం
బామున్నయట్లు తురకా, రాముం డున్నాఁడు చేగదా దెవ్వరికిన్.

క. ఈరేడు జగము లనియాడి, యూరయఁ బదునాల్గు గుడ్లు ననిశము తెక్కలీ
ధీరతఁ బొదుగుచు నున్నది, కోరికి నీకీర్తిహంస కోమటివేమా.

ఈరీతిగా 1 జానకులపాటికుల కొండ్రాజా 2 లక్షణరంగా 3 బంగరు య్యాచా 4 కచ్చిరంగభాగ్యతరంగా 5 చిన్నరంగ బుద్ధిభుజంగా 6 రాయని బాచా 7 శాఖమూరి మల్లయజన్నా 8 యాతముగంగా 9 పులుగంటన్నా 10 అళియతిరుమలరాజా 11 పిచ్చయరంగా 12 బొమ్మయలింగా 13 కుమార భట్టరార్య 14 భట్టుమతిక్కా 15 గంగయ్యసింగ 16 సంకడిమల్లా 17 దాసర చెన్నా 19 కవి వెంకన్నా 18 రాయబిరుదాంకరఘునాథరాణ్మృగాంక యనుసం బోధనలతోఁ బెక్కు పద్యములుగలవు. మఱియుఁ దంజావూరిమీఁద:—

క. పురముననుండేకవులే, చోరంబడి తినఁ గూడులేక చుంబించంగాఁ
బరకవు లేటికి నచ్చిరి, తరమెఱుఁగక అరికి విరికిఁ దంజావురికిన్.

క. లేదా తంజావూరిదొ, రాదొరలున్నారు లంజలకు మాపోడిం
జేఁ దేవా రెవ్వరు నీ, యాదరణ వినాగ నరసయప్రభునాఁగా.

అను నీరెండుపద్యము లేసందర్భములోనివో కలవు.

9. ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము. గ్రం। సం॥ 1077

ఈసంపుటములో నారణ్యపర్వమును స్త్రీపర్వమును గలసియున్నవి. 308 పత్రములు గలవు:—ప్రారంభమున.

ఉ. ఆసరసీజయోనిరసనాగ్రములందుఁ బ్రభూత మైనవే
దాసవపానమత్తు నపరాం (బుజ) లోచను భారతార్థవి
ద్యాసువిలాసుఁ బ్రాప్యడసితాంబుదకాంతితనూవిభాసు న
వ్యాసమునీంద్రవర్యుని పదాంబురుహంబుల కేను మ్రొక్కెదన్.

అనుపద్యము తరువాత శ్రీకీర్తిశ్రీవల్లభ-యనుకందపద్యము వ్రాయఁబడి నది. ప్రథమాశ్వాసాంతమున శ్రీకుడుపూరుహరిహరాయనమః.

శ్లో. వైదేహీకుచమండలాగ్రవిలసన్మాణిక్యహస్తాంబుజం
కాంచీకంకణహారనూపురలసత్కేయూరహారాన్వితమ్
దివ్యశ్రీమణికుండలోజ్జ్వలమహాభూషాసహస్రాన్వితం
వీరశ్రీరఘుపుంగవం శరకరం సీతాసమేతం భజే.

శ్రీవేంకటరమణాసహాయం శ్రీరామాయనమః శ్రీరాములుమాదైవము-అనుపద్యమునుగలవు. ద్వితీయాశ్వాసాంతమున శ్రీకుడుపూరినీలకంఠేశ్వరాయ నమః, శ్లో. సాకేతేశరదిందుకుందధవళే-అనునదియు, తృతీయాశ్వాసాంతమున శ్రీకుడుపూరినీలకంఠేశ్వరాయనమః.

శ్లో. కర్పూరాంగవిలేపనం రఘుపతిం రాజీవనేత్రాయుతం
కస్తూరీతిలకాకృతిం విమలసత్యాంత్రాత్మా మేకం ప్రభుం
కందర్పాయుతకోటికాంతిసదృశం కారుణ్యపాథోనిధిం
కాంతంకా—ఇంతే—యున్నది.

చతుర్థాశ్వాసమునడుమ — అంబరపూరితంబులై — యనుదానితర్వాత ,' యిక్కడనుంచియత్రాప్రగడగారికవిత్వమారణ్య పర్వశేషము అని- ౧౨౭-వ పత్రము రెండవప్రక్కను "స్ఫురదరుణాంశురాగ" ప్రారంభించెను. ఆశ్వాసాంతమున శ్రీకుడుపూరు నీలకంఠేశ్వరాయనమః అని. పంచమాశ్వాసములో గద్యమున్న ౧౮౩ పత్రము లేదు. సప్తమాశ్వాసము చివర—

సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూరనార్యునకును బోతమాంబకును
నందనుం డిలబ్రాంకనాంటిలో నీలకంఠేశ్వరస్థానమై యొసక మెసంగ
గ్రుడ్లూరి నెలవున గుణగరిష్ఠతనొప్పు ధన్యుండు ధరైకతత్పరాత్ముం
డెఱ్ఱనార్యుండు సకలలోకైకవిదితుం డైన నన్నయభట్టమహాకవీంద్ర
సరససారస్వతాంశప్రశస్తి తన్నుఁ, జెందుటయు సాధుజనహర్షసిద్ధిగోరి.

క. ధీరవిచారుడు తత్కవి, తారీతియ కొంతదోంప దద్రచనయకా
నారణ్యపర్వశేషము, పూరించె గవీంద్రకనఁ బుటపేయముగఁ.

క. వీరావతారవిమలా, చార అని కలదు—గద్యాంతమున శ్రీకుడుపూరునీలకంఠేశ్వరాయనమః శ్రీసీతారామార్పణమస్తు. శ్రీకుడుపూరుమదనగోపాలాయనమః. సౌమ్యనామసం॥ శ్రావణబ ౧౦ సో॥ వర్కు బాలాంత్రపు కృష్ణంరాజుగారిప్రతినున్న క్రమానున అరణ్యపర్వం సంపూర్ణంగా మల్కపల్లి బోగిరాజు ఖానాకువ్రాశెను. వ్రాలాశభ్రలు ఇత్యాది ౨౬౭ పత్రము. ౨౬౯ నుండి స్త్రీపర్వముగలదు. గ్రుడ్లూరునీలకంఠేశ్వరస్వామికి గుడుపూరునీలకంఠేశ్వరస్వామికి నేమైనఁ జుట్టఱికము న్నదా. మల్కపల్లి జోగిరాజుగారిచ్చినది.

10. ఆంధ్రమహాభారతము - ఆరణ్యపర్వము - గ్రం - సం. 1123.

ఇందును అరణ్యపర్వముతో సౌప్తికపర్వమును గలదు. ఆరణ్యపర్వము 235 పత్రము. ఇందుఁ బ్రత్యాశ్వాసమునందును వరుససంఖ్యతో నాశ్వాసమునందలి పత్రసంఖ్య వేఱుగా వేయఁబడినది. ఇందు మొదట క. శ్రీకీర్తి స్త్రీవల్లభ

అని తర్వాత అక్కథికుండు శౌనకాదిమునీంద్రులకు— అనుచో కథకుండు అని మొదట వ్రాసి థిక్రింద దిద్దినాఁడు. సర్వత్రకథికుఁ డనియే కలదు. వ్రాఁతలో సున్నలపిమ్మట దిత్వములు లేవు. అఱసున్నలు శకటరేఫలును లేవు. పద్యాంత ములన్, పూర్తిగా వాడినాఁడు. కొన్నిటికి, ఇట్లనియే, ముహూర్తమాత్రంబునా యనిదీర్ఘము లున్నవి. ౧౦౬-వ పత్త్రములో అనఁగా నాల్గవయాశ్వాసము ౧౧ పత్త్రములో—శారదరాత్రు లను పద్యము తర్వాత "నన్నయభట్టుకవిత్వము యిక్కడికి సంపూర్ణము యింతటనుంచి అరణ్యపర్వశేషము యఱ్ఱాప్రగడ విరచితము—

చ. స్ఫురదరుణాంశురాగరుచి బొంపిరివోయి నిరస్తనీరదా
వరణముల్లై దళత్కమలవైభవజృంభణ ముల్లసిల్ల సు
ద్ధరతర హంససారసమధువ్రతసిస్వనముల్ చెలంగఁగా
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళ జూడఁగాఁ." అని

అన్ని తావులను, అక్షరమున ద్విత్వము వచ్చునపుడు "నీరదావరణముల్లై వైభవజృంభణము ఇట్లె యున్నది గాని యెత్వమిచ్చి యైత్వమిచ్చినతా వెక్క డను లేదు. భవ్యచరిత్రుఁ డనుపద్యములో పోతనార్యునకును సూరమాంబిక కును" అనియును, ధీరవిచారుఁడు అనుదానిలో "తత్కవితాగీతియె, తద్వచ నయె కాననియు భేదములున్నవి. ఎవ్వరువ్రాసినది తెలియదు. ఏలూరిలో మల్లంపల్లి కోటీశ్వరశర్మగారిచ్చినగ్రంథమిది.

11. ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము గ్రం. సం. 1107.

ఇది యొక్కటే—యిందు రెండవపర్వ మేదియుఁ జేరలేదు. 228 పత్త్ర ములు. ఇది పిశిపాటితిమ్మయ్యశాస్త్రులగారికొమారుడు వెంకటదాసు భారతము అరణ్యపర్వము సంపూర్ణముగా వ్రాసుకొనెను. (సౌమ్యనామసంవత్సర భాద్రపదశుద్ధ సప్తమీశుక్రవారంవరకు)—ఏలూరునోరిసీతారామశాస్త్రిగా రిచ్చి నది. దీనియందును ఐత్వము పైదానిలోవలెనే కలవు. సమస్తవిధములఁ బై ప్రతిని బోలియున్నది. నాల్గవయాశ్వాసములో ౧౦౫-వ పత్త్రము (అనఁగా చతు ర్థాశ్వాసము ౧౦-వ పత్త్రము) లో యథాప్రకారము నన్నయభట్టుకవిత్వము యిక్కడికి సరీ సంపూర్ణము యింతటనుంచి అరణ్యపర్వశేషము యెఱ్ఱాప్రగడ విరచితము అనియును చిట్టచివర భవ్యచరిత్రుఁడు, ధీరవిచారుఁడు ననునవియుఁ గలవు. పోతనార్యునకు సూరమాంబిక కనియే కలదు.

12. ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము. గ్రం. సం. 108.

ఇం దొక్క యారణ్యపర్వము మాత్రమే కలదు. శ్రీకీర్తిప్రియవల్లభ యనిప్రారంభము. వ్రాఁతతప్పు లనేకవిధములఁ గలవు. అయ్యోడకు, అయ్యోడ; వలసెకు వలశె ననియు ఏమిశేయుదు, దరిశి తల్లిదండ్రులు ఇంవ్కుండు మొ॥ అరసున్నలకు బదులెల్లచోటుల నిండుసున్నలు నిండుసున్నలతర్వాతియక్షరము ద్విత్వము—శకటరేఫములు పాటింపలేదు. అయ్యోడమని కలదు. ౧౧౫ పత్రములో, యింత్రటనుంచ్చి యఱ్ఱాప్రగడగారు చెప్పిన ఆరణ్యపర్వశేషము అనికలదు. సూర్యనార్యునకును పోతమాంబ్బికకును, బ్రొంకనాటిలో - గుంట్టూరినెలవున గుణగరిష్ఠత-సరససారస్వతాంత్త్రప్రసక్తి-తద్రీతియ తద్రచనయయనికలదు. ౨౫౯ పత్రములు సంపూర్ణము. ఎవ్వరిచ్చినదో యెక్కడనుండి వచ్చినదో తెలియరాదు. ప్రమాదినామసంవత్సర ఫాల్గుణశు ౭ ఆ॥ సర్కి వాత్రేవు కామయ్యగారు వ్రాశిన ప్రతినుంన్న క్రమాసను శ్రీమహాభారతములో ఆరణ్యపర్వము నడ్డాదివెంక్కయ్యగొమాళ్లు నరిశింహ్యులు వ్రాయించుకొనెను. మంగ్గళమః.

13. ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము. గ్రం. సం. 103.

ఇందు శ్రీకీర్తిశ్రీవల్లభ యనిప్రారంభము: ఆరణ్యపర్వ మొక్కటియే 257 పత్రములలోఁ గలదు. ఇందును వ్రాఁతతప్పులు కావలసినన్ని. వ్రాయసకాండ్రయాచారప్రకారము కంటె నెక్కుడు గలవు. అన్నింటితోపాటు శమిఇంచుమొ॥ సూపము లిందెక్కుడు. ఎఱ్ఱాప్రెగడగారి భాగము నాలవయాశ్వాసములోఁ గలదు. ఇంత యఱ్ఱాప్రగడగారు చెప్పిన ఆరణ్యపర్వశేషము అని ౧౧౧ పత్రము రెండవవైపునఁ గలదు. తర్వాత స్ఫురదరుణాంశురాగమునబొంపిరిపోయి యని మొదలు - చివరసీసములో సూరనార్యునకుఁ బోతమాంబికకు -గుంటూరు నెలవునగుణగరిష్టత, యనియున్నది. అక్షయనామసంవత్సర ఆశ్వీజబ ౨. గురువారంనర్కు జొంన్నలగడ్డవ్యాసులుగారి పెద్దకొమారుఁడు కామయ్యస్వంతముకు శ్రీపార్వతీపరమేశ్వరార్పణముగా వ్రాసుకొనెను. వ్రాలాశభ్రలు తప్పులు త్సాలాగలవేను శబ్దసంఖ్య లెరుగసుం - అనుపద్యమున్నది.

14. ఆంధ్రమహాభారతము—ఆరణ్యపర్వము. గ్రం. సం. 944.

ఇదియు నొక్కపర్వమే విడిగా నున్నది. శ్రీకీర్తిశ్రీవల్లభ, అక్కధికుండు, ఊరుభంగం బయ్యెడమని, నన్నభట్టుగారు చెప్పినకవిత్వము సమాప్తము, అరణ్యపర్వశేషము యఱ్ఱాప్రెగడంగారిచవిరచితము, స్ఫురదరుణాంశురాగరుచి బొం

పిరిపోయి యనియుంగలదు. సప్తమాశ్వాసముచివరఁ గొంతలేదు కాఁబట్టి భవ్య చరిత్రుఁ డాదిపద్యములుగలభాగము కనఁబడలేదు. మొత్తము 255 పత్రములున్నవి. నడుమనడుమఁ గొన్నిపత్రములలోఁ గొంతభాగము వ్రాయఁబడలేదు. మాతృకలో లేదు కావలయును. నర్సాపురం గంగ విశ్వనాథశాస్త్రిగా రిచ్చినది. అక్కడక్కడ శ్రీగిరీశ్వరా! ఉమామహేశ్వరా! ఆపన్నార్తిహారేశాయ శంకరాయ నమోనమః అనుమాటలుండుటంబట్టి యెవ్వరో శైవుఁడు వ్రాసియుండురు.

15. ఆంధ్రమహాభాగతము—ఆరణ్యపర్వము. గ్రం. సం. 363.

ఇదియొక్కపర్వమే యీగ్రంథములోను గలదు. ఇది దక్షిణదేశప్రతి. సత్తెం వేంకటేశయ్యగా రిచ్చినది. దక్షిణదేశమునఁ బ్రచారముచేసిన వారి సేతు రామయ్యగారు సంపాదించినది. 231 పత్రములు గలది. ఊరుయుగళంబు భగ్నంబయ్యెడమని కలదు. అక్కఢకుండు, సర్వత్రపూర్ణబిందువుశార్వాత ద్విత్వములు వ్రాఁతతప్పులుం గలవు. అక్షరలోపములు పెక్కుతావులఁ గలవు. చతుర్థాశ్వాసములో యింత్తనుండి యెగ్రాపగడవారికృశము అనితర్వాత "స్ఫుర దరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి "యని ప్రారంభించెను. సప్తమాశ్వాసము కడపట భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుం డనుదానిలో బోతమాంబిక, పోకనాటి లో, గండ్లూరు నెలవున గుణగరిష్ఠత, పూరించె కవీంద్రకర్ణపుట మోదముగానూ అని పాఠభేదములు కలవు. ఈరీతినే వ్రాఁతతప్పులు పెక్కులు. శుభకృతునామ సంవత్సరం పుష్యశుద్ధ ౧౪ యింద్దువాసరమున్ను పుష్యమీనక్షత్రమున్ను కూడినశుభదినమంద్దలి గోకవరం వెంకట్రామయ్య ఆరణ్యపర్వం సమాప్తః అని యున్నది. కొంతికాలమున కీవల నొక్కరు సమాప్తః అనుదానిక్రింద "వ్రాసినది" అని చేర్చినారు. ప్రాలాశభ్రలు పద్యముగలదు.

16. ఆంధ్రమహాభారతము—ఆరణ్యపర్వము. గ్రం. సం. 1131.

ఇదియొక్కటే పర్వము. 226 పత్రములు. ఏలూరు కేప్పా నాగేశ్వర సిద్ధాంతిగా రిచ్చినది. ఇందును శ్రీకీర్తిస్త్రీవల్లభ, అక్కఢకుఁడు, ఊరుయుగంబు భగ్నంబయ్యెడమని శాపంబిచ్చిన, ఇట్టివిగలవు. కొంతయొక్కరుఁ గొంతయొక్కరును వ్రాసినట్లు భేదము గలదు. ఒక్కరు వ్రాసినదానిలో "భార్గవుండగు నచ్యవనుండు, కృతస్నానుల్లనవారు నిట్లు గలదు. రెండవవాని వ్రాఁతలోఁ నిరస్తనీర దావరణములై దశత్కమతవైభవోజ్జృంభణముల్లసిల్ల, అనియోత్త్వశ్వములు గలవు ఈరెండవవారి వ్రాఁతలోఁ దప్పులుతక్కువ.

శా. దానాంభఃపటలంబునం బృథుపయోధారావలిం దాల్చి గ
ర్జానిర్ఘోషము బృంహితచ్ఛలన నాచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గనా
గా నొప్పారె మదోత్కటద్విరదసంఘంబుల్ వనాంతంబునన్.

ఇట్లున్నది. నన్నయభట్టుకవిత్వము యిక్కడికి సరిసంపూర్ణము యింతట నుంచి అరణ్యపర్వశేషము యెర్రాప్రగడవిరచితము, అనికలదు. పోతనార్యునకును సూరమాంబికకును అని యున్నది వ్రాసినవారి పేరులు తెలుపఁగన లేదు. మూఁడవవ్రాఁతకాఁడును సాయపడినట్లు కొన్ని పత్రములలోఁ గననచ్చును. అక్షరములు చక్కనివే గాని యీతఁడును దప్పులు వ్రాయువాఁడే. "గ్రంథ మిదియు గర్కోటకుని దమయంతి పుణ్యమూర్తి యనవలును, ఋషిచరిత్రక్షన ఋతుపర్ణు గీర్తింప, గభయంబులెల్ల గ్రాగుచుండు" అని యిట్లుండును. శీఘ్రముగా ముగించుకొనుటకు ముగ్గురుంగలసి కొంతకొంత భాగము పుచ్చుకొని వ్రాసికొనిరి.

17. కువలయాశ్వచరిత్రము. గ్రం సం. 72.

నవరము చిననారాయణనాయకప్రణీతము.

గద్యము—ఇది శ్రీమదనగోపాలకృపాకటాక్షవీక్షణసమాసాదిత సరస కవితావైభవ నవరసునవ్యాభరణ తిమ్మభూపాలతనూభవ శతగోపతాపనేంద్ర చరణారవిందసంచరస్నానసమిళింద సంతతభారతభాగవతాదిశ్రవణానంద కామినీ మనోహర రూపరేఖావిజితచైత్ర కాశ్యపసగోత్రపవిత్ర జాతివార్తాకవిజనామోద సంధాయక చిననారాయణనాయకప్రణీతం బైనకువలయాశ్వచరిత్రం బనుమహాప్రబంధంబునందు—

ప్రారంభపద్యములు:—

శా. శ్రీరాధాలలనాధరాధరసుధాబృందాతిమాధుర్యగా
ధారీతుల్ ప్రకటించి లీల మురళీధారేయుఁడై గీతసం
చారంబు ల్వెలయించు కృష్ణుఁడు దయాసర్వస్వతాగౌరవం
బూరన్ సారమునారణాధిపుఁ జిరాయుశ్శ్రీయుతుం జేయుతన్.

. తనమందహాసనూతనకాంతి కాంతుకీర్తికలాపములును సంధించుకొనఁగఁ
దనయాస్యఘుర్మంబు ధవరాగరసఝురీపటలితోడుత మాటపలుకులాడఁ
దనతనూదీప్తిసంతతులు నాయకమహాస్తోమంబునకును విందులు ఘటింపఁ
దనయురోజాలసత్వంబు మనోనాథకఠినధైర్యముతోడఁ గలసిమెలఁగ

రాజులఁ దిరస్కరించుచు రమణుఁడున్న, యరద మెక్కి నరుక్మిణీసరసిజాయ
తాక్షి సవరచు నారాయణాధిపేంద్రు, శుభదయాపూర్ణవీక్షఁ జేఁ జూచుఁగాత

ఈనారాయణాధిపుఁడు కవికిఁ బాలకపితయుఁ దనజనకపితకు సవతితమ్ముఁ డునై యున్నాఁడు.

మ. అలతిమ్మాధపునారణేంద్రుఁడు దయోదారుండు నన్నుం జయో
జ్జ్వలుఁ గృష్ణాధిపుపుత్రు వేంకటపతిత్మ్కాకాంతచంద్రుం గుమా
రులఁగాఁ గైకొని ప్రోచెఁ గాన నతఁడే రూపింపఁగా దల్లిదం
డ్రులు దైవంబును నయ్యె నిందులకు నెందుఁ సందియుం బేటికిఁ. అని.

పాలకజనకునకే యీయైదాశ్వాసముల ప్రబంధముం గృతి యిచ్చెను. ఈ నారాయణనృపాలుఁడు వీరవేంకటరాయలకరుణఁ బరఁగువాఁడఁట. కర్ణాట రాజ్యములోని వాఁడగును. ఈతని నివాసస్థానము.

క. మణినాగనగరకాంతున, కణుమధ్యాజనమనోజయంతునకు సుధీ
గణగణితరామణీయక, మణిఘృణిపణితాతిమంజిమనిశాంతునకుఁ.

అనుషష్ఠ్యంతపద్యమునుబట్టి మణినాగనగరమని తెలియవచ్చినది. మణినాగనరము నిప్పు డేమందురో! ఈతని సమకాలనృపులు—

సీ. తనమాట చెంజికాతంజాపురీమధురాధినాథులకు నెయ్యంబు నెఱపఁ
దనచీటి గోలకొండనరేంద్రముఖధరాధవపద్మబంధు లౌఁదల వహింపఁ
దనకీర్తి మట్లనంతనృపాలముఖ్యగోత్రానురేంద్రులు గొనియాడికొనఁగఁ
దనదానగుణము గోదావరీతీరభూనిర్జరేశ్వరులు వర్ణించికొనఁగ
వెలయు వేతండగండనిర్గళదనర్గ, ళమదధారాధునీనాథకుముదబంధు
కార్యకృడ్డిండిమారావధుర్యసైన్యుఁ,డతఁడు ప్రభుమాత్రుఁడే నారనాధినేత.

అను పద్యమునలన నెఱుఁగఁబడుచున్నారు. ఈనారాయణనాయకకవి కవిత్వము ప్రౌఢమైనది. కల్పన లద్భుతములు. అం దందుఁ గొన్నిలక్షణవిరుద్ధపదప్రయోగములును గలవు. మచ్చునకుఁ గొన్నిపద్యములు.

సీ. తనయిల్లు విడిదిసేయ నటంచుఁ జలపట్టు కొడుకుచేతులు పట్టుకొనఁగవలసె
నలరంభ వారి కీయ నటంచు వాదించు కౌబేరి కుడుగర గప్పవలసె
నులుపక్కై యీఁగిమార్కులచెంతకునుదా నెచనియిప్పుడా దుకొమ్మనఁగవలసెఁ
దెల్ల తేజీఁగన్నఁ దెమ్మందురో వార లని దాని వెస దాఁచికొనఁగవలసె
నౌర తిప్పనృపాలు బాహాసిధార, నవని విడనాడి యొమ్ముగాయముల వచ్చు
కడిఁదిపగరకు నుచితము ల్నడుపునపుడు, చాలు వజ్రికి నమరరాజత్వగరిమ.

సీ॥ విడు పైఁటచెఱఁగు నే వెఱతు గాయము మానసిమ్మని చాయ యెంతేని వేఁడ
నశ్వినుల్ మందులకై ద్రోణగిరికి నిచ్చలు పోవు కతన వేసరుకొనంగ
నిరుపద్రవముగాను నిలువరా దని రమాపతి వేఱ పాళెంపుపట్టు వెదక
నాయయ్య కిది యుపాయ మంచు నలసింహ కాంతనూభవుఁడోడుగ అడిగికొనఁగఁ
జెలఁగుతోఁగ కొమ్మమో మింతసేసికొనఁగఁ, దిమ్మనృపశౌరిదినదినోద్భిన్నవైరి
వారబహువారభేదనవర్ధమాన, మైన రవిమేని పెనుగండి మానదయ్యె.

సీ. ఐశ్వర్యగతిమీఁద నరుచిపుట్టినఁగాని బలహాంత మీఁదెంత నిలువ వెఱచుఁ
జక్కఁదనంబుపైఁ జౌక దోఁచినఁగాని సురభామ మీసీమఁ జొరఁగ వెఱచుఁ
దన పేరుమాత్రంబు కనరు వేసినఁగాని హరిపట్టి మిము గిట్టి యడుగ వెఱచు
విబుధదాతృతమీఁద వెగటు గల్గినఁగాని వనజారి మిముఁ జేరి చనక వెఱచుఁ
గాన తావకనియమవిఘ్నంబు వడుగ, నళికెదను గాని యోమహాని యట్టు లేని
ఘోరమహానుకతూణీరగుప్తశాఖ, శరములకు నొక్కచరలాట సోదరింపు.

ఈ కువలయాశ్వచరిత్రమును గొంతకాలముక్రిందటఁ గాకినాడ సరస్వతీ పత్రికాధిపతులు కీ॥ శే॥ పోలవరము జమీందారుగారు ముద్రించిరి.

18. చంద్రాననాదండకము--గ్రం. సం॥ 55.

నుదురుపాటి సాంబకవిరచితము. ఈసాంబకవి యాంధ్రభాషార్ణవకర్త యగు వేంకటకవిపుత్త్రుఁడు - తొండమాన్ నృపాలురయాస్థానములోని కవి యితఁడు. ఆసంస్థానములోని తనప్రభువుపైఁ జెప్పినదే యీదండకము. కారణ మేమో యెక్కడఁ జదివినను రాజుపేరు, వంశము వచ్చినతావుల నెల్లఁ జోటు విడిచిపెట్టినాఁడు గాని వ్రాయలేదు కాఁబట్టి వారిపేరులు తెలియరావు.

దం॥ శ్రీదక్షిణాభిఖ్య గోకర్ణవక్త్రారవిందస్ఫురద్దివ్యతేజస్సదాధ్యానసక్తాత్మ భావుండు భావోద్భవామిత్రఫాలాక్షి కీలాసమానప్రతాపార్కబింబద్విషద్ధ్వాన్త వారుండు, వారాశిగాంభీర్య గాఢత్వదానప్రవీణాతిగంభీరతాశాలి శాలీనవిద్వద్ధరాపాలమాళీస్ఫురన్మంజు రత్నచ్ఛవిచ్ఛన్న చక్రాదిరేఖోల్లసత్పాదపద్ముండు, పద్మావధూటీపదాబ్జస్ఫురద్రత్నమంజీరసంగావతులోల్లసద్రమ్యతౌర్యత్రికస్నాన భాస్వన్నిశాంతుండు శాంతాత్తదాంతద్విజాశీర్వచఃప్రాప్త దీర్ఘాయురారోగ్య సామ్రాజ్యలక్ష్మీసనాథుండు - - - వంశాబ్ధిసోముండు సర్వజ్ఞతాతుల్యకాముండు - - - - మహీనాథుపౌత్త్రుండు, సల్లక్షణోపేతగాత్త్రుండు - - - - ధాత్రీంద్రపుత్త్రుండు రాకేందునీకాశసత్కీర్తుండు, హూణాదిరాజన్యసంస్తూయమానోల్లస - - - - సమాఖ్యాభిరాముండు - - - - తానొక్కనాఁటన్ హజారంబునం

భేటికై భూపతుల్ కాచి యున్నారనే జాడఁ దెల్పంగనో నాఁగ భూపాలరాగా దులన్ మాగధుల్ వేకువ స్నానముల్ సేయఁ దద్రాగనామంబు డెందంబునం దోఁచ స్వీయేతరంబైన భూపాలశబ్దాక్షమత్వంబునం గిన్కనుంబోలె నోనాఁగ విప్పాచు నొప్పారు నేత్రారవిందంబులం గెంపుడా ల్కొంత చెన్నొంద భూమండలి న్నీసమానంబునుం జూడఁగాఁ గోరితే దర్పణంబందునే గాక వేఱెందునం గానరా దంచుఁ జూపించె నోనాఁగ వాల్గంటి యొక్కర్తు తాఁ జేతినిం బూనునద్దంబునం జూచి ------ స్వర్ణస్ఫురత్పూర్ణకుంభంబునుంగాంచి ------ స్నానగేహంబునం జేరి బల్చల్లనౌ చుక్కరారాతిపీఠంచ కాల్ పీఠఁ గూర్చుండి --- కృతస్నానుఁడై ----- ఫాలమ్మునన్ భూతినింబూని --- సద్బంధువర్గంబుతో భుక్తిని న్సల్పి వాల్గంటి యొక్కర్తు తాపండుటాకుల్ శుక్తీతుండహస్తంబుచేఁ జుట్టి యియ్యంగ బాగంబునుం జేసి ---- హజారముం జేరి కొల్వుకై మూగియున్నట్టి దళ్వాయులన్ శౌర్యచాతుర్యయుక్తుల్ జెమెదార్లనుం దాకృపాకటాక్షంబుచేఁ జల్లఁగాఁ జూచి సాది న్నిరీక్షింపఁగా వాఁడు ---- ముస్తీదుగావించి సర్వోత్తమత్వంబునుం దెల్పు మేల్దేవమణ్యాది నానా విధావర్తసల్లక్షణంబైన బారాహజార్ తేజి మున్ముంగలఁ న్నిల్పఁగాఁ గాంచి యత్యున్నతం బైన యంకెం బదంబూని ---- వాగె కేలాసరాగాఁ జివ్వుక్కుంచు పైదాఁటి దౌర్చుక్కఁగాదీర్చునాలోననే నిల్వకే చిందులంద్రొక్కుచోఁ గందముం దట్టుచుండ ---- నవ్వేడుక ల్పొడఁగా మేడలన్ సంభ్రమం బొప్పఁగాఁ బాలమున్నీటిలోనుండి పైవచ్చు లక్ష్మీసరోజాక్షియో నాఁగ నీరాడుచున్నుండి యట్టే వెసన్నార్ద్రభావంబుతో నొక్కపూఁబోఁడి వచ్చెన్ ---- (అని మొదలైనది. ఇంకమీఁద నాపూఁబోఁడి విరహము --- ఈరాజుగారితో వివాహము) ఆకాంతతోఁ గూడ హాయిగా మానసానందసంధాయిగాఁ గూడి --- యారాధకంజేరు శ్రీవేణుగోపాలుచందంబున న్నిత్యలక్ష్మీసనాథుండుగా నుండుమంచున్ శుభాకారుఁడై సద్గుణాధారుఁడై సత్కళాభోజుఁడై రాజ్యసంరక్షణోద్యుక్తుఁడై ---- సద్గర్భవారాశిరాకానిశాకాంతుఁడై సద్యశః కాంతుఁడై యొప్పు ---- క్షితీంద్రుపేరన్ స్ఫురన్నిత్యసామ్రాజ్యసత్పుత్రసంతానసంపత్తు లింపొంద నుద్దండవిద్వత్కవిత్వాంకనుండైన శ్రీసాంబనాభిఖ్యవిద్వత్కవీంద్రుండు కైసేయచంద్రాననాంకంబగున్ దండకం బుర్వి న్నాచంద్రమస్తారమిత్రంబుగా వర్ధిలున్.

ఈదండకము ౨౨ చిన్నపత్రములలో వ్రాయఁబడినది.

2 ఈపుస్తకములోనే, పిళ్లారప్పాయనునవి తొమ్మిదిపద్యములు వేంకటాచలరమణాయనునవికొన్ని పద్యములు నున్నవి. తల్లినన్ను, ఏణీలోచన, అంబుజవాంబుజోజ్జ్వల, తొండము:నేకదంతము, మోదకహస్తునిక్—వీనితరువాత.

క. శ్రీకర రుచివిజితను, ధాకర మృడపార్వతీముదాకర గుణర
త్నాకర వరధీకర పర, భీకర వదనతంకుప్ప పిళ్లారప్పా.

క. మల్లెలు మొల్లలు జాజులు, గొల్లలుగాఁ గోసి తెచ్చి కొనియాడి నినుం
జల్లగఁ బూజింతుము కృప, వెల్లువగాఁ జూడుమప్ప పిళ్లారప్పా.

క. ఓరీ బాలుఁడ నీపిటు, రారా యని నన్నుఁ బిలిచి రంజిలుదయచేఁ
గోరిక లొసఁగుము భువి నీ, పేరును బ్రకటించిచెప్పఁ బిళ్లారప్పా.

క. భక్షింపుము కాపలసిన, భక్షణములు నీకునిత్తు భక్షించియు నీ
కుక్షిగల విద్యమాకుం, భిక్షంబిడి కావుమప్పా—ఇత్యాదితొమ్మిది.

క. ఒకతేప నీగుణస్థితిఁ, బ్రకటింతుఁ బరాకు చకితబలభిన్మణిమే
చరచకచకవికచస్ఫుట, - - - - - వేంకటాచలరమణా.

క. శంకా నాశంకభవ, త్కింకరుఁడను శమనదమన కేళీహాళీ
ఝాంకరణగుహాసరోవర, దంకూరక్రమణ వేంకటాచలరమణా

క. ఎక్కడు నీకొండేగా, యెక్కడు నీదారిసభల నిభవిక్రమ ఘ
నక్కృతబలధిక్కృతన, మ్యక్కృతఘీంకరణ వేంకటాచలరమణా.

క. ఎల్లప్పటికిని మాకిఁకఁ, గొల్లలు మీదాస్యదనము గుహాపుష్కరిణీ
కల్లోలమతల్లీమత, హల్లీసకచరణ వేంకటాచలరమణా.

క. సింహము మెడఘంటను నా, జిహ్వను నినుదలఁచినపుడె సేవనమాత్రా
రంహోజ్జ్వలబంహిష్ఠల, తాంహోసంహారణ వేంకటాచలరమణా.

క. ఆమిడి మ్రొక్కులసామివి, మామకనుతు లెంతచూడు మణిదామనము
ద్దామఘనస్తోమచతు, ర్యామాలంకరణ వేంకటాచలరమణా. మొదలైనవి

క. వకులవననిత్యవాసిని, సకలాభీష్టములనిచ్చు చక్కనితల్లి
ప్రకటితము సేయు మీకృతి, నృకలుషగిరిభేదశంబ శ్రీబృహదంబా.

క. మడువుకుఁజని కాళిందుని, పడిగలపై భరతశాస్త్రపద్ధతి వెలయన్
గడువేడుకతో నాడెడు, నడుగులు నామదిఁదలంతు నచ్యుతకృష్ణా.

గీ. నిన్నఁగుప్పయునేఁడాళ్లు నెలఁతె తాను, గోరి నామీఁదనే చేసెఁ గారుబారు
ముక్కుపచ్చలుమానకమునుపె బిరుదు, పిచ్చికలతోడఁ గాట్లాడవచ్చినట్లు.

గీ. మూఁడుశిరంబులు ముదమొప్పఁ బదికాళ్లు, కలువతోఁక రెండుకన్ను లాఱు
చేతు లెన్న - - - చెవికిఁగొమ్ములు నాల్గు, దీనిభావము దెల్పుతిరుమలేశా.

కొన్ని సంస్కృతశ్లోకములు గలవు.

గరుడేన వినాయాతి గగనే మధుసూదనః
ముక్తకం వృషమారుహ్య భిక్షామటతి శంకరః
జగదధిపాలో మోరో నాయోనరి - - - భం
తం దమయ దుర్వినీతం మర్త్యానివ సూను రంశుమతః
అభిసారినమానోసి వ్యభిచారి సమస్తథా
రూపే పరాక్రమే చైవ నరపాలశిరోమణి ॥
సూకరః కంకణం ధత్తే కంకణే రమణిస్థితా
తత్రాపి తరళశ్చిత్రం కిం దీర్ఘసురతం వినా.
వి రాజరాజపుత్రారే ర్యన్నామచతురక్షరమ్
పూర్వార్ధంతవశత్రూణా ముత్తరార్ధం తవైవహి ॥
రావణస్యకియద్వక్త్రం, నూపురంకుత్ర ధార్యతే,
ఆంధ్రగీర్వాణభాషాభ్యా మేకమే వోత్తరంవద ॥ పది ॥
ప్రభాతేకీదృశంవ్యోమ ప్రమాణేకీదృశంవచః, ఆంధ్రగీర్వాణ ॥ నీతోడు ॥
కింప్రియంలోహకారాణాం వాహనంకింశచీపతేః
ద్రావిడామరవార్తాభ్యా మేకమే వోత్తరంవద ॥ కరీ ॥ కరి = బొగ్గు.
దమయంతీనళంద్రృష్ట్వా యయాపరవశీకృతా
సీతాఇత్యుత్తరంయస్య ప్రశ్నస్యతదిహోత్తరమ్ ॥ రాధుమకా
ఉత్తిష్ఠోత్తిష్ఠరాజేంద్ర ముఖంప్రక్షాళయస్వతః (టః)
ఏషఆహూయతేకుక్కు చవైతుహిచవైతుహి.

ఇట్టిసంస్కృతశ్లోకములు సుమారు డెబ్బదివఱకుఁ గలవు. మఱియు జానకీపతి యను తెనుఁగుపద్యములు కొన్ని గజేంద్రమోక్షములోనిపద్యములు కొన్ని ఎఱుపుపద్యములు, పచ్చపద్యములు, నలుపుపద్యములు, తెలుపుపద్యములుం గలవు. వీనిని దసరాపండుగలలో బాలురు చదువుదురు, గాని, యిందలిపద్యములు చాలఁ దప్పులుగా నుండుటచే నా సీసపద్యములును బ్రస్తుతము విడిచి పెట్టఁబడినవి. ఇది దక్షిణదేశమునుండి తెచ్చినపుస్తకము

19. ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము. గ్రం. 2644.

ఈసంపుటములో, ఆది, సభా, ఆరణ్య విరాటోద్యోగపర్వములు గలవు: 359 పత్రములు గలవు. 126 మొదలుకొని ఆరణ్యపర్వము వ్రాయఁబడినది. ప్రారంభము; శ్రీమతేరామానుజాయనమః,

క. శ్రీకీర్తిశ్రీవల్లభ, లోకజనస్తుత్య సర్వలోకాశ్రయర
త్నాకరపరివృత సకలధ, రాకాంతజితారి రాజరాజనరేంద్రా.

వ. అక్కథికుండు శౌనకాదిమహామునులకుం జెప్పినట్లు, అనికొన్నితావులనుగొన్నితావుల "అక్కథకుం" డనియుఁగలదు. భీమునగదాఘూర్ణింబ్బున నియ్యార్యుయుగళంబ్బు భగ్నం బయ్యెడు మని యే శాపమిచ్చినాఁడు.

నాలుగవయాశ్వాసములో యంత్తట చదలువాడ యర్రాపెగడ కవిత్వం॥ అని తర్వాత, భూపతికిం దినంబునకుం బొల్పెసఁగంగ శరత్సమాగంబని ప్రారంభించినాఁడు పత్రములో నంకెవేయుచోట, యింత్తట రెడ్డోవారికవిత్వం, అని సూచించినాఁడు. ఈపుస్తకములో నాయాఘట్టముల విషయసూచిక ప్రక్కలను యుగధర్మాలు,కలియుగధర్మం; కృతయుగప్రవర్తనం, వామ్యాశ్వహరణం, యింద్రద్యుమ్నోపాఖ్యానం, దుంధుమారచరితం అని సూచింపఁబడినది. వ్రాఁతతప్పులనేకవిధములైన విందును గలవు. పూర్ణబిందువు పిమ్మట నక్షరముక్రింద ద్విత్వముండుటయు లేకుండుటయుఁ గూడఁగలదు. సప్తమాశ్వాసము చివర "సూర్యనాహ్వనకును బోతమాంబికకును నందనుం డిలపాకనాటిలో నీలకంఠేశ్వరస్థానమై యెసకమెసగు గుండ్లూరి నెలవున గుణగరిష్ఠతనొప్పు - - - - - సకలలోకైకవిదితుడైన యంన్నయభట్టమహాకవీంద్రు - - - - - అనియు, తత్కవితారీతియకొంత దోప దద్రచనయకా, నారణ్యపర్వశేషము బూరించ్చె కవీంద్రకర్ణపుటపుటపేయముగన్ అనియునున్నది.

ఈసంపుటములో నన్నిపర్వములలో నన్నియాశ్వాసములలో మొట్టమొదట జిత్రజిత్రములైన లతలు, చిత్రములు, శంఖచక్రాదులు, బహునిపుణముగా వ్రాయఁబడియున్నవి. ప్రత్యాశ్వాసముచివరను, శ్రీమత్సదాచార్యశేషగురువేయనమః శ్రీమద్వేంకటవరదాచార్య గురువేయనమః అనియున్నది ఏసంవత్సరములో వ్రాయఁబడినదో యెవ్వరు వ్రాసిరో తెలియరాదు. దత్తమండలములలో సంపాదింపఁబడినది.

ఆదిపర్వములో "అని సకలభువనరక్షణప్రముఖులై - - - - - పద్మోమావాణీపతుల నుతియించి - - - - -భారతభారరణంబునందు నారాయణునట్లుదాను వసుధామరవంశవిభూషణుండు - - - - - అది మికప్పంబులు మోదముతోఁ గొనుచును బలిమిని యుంన్నభూవలయపతుల నుక్కణగింపుచు దిక్కులదనయాజ్ఞ వెలిగించుచు - - - - గలవు. పదిదినము లైదుప్రొద్దు లను కందపద్యము లేదు. రూఢిం గౌరవసైన్య మీాయుభయముల్ అని కలదు. "కాదన

కిట్టిపాటియుపకార" మను పద్యము ప్రథమాశ్వాసములో లేదు ద్వితీయాశ్వాసములో, నేకవిప్రసంబోధన చేసిచేసె రిపుసూదన అని యున్నది విరాటపర్వములో, శ్రీయను గౌరినాఁ బరఁగుచెల్వలచిత్త మని కలదు. వ్రాఁత మంచిది.

20. కచ్చిరంగరాజదండకము గ్రం. సం. 67

ఇదియుఁ జంద్రాననాదండకమువంటిదే.

దండ. శ్రీమత్సమస్తావనీనాథయూథైక సంస్తుత్య నిస్తుల్య కల్యాణ నానాగుణశ్రేణికాపాదనానూన కచ్చాన్వయక్షీరవారాశిసంపూర్ణచంద్రుండు చంద్రాభ్రమాతంగ చంద్రాతపాభంగ సాంద్రామృతాంభోధునీభంగ రంగత్సుధాశారదా శారదాభ్రౌఘవిభ్రాజితాదభ్రశుభ్రస్వకీర్తి ప్రధావాహినీబుద్బుదీభూత కంజాతగర్భాండసంఘుండు సంఘాతితారాతిభూపాతిమాత్రోన్నమత్కుంభికుంభస్థలీ నిర్గళద్వ్యక్తముక్తాతతిస్ఫీతశోభాభరప్రాపితక్షౌమ రాజద్వితానాధికద్యోతమానాభ్రదేశుండు దేశాంతరాయాత (శుంభ) త్కవీంద్రాద్య విద్యాధికశ్రేణి సంరక్షణాక్షీణ కారుణ్యధారాధురావార సత్సత్కటాక్షుక్షణోదార శారామభద్రుంపు భద్రేభయానానవీనప్రసూనాస్త్రకల్పుండు కల్పావనీజాత భాస్వత్సునూజాతకంజాత - - - - - దానధారాసుధాపూర పాత్రీకృతాశేషధాత్రీ వరశ్రేణి కర్ణుండు కర్ణాటరాజన్య - - - - - - - - - కచ్చన్వయాధీశరంగక్షమామండలాఖండలస్ఫీతగర్భాబ్ధిచంద్రుఁడు జ్ఞానప్రసూనాంబికాపుత్ర రత్నాగ్రగణ్యుండు - - - - - శ్రీయౌవరాజ్యాభిషిక్తుండు సర్వక్షమాపాలనాశక్తియుక్తుండు శ్రీకచ్చిరంగావనీపాలచంద్రుండు తానొక్కనాఁ డెక్కువా మక్కునల్ పిక్కటిల్లంగఁ దొల్లుబ్బలి న్నిబ్బరంబొప్పఁగాఁ గన్నుదెత్తమ్మిరామేటి గాటంపుఁ గెంజాయచే నట్టగన్పట్టు నప్పట్టునన్ వందిబృందస్తవంబుల్ చెవిన్ సోఁకగా లేచి నెత్తావి చెంగల్వ రేకుల్ పొసంగం బసంగాంచు పూసజ్జలో మెల్లనేనిద్ర మేల్కాంచి యక్కాంచనాంచ చ్ఛుభాంభకుంభాది సద్వస్తువుల్ గాంచి నిద్దంపు పెన్నిల్లువ్వటద్దంబు వీక్షించి, - - - - - - చల్లడంబుం గడుం బాగుగాఁ దాల్చి వాటంబుగా నాము కూటంబునం జేరి - - - -

ఈరీతిగా వర్ణనాంతరములతో రాజుస్నానము భోజనము వేషము సభాప్రవేశము వీథులవెంట వాహ్యాళి, మేడమీఁదనుండి యెవ్వరో పడుచుదిచూచి విరాళిఁబొందుట దాని సంధానము-ఇదియేకథ-కవి యెవ్వరో తెలియరాదు. కవిత్వము చంద్రాననాదండకములోకంటె విశేషవర్ణనలు, పదజటిలముఁ గలది. యమకములు గమకములు మెండు-పూర్తిగాలేదు. 4(పత్రములుగలవు.

దక్షిణదేశప్రతి:-ఎళవనూరు కళ్యాణరామయ్యగారిచ్చినది.

21. ఆముక్తమాల్యద - వ్యాఖ్యానము - గ్రం. సం. 68.

ఇది దక్షిణ దేశప్రతి. పుదుకోట వేంకటశాస్త్రిగా రిచ్చినది. ప్రాచీన వ్యాఖ్యయే యనితోఁచుచున్నది, గాని, యెవ్వరువ్రాసిరో యెఱుఁగరాదు. పద్యములను బూర్తిగా వ్రాయక కొంచెము సూచించి యర్థము భావము వ్యాఖ్యానము వ్రాసినారు. పూర్తిగా లేదు. అన్నిపద్యములకును లేదు. నడుమనడుమఁ గొన్నిపద్యములు విడిచి పెట్టినారు, కొన్నింటికి - అర్థము, కొన్నింటికి - భావము నీరీతిగా వ్రాసినారు. కృత్యాదిని కవిఁగూర్చిన పద్యములు చాలభాగము లేవు. కీ. శే. వావిళ్ల రామస్వామిశాస్త్రిగారు వ్యాఖ్యానము వ్రాయునప్పుడు పరిశీలించిన బహుప్రతులలో నిద్దాని ప్రతియుఁ గల దని కనఁబడుచున్నది. వాఁడుక మాటలలో వ్రాయఁబడినది. ఇందు మొదటిపద్యమును గడపటి పద్యమును మాత్రమిందుఁ దెల్పఁబడుచున్నవి.

ఉ. శ్రీకమనీయహారమణిఁ జెన్నగుఁదానును గౌస్తుభంబునం
దాకమలావధూటియు నుదారతఁ దోఁపఁ బరస్పరాత్మలం
దాకలితంబులైన తమయాకృతు లచ్ఛతఁ బైకిఁ దోఁప న
స్తోకత నందుఁ దోఁచె నన శోభిలు వేంకటభర్తఁ గొల్చెదన్.

వ్యాఖ్యానగ్రంథములో నీపద్యము లేదు. వ్యాఖ్యానము మాత్ర మున్నది. పాఠకులకై యిందు వ్రాయఁబడినది. వ్యాఖ్యానమువ్రాఁత కొంచెము సవరించియే యిందువ్రాయఁబడినది.

శ్రీకమనీయ శ్రీ మహాలక్ష్మియొక్క కమనీయ మనోజ్ఞమైనట్టి హార ముక్తావలదండయందలి మణి నాయకరత్నమందు చెన్నగుఁదానును నిరవధిక సౌందర్యధుర్యుఁడైనటువంటి తానును కౌస్తుభంబునందు స్వకీయవక్షఃస్థలంబున నున్న కౌస్తుభంబునందు ఆకమలావధూటియు ఆమహాలక్ష్మియును ఉదారతఁదోఁపతిన్నదనమునఁ గనుపట్టఁగా పరస్పరాత్మలం దాకలితమ్ములైన అన్యోన్యహృదయగతములైన తమయాకృతులు తమయాకారములు అచ్ఛతఁ బైకిఁ దోఁచి అపగతరజస్తమోవిమోహము లైన అన్యోన్యహృదయముల స్వచ్ఛతచేతను వెలుపటికిఁ గనుపట్టి అస్తోకతను ఆధిక్యముచేతను అందుఁ దోఁచె ననఁ బరస్పరహృదయనిహితనాయకరత్నములందు కనుపట్టెనో యనఁగ శోభిలు ప్రకాశించునటువంటి వేంకటభర్తఁ గొల్చెదన్ వేంకటాచలపతిని సేవించెదను. అనిపద్యార్థము. ఈపద్యమందు మొదట కర్తృద్వయము నేకవచనగ్రహణము చేసినందుకు, అభిప్రాయము, యతోహారిస్తతోలక్ష్మీః యనియు, విష్ణోశ్శేషానపాయినీ యనియు,

హాగర్థావినసంపృక్తా ననియు, అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా ఇత్యాదులైన ప్రమాణసహస్రములచేత నారాయణ పదార్థ గ్రహణముచేత లక్ష్మీపదార్థ గ్రహణము సిద్ధము. ఈపద్యార్థముచేత నీప్రబంధమందు వక్ష్యమాణమైనటువంటి యాముక్తమాల్యద రంగనాయక పరిణయసముచిత పరస్పరాభిముఖ్యావస్థితి వ్యంగ్యమర్యాదచేత సూచితమగుచున్నది. ప్రబంధములయందు మగణస్థితిశ్లిష్టముగా శార్దూలము ప్రయోగించుట కలిగినప్పటికి నిక్కడ నుత్పలమాలికా వృత్తము ప్రయోగించినది యాముక్తమాల్యద చెంగలువపోమాలగదా యని యుత్పలమాలికాసమర్పణము. అందునుంచి భగవన్ముఖోల్లాసము కలిగిన కథ రచియించువాఁడు గనుక ఉత్పలమాలికా వృత్తరూపమైన వాక్సుమదామము సమర్పించినాఁడు.

కడపటనున్న నాల్గవ యాశ్వాసములోని పద్యము.

క. నాసి శిఖి వంటచెఱకుల, చేనవి వెండియును వంటచెఱకులె యగుటన్
బోనములు ప్రజకు జక్కల, బోనంబులెయయ్యెఁ బ్రొయ్యిపొగయమివృష్టిన్.

టీ. అని వేఁడికట్టెలు లేవు గనుక మిక్కిలి కలువకాఁడలవలెఁ దడిసినకట్టెలు పైవేసినందుచేతను తడిసి యారిపోఁగాను అవి ఆయింధనములు మఱి విచారించిన బెల్లము వండ యోగ్యమైన చెఱకులె యగుటన్ బెల్లమువండ యోగ్యమైన చెఱకు లెటువలె రసమైయుండునో అటువలె.

ఇంతేయున్నది ౧౦౦ పత్రములు గలవు

22. వేదాంతప్రకరణము - గ్రం. సం. 60.

ఈ 60 సంఖ్యగలది కాగితముల పుస్తకము. పూర్వపు పీఁచు కాగితములు. ఇందు దీనితోపాటు నవకృతోపదేశము, నిజానందయోగి కృతమైన యుమామహేశ్వరసంవాదము, నారపామాత్యుని గురుగీతాసారము, వేదాంతకీర్తనలు, పంచీకరణము, దృగ్దృశ్యవివేకము నుత్తరభాగమును గలవు. ఇద్దఱు ముగ్గుఱు వ్రాఁతలిందున్నవి. మొదటఁ గొన్నిపాటలును ‘‘అందరాని మానిపండు అందిత్రిమూర్తుల కలవిగాకుండు’ మొదలైనవి గలవు తర్వాత కఠవల్లి ఉపనిషత్తునకుఁ దెనుఁగు నాచికేతు కథగలదు. కొంతమచ్చునకు వ్రాఁతసవరించి వ్రాయఁబడుచున్నది.

‘‘సాధనచతుష్టిసంపత్తి గలశిష్యుఁడైనవాఁడు, ఉపశాంతి గలటువంటి గురునిబోయి శరణుపొంది యడుగు ప్రకారము.

అయ్యా, శరీరమే యాత్మయో, లేక శరీరము కాక వేఱేయాత్మగా యని యడిగిన శిష్యుని జూచి గురునైన సనత్కుమారుఁ డుత్తరము చెప్పే ప్రకారము, వాసవుఁడ నెడు ఋషియైనవారు సర్వస్వత్యాగము చేయునప్పుడు దూడ లేని యావును దక్షిణగానిచ్చెను. అపుడు నాచికేతుఁడను కొమారుఁడు చూచు కొనుచుండి దూడలేని యావును దక్షిణగానిచ్చిన నరకముకలదే, నన్ను దక్షిణ గానిమ్మని మూఁడు మాటలుగాఁ జెప్పెను. నాల్గవసారి చెప్పునప్పుడు వాసవుఁ డను ఋషికి మహాకోపమువచ్చి "నిన్ను మృత్యువునకిచ్చి"తి నని చెప్పిరి. అపుడు పితవాక్య మసత్యముగాఁ బోఁగూడదని తండ్రిదగ్గఱసుత్తగవు తీసికొని ధర్మరాజు పట్టనమును బొందెను. ధర్మరాజు పట్టనమునుబొంది యు ధర్మరాజును గానక మూఁడుదినములు పస్తుండిరి. నాల్గవదినము ధర్మరాజుచూచి యగ్నికి సమాన మయిన బ్రాహ్మణులు మూఁడుదినములు పస్తున్నారే ఆయుస్సును ఐశ్వర్యమును బుత్రులును పశువులకును వీని దేనికిని నాశము వచ్చుచున్నదా యని మూఁడుదిన ములు పస్తున్నందుకు మూఁడువరా లడుగుమని చెప్పినారు. నేను మాతండ్రి దగ్గఱ చేరవలయునని యొకవరము నడిగినాఁడు. రెండవవర మేమి కర్మముచేసి ధర్మరాజుపట్టనము పొందితి నని యడిగినాఁడు. రెండువరముల నడిగి మూఁడవ వరమడుగు ప్రకారము:— అయ్యా పరలోకానికిఁబోయెడు నాత్మనుగొందఱున్న దని చెప్పుచున్నారు. కొందఱు లే దని చెప్పుచున్నారు. ఉన్నదని చెప్పిరా కర్త గాను భోక్తగాను సంసారిగాను నుండును లేదంటిరా యెనా యాత్మకు సంసారమే లేదు దీనినిమీరు నాకుఁ జక్కఁగాఁ జెప్పవలయునని వినయముగా నమస్కరించిన నాచికేతునిజూచి ధర్మరాజు—

పదివుటలుగలదు. కపపట ఆచార్యస్వామిచెప్పిన వేదాంతప్రకరణము సంపూర్ణ మని యున్నది.

2. నవకృతోపదేశము:—"ఎవ్వరురచించినదో తెలియదు. దీనిలోని కొన్నివాక్యములు:—దిద్దివ్రాయఁబడినది

"తత్త్వజ్ఞానము వలననుండి యజ్ఞాననివృత్తికావలయును, తత్త్వజ్ఞానమెందు వలన వచ్చునంటేని గురుకృపచేతను, ఈశ్వరానుగ్రహము చేతను, అనేకజన్మ సుకృతవిశేషము చేతను, వేదాంతశ్రవణము చేతను రావలెను— వేదాంతశ్రవణ మనఁగా నేదంటేని, శ్రవణమనననిదిధ్యాససమాధిలక్షణములతోఁ గూడుకొని యుండును. శ్రవణమునకు లక్షణమేది, మననమునకు లక్షణమేది, నిదిధ్యాసకు లక్షణమేది, శ్రవణమునకు లక్షణమనఁగా నెటువలె నంటేని—ఉపక్రమము, ఉప

సంహారము, అభ్యాసము, అపూర్వతాఫలము, నర్థవాదము, నుపపత్తి, లింగము, తాత్పర్యనిర్ణయము. మననమునకు లక్షణమనఁగా నెటువలెనంటేని శ్రుతులు చెప్పినయర్థమునకు నాచార్యులు చెప్పినవాక్యమునకు, నింకను విశేషతః తన యొక్క బుద్ధి నిశ్చయముచేతను గూడును గూడ దని యనుసంధానము చేయు నదియే మననమునకు లక్షణము - - పదిపత్రములలోఁ గలదు. కడపట-

"యథాసౌమ్యైకేన మృత్పిండేన సర్వం మృణ్మయం వా జ్ఞాతం కస్మాత్ వాచారంభణం వికారనామధేయం మృత్తికేత్యేవ సత్యం ఉపక్రమం ఉపసంహారం అభ్యాసం, అపూర్వతాఫలం అర్థవాద ముపపత్తిలింగం తాత్పర్యనిర్ణయం నవకృత్వోపదేశం సమాప్తః అనియున్నది.

౩. ఉమామహేశ్వరసంవాదము - ఇదియు వేదాంతమే - పార్వతికీశ్వరుఁడు చెప్పినది. " - - - - జ్ఞానంబుకొఱకుఁగాక వివాదంబు ప్రసంగోచితకరమై వర్తించునో, అటుగనుక వేదశాస్త్రపురాణాదులచేత జ్ఞానసిద్ధికొఱకుఁ దెలియఁ బోయిన బహుకాలవ్యాప్తియు ననేకవిఘ్నములును దేహము క్షణభంగురము గనుక సకలలోకోపకారముకా సకలార్థసారానుగ్రహమైన యీతత్త్వబోధ యాత్మానాత్మవివేకంబుకొఱకుఁ జెప్పఁబడెను. ఇందులవివరంబున జన్మస్థితిలయంబులును తోఁలంగును. మహదాదిభూతంబులును సకలచరాచరజంతుజాల లక్ష్యాలక్ష్యబ్రహ్మాండ పిండాండలక్షణంబులును బ్రకృత్యాత్మవిచారంబును మోక్షహేతువు బంధకంబును మిథ్యయునైనప్రకృతినిశ్శేషముగా లయముచేసి నిజమైనయాత్మ తానేస్వయంప్రకాశుఁడును నై వెలుంగుచుండును. శాస్త్రపురాణాదు లనంతములు, అందు గ్రంథము విస్తరమును కాలము స్వల్పమును గాఁగా హంసగదా పాలుగ్రోలి యుదకము విడిచినట్లు ఆత్మజ్ఞానులు సర్వార్థపరమైన పరమాత్మనిష్ఠులై యితరవాంఛలు విడుతురు - - - - - "

ప్రథమప్రకరణముచివర యిది వుమామహేశ్వరసంవాదే ప్రథమప్రకరణం సంపూర్ణం శ్రీవేమనసద్గురు తిరువేంగళగురుబ్రహ్మకే, అర్పితం. స్థిరకాల జీవన్ముక్తి స్థిరంజీవి వర్ధతాం అనియున్నది. రెండవప్రకరణము చివర శ్రీసద్గురు భావేస్కాందపురాణే వుత్తరకాండే వుమామహేశ్వరసంవాదే నిజానందయోగ విరచితన్నామద్వితీయప్రకరణము సమాప్తము అనయున్నది. మూఁడవప్రకరణము పూర్ణముగాలేదు.

4. గురుగీతాసారము:—కవి కంభముపాటి నారపామాత్యుఁడని

క. క్రమమున సద్గురుముఖమున, నమలినతరమైన బ్రహ్మానురయుటచేఁ గం
భముపాటి నారపనిధిధర, సుమతులచే నెన్నఁబడితి శోభితరాత్మా.

క. శ్రీరామగురునికరుణను, దారకయోగానుభవవిచారము మదినే
మాఱక ధ్యానించుటచే, నీరీతిని నాంధ్రభాష యేర్పఁజేతుఁ.

ఈగ్రంథము మూఁడాశ్వాసముల పద్యకావ్యము మొదటి పద్యములు.

శా. శ్రీకైల్యవిశేషస్థానము మదింజేరంగ నేఁగోరితిఁ
లోకాచార్యుని దత్తనంశజుని సత్కారుణ్యపాథోధియై
లోకాచారవిచారసంపదల కాలోకింపకమ్మోక్షుల
క్ష్మీకాంతుం డగురామబ్రహ్మగురునే స్తోత్రింతునశ్రాంతముఁ.

చ. శివకరలీలఁ బ్రాణుల సృజించునెడం గమలాసనుండునై
యునని సమస్తజంతునివహంబులఁ బ్రోవఁగ నచ్యుతుండునై
ప్రవిమల జీవసంఘముల ప్రాణముఁ బాపి హరింప రుద్రుఁడై
యవలఁద్రిమూర్తులొక్కటగు నాద్యుననంతుని వేఁడి మ్రొక్కెదఁ.

కొందఱు నాకుఁ గవిత్వము చెప్పుట చేతఁగాదు కాకపోయినను వెఱ్ఱియుత్సాహముతోఁ గడఁగితిని క్షమింపుఁడని వేఁడునాచారముగదు. ఈతఁడట్లు గనఁబడఁడు.

మ సరసోదార కవీంద్రులీకవితలో సవిశేషముల్నిండి శ్రీ
కరమైయుండ దటంచు నెంచెదరుగా గాంభీర్య వాక్చాతురి
న్నరుల న్వేఁడి గజాశ్వయానములకు న్నాసక్తులై పల్కు తా
త్సరణల్ గ్రు వుమహోత్ములా ఘనులఁఘన్ సార్వరస్వమైయుండునా.

క. ప్రాసములు యతులుగణములు, భాసురముగనుండ ననుచుఁబలికెద రేమో
దేశికగురువరుచరణో, పాసకులకు నేలయిట్టిభ్రాంతులఁబొందఁ.

గీ. ప్రాసములుయెంచ గురుపదప్రాప్తిసుమ్ము
యతులుగురుపాదసేవ సుమతినిలుచుట
గణము సద్భక్తజనములఁ గలసియుంట
సకలమీభావములుగూర్చి చెప్పువాఁడ.

అని ధైర్యముగ నుడివెను. భావమే ప్రధాన మనువారిలోని వాఁడుగా నున్నాఁడు. దీనికిఁ బైపద్యములో

క. పలికెదశ్రీ గురుగీతలు, పలికించెటివాఁడు రామబ్రహ్మము నాలో
పలనిలిచి యే విధంబునఁ, బలికించునొ యావిధమునఁబలికెదనమ్మా.

ఈతని గురువు ధేనువు కొండ తిప్పన యోగి శిష్యపరంపరలోని గానుబ్రహ్మ గురుఁడు. ఈకథకు మూలము పార్వతి శంకరుని—

క. ఏమార్గమునను నాహార, మామహి దేహాత్మభావ మెఱుఁగుదురది యె
ట్లామహిమంత యునేవిధఁ, గామించితిఁ దెలియఁబలుకు గజదైత్యహరా

అని యడిగిన బోధించిన వేదాంతము. అక్కడక్కడి కొన్నిపద్యములు.

క. చావులు తనువుకుఁ గలుగును, జీవునకెప్పటికిఁ జావు చెప్పఁగరాదే
యోవనిత జీర్ణవస్త్రము, పోవిడిచియుఁ గ్రొత్తవస్త్రమును గట్టుగతిన్.

గీ తెలివిలేనివాఁడు దేహమే కాదశి, వాఁడు విడిచెనేని నందుముక్తి
ఆత్మగన్నవాఁడు నమువననంగంబు, బాసెనేని జనులు పాపియండ్రు.

గీ. గురువుకంటెను నిహపరములయ లేదు
యనుచు శ్రుతులందు పలుమాఱు నున్నఁబడును
వాక్కు కాయంబు మనసుచే వరటిగాను
నెంచి గురుపదపూజ లొనర్చవలయు.

చ. రవియుదయించి లోకక్రియులన్నియుఁ జేయఁగ నీజగత్క్రియల్
రవికిని నెట్టులంట వటు రాజిలుచున్ దనుధర్మలీల లీ
శివకరమైన యాత్మునకు జెల్వనవంటనటంచు భ్రాంతులం
దవులకు సాక్షిరూపుని మదిందలపోయుచు జ్ఞప్తినుండుమీ.

5. మఱియుఁగొన్ని వేదాంతకీర్తనలు, జోలపాటలు, లాలిపాటలు, పంచీకరణమనువచనము నున్నవి. కీర్తనలలోఁ జాలభాగము— "భుజంగగురుకృపను బుధుఁడై యున్న నిజగోపాలశిష్యునికి నిత్యానందము" అను మొదలుగానుండును. భుజంగగురుఁడెవ్వరో గోపాలశిష్యుఁడెవ్వరో తెలియదు.

6. దృగ్దృశ్యవివేకము:- ఈవచనము మఱియుఁ దప్పులతడికె — మచ్చునకు—కొన్నియున్నవున్నట్టు.

"శ్రీగురుచరణారవిందవేసనమః, యిఖను జీవుడు యెవడంటె స్థూలశరీరమందు అభిమానంచేశ్శి జీవుడికి విశ్వుడని పేరు, వీడికి అవస్థజాగ్రదవస్థ సూక్ష్మశరీరమందు అభిమానం చేశ్శి జీవుడికి తైజసు డని పేరు వీడికి అవస్థస్వప్నావస్థ కారణశరీరమందు అభిమానం జేశ్శి జీవుడికి ప్రాజ్ఞుడని పేరు వీడికి అవస్థసుషుప్తి యీప్రకారంగా జీవభేదంచెప్పబడెను, యిఖను యీశ్వరభేదం యేటువలెనంటెను."

చిట్టచివర, ఈయొక్క పంచవింశతితత్త్వ ప్రకరణము లోకోపకారము కొఱకు, ఆచార్యస్వాముల వా రనుగ్రహము చేసినారు, గనుక ౨౫ తత్త్వములు

నెపరైన నేమిశోధించి కన్నవారికి సంసారమువలన సంబంధము విడుచును. సిద్ధము అనియున్నది.

23. శృంగారాంధ్రరసమంజరి—గ్రం. సం. 97.

దీనికవి నారాయణకవియని—

శా. వన్నెల్మీఱఁగ నుల్లసిల్లిన భరద్వాజీయగోత్రార్ణవో
త్పన్నశ్రీగొనుసూరి చంద్రుఁడు దలిర్పన్ వేంకటాచార్యశ్రీ
మన్నారాయణసత్కవీంద్రు నొనరింపన్ రమ్యమైయాంధ్రమై
యున్నన్నారసమంజరీకృతి చతుర్థాశ్వాస మిర్వొం దగున్.

అను కడపటి పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈక్రింది వాక్యములు ప్రతి వ్రాసినవారు వ్రాసినవి. దీనిలో దీనివివరమంతయుఁ గలదు.

“శృంగారసమంజరి యనుగ్రంథము నవనాలపుర మనునట్టి పుదుకోట సమస్థానమందున్నటువంటి పడమటి నగరి ప్రభువుపై శ్రీమన్నారాయణయ్యం గారు అనెటి మహాకవిచే రచియింపంబడినది. పచ్చిమిరియం ఆదిప్పయ్యగారి మనుమడు కుప్పణ్ణయ్యగారి కుమారుడైనట్టి సుబ్బయ్యవ్రాశినది. ఆశ్వాసములు నాల్గింట మొదటియాశ్వాసం వంశావతారం మాత్రం వ్రాయలేదు. శ్రీముఖ నామ సంవత్సరము ఫాల్గుణ బహుళ త్రితియ్యభృగువారం సమాప్తమైనది” అనికలదు. (కాగితపుప్రతి)

ఇక్కవి గద్యములకు బదులు పద్యములే రచియించెను.

శా. విశ్వాసంచననాయికౌఘగణనావిభ్రాజితంబైసుధీ
విశ్వాసప్రియహేతువై కృతరసావేశప్రహృష్టాత్మన
ద్విశ్వంబై రసమంజరిం దెనుఁగునన్ విద్యోతితంబై ద్వితీ
యాశ్వాసంబిది నారణార్యరచితంబై యొప్పువేడ్కన్ మహిన్. (ద్వి - ఆ.)

మ. ఇది శ్రీమద్ఘననారణార్యరచితప్రేంఖత్తరప్రౌఢిమ
త్వవన్వృత్తిన్ రసమంజరిన్ నవవిధోద్యన్నాయికా లక్షణా
భ్యుదితశ్రీగుణచేష్టితప్రకటనాభోగప్రసక్తిన్ రసా
స్పదమై యాంధ్రమునై తృతీయమగునాశ్వాసంబు ధాత్రిందగున్. తృతీయా

పుదుకోట సంస్థానప్రభువు కోటి విజయరఘునాథరాజునకు (తొండమానునకుఁ) గృతియిచ్చెను. ఒక్క యాశ్వాసమంతయుఁ గృతిపతి వంశావతార వర్ణనమున్నది వ్రాయమానినాఁడు. అందెంతవిశేషమున్నదో! ఆశ్వాసాంతము నందలి పద్యములు సంక్షేపవర్ణనలతోనున్నవి. చతుర్థాశ్వాసముచివర—

శా. సర్వోర్వీనుతవిక్రమోదయ దయాసాంగత్యలక్ష్మీసఖా
ఖర్వోర్వన్నత్యవిలాసలాసక సుదృగ్రాగాభిలాషాత్మభూ
మౌర్వీశింజితరంజితాఖిలసభానుర్వ్యాళిసంశ్లాఘిగా
గీర్వైఖర్యనువాదిపంజరవసత్కేళీశుకీశారికా.

మాలినీ- దివిషదుపహృతాప్తా దివ్యగంధానులిప్తా
కవనకృదనురక్తా కంతుజిద్భక్తియుక్తా
భువనభరణదక్షా పుణ్యలబ్ధాక్షివీక్షా
కువలయనుతిసాంద్రా కోటివంశాబ్ధిచంద్రా.

మ. విజితారాతివసూధనీశ మకుటావిర్భూతముక్తాఫల
వ్రజరోచిస్తటినీతరంగితపదాబ్జాతప్రభానారది
గ్విజయోపార్జితభవ్యదివ్యబిరుదోద్వేలప్రకాశాంకురా
విజయశ్రీరఘునాథభూవర జగద్విఖ్యాతతేజోభరా.

ఇట్లే ప్రతిపద్యము చివరను గొంచెముకొంచెముగా నీరాజును సంబోధించుచు వచ్చినాఁడు. ద్వితీయాశ్వాసము ప్రారంభము.

క. శ్రీమహినిలయితదృగ్భుజ, సామంతనరేంద్రమకుటచయమణికిరణ
శ్యామలితపదనఖాంకుర, ధీమత్కులశంసనీయ ధిషణాభ్యుదయా.

వ. అవధరింపు మమ్మునివర్యులు సూతుంగనుంగొని రసమంజరి తెనింగించిన ప్రకారంబును వివరించి పలుకరింపుమనవుడు నక్కథకవర్యుం డిట్లనియె. అప్పు డక్కవీంద్రుఁ డానృపతినుపలక్షించి.

మ. నిజపాదంబును మున్ను నిల్పి నడుచు న్నిమ్నోన్నతోర్వీఁ దరుఁ
నిజహస్తమ్మున పంచి కొమ్మవిరులందిచ్చుఁ శ్రమాశంకచే
నిజభాగం బిడి జింకతోల్పఅపునఁ నిద్రింపనే యాశ్వసుం
డజహత్ప్రేమనినాల్గసైకప్రియ భార్యందాల్చి యంగంబునఁ.

క. నీకతఁ డోసఁగుఁ జిరాయు, శ్రీకీర్తులు శౌర్యవీర్య ధృతిమతులుతదీ
యాకృతులు లోకరక్షణ, ధీకృతులినశశికరిక్షితి ఖమరులినా.

సీ. శ్రీకరసత్కీర్తి జితపూర్ణకుముదబాంధవ రాజగోపాల తనయవిజయ
రఘునాథనీపేర రసమంజరి తెనుంగు నంకితంబొనరింతు నాలకింపు
లక్ష్యైకదేశతల్లక్షణావర్తిత్వ మవ్యాప్తియగు నతివ్యాప్తి యింక
లక్షణంబునకు నలక్ష్యవర్తిత్వంబుఁ దెలివిచే నీరెండుఁ దెలియవలయు

రసములందెల్ల శృంగారరసమె ముఖ్య, మగుఁ దదాలంబన విభావమతి వలగుట
లక్ష్యములతోడ నాయికాలక్షణములు, వరుస వివరించి పలుకంగవలయు మొదట

సీ. చను స్వీయ పరకీయ సామాన్య యనఁగను నాయికాత్రితయంబు నయము మీఱు
స్వామియందే యనురక్తయైనది స్వీయ యన నందుఁ బరిణీత యన్యపురుషు
నభిలషించిన నతివ్యాప్తియగు నని పల్కవలదు లక్ష్యము పతివ్రతయె గాన
పరునియం దనురక్తి పడయంగఁ బరకీయ యగుఁ గాని యది స్వీయ యనఁగఁ దగునె
యలపతివ్రతయే స్వీయ యనఁగఁ జెలఁగు, దాని లక్షణలక్ష్యము ల్దానిచేష్ట
లాలకింపుము రాజగోపాలవిభుని, విజయరఘునాథనృపచంద్ర విభవసాంద్ర.

స్వీయకు లక్షణము:—

క. పతిశుశ్రూషయు శీల, వ్రతరక్షయు లజ్జ యార్జవంబును క్షమయుం
బ్రతిలేని స్వీయచేష్టలు, రతిపతిసమరూప విజయరఘుధనృపా.

స్వీయకు లక్ష్యము.

సీ. వనజాతములు గదా పదము లట్లగుట నం దేణలోచన చూపు లెలమి వ్రాలు
బింబ మాట సుధాంశుబింబాస్య కెమ్మోవి చిఱునవ్వు వెన్నెల చెలఁగు నందుఁ
పతి చెవ్వి ద్రోణియైపరఁగుట శుకవాణి పలుకు తేనియ లందె చెలువు మెఱయుఁ
జల్లనికరుణారసమున కిల్లగు నుల్లమునఁ గోపశిఖి రవ్వైనను జనింప
దదిజనించిన నొకయప్పుడం దెయణఁగుఁ, బతియె దైవంబుగాను సంతతము నతని
యందె సతులకు సద్భక్తి యలరియుండు, విజయరఘునాథనరపాల విమలశీల.

నాయకలక్షణము.

క. మును విధ్యుక్తకరగ్రహ, మొనరించిన ఘనుఁడు పతి సమున్నతిగ నతం
డనుకూలుం డన దక్షిణుఁ, డన ధృష్టుండన శఠుండు ననఁగను వెలయుం.

పతికి లక్ష్యము.

చ. అమృతమయూఖ నీవు తుహినాంశుచయమ్ముల ముంచనించు మం
దముగ ఫణీంద్ర నీవును ఫణాగ్రములం గొడుగుంచు వీచు మో
యమరతరంగిణీ మిగుల నంబుకణంబులఁ జల్లు త్రోవలో
హిమగిరిపుత్రి మెత్తని మెయిం రవికాంతులు గాసి చేసెడిం.

ఈపుస్తకముతుదను గొన్ని సంగీతవిషయములు గలవు. రాగముల
పేరులు రాగమాలికయుఁ గలవు.

రాగమాలికలోని కొన్నిపంక్తులు:—

ఒక్కరాగమునసుండి యువిద వచ్చినది - - సౌరాష్ట్ర.

ఒక్కరాగము వెలయుఁ జక్కనిప్రతాపసింహేంద్ర- శ్రీరాగము.

ఒక్కరాగజాతికి సమ మొప్పియుండును రూపము - గుజ్జరి.

ఒక్కరాగంబువలె నువిద కౌను - - - - ఆహరి.

మొదలైనవి 18 రాగములు గలవు.

కనకాంగిరాగమునకుఁ గలశుద్ధస్వరములను మహత్తుగానుంచి ప్రస్తరించితే మేళాధికారశుద్ధమధ్యమరాగములు ౩౬ భేదములు గల్గును. పై గలుగదు.

సాలగరాగంబునకుం గల శుద్ధస్వరములున్ను ప్రతిమధ్యమమూను మహత్తుగానుంచి ప్రస్తరించితే మేళాధికారప్రతిమధ్యమరాగములు ౩౬ భేదములె బుట్టును. పై గలుగదు.

యిందున వకమేళాధికారమును బెట్టి ప్రస్తరించితే షాడవౌడసంపూర్ణ రాగము లెన్నిజనించునో అన్నేశిరాగములే. వక్కవక్క మేళాధికారమున్ను బెట్టి ప్రస్తరించితే బుట్టునే వినా అధికమైనా తక్కువైనా బుట్టనేరదు. యిదే సిద్ధాంతము. అయితే యిప్పటివాడికరాగములు గురువులకల్పనలే వినా ప్రస్తారజన్యములుగాదు. సంశయపడవలశినదే లేదు.

ఇట్లేకొన్నివిషయములుగలవు.

24. తత్త్వచంద్రోదయాదులు—గ్రం. సం. 77.

ఈతత్త్వచంద్రోయముతోపా టిందుఁ జాలగ్రంథములు గలవు. ఉన్నవానిలో మొదటిది గనుక ముందు దీనినిగూర్చి వ్రాయుచు దానికి ముందున్న యొక్కపత్రములో శిథిలప్రాయముగా నున్న కొన్నిపద్యములు వ్రాయుచున్నారము.

శ్రీకనకవల్లీసమేత శ్రీతిరువళ్లూరు వీరరాఘవాయనమః, శ్రీయలమేల్మంగాసమేత శ్రీవేంకటాచలపతయేనమః.—భర్తృహరి ప్రథమాశ్వాసము.—

ఉ. శ్రీలలితాద్రిజాఘుసృణచిత్రకరాగముఁ గాంచి తారక
భ్రూలత పల్లవించె ననఁబోఁడి నిజం బని మించుటద్దముం
గేల ధరించి ప్రేమఁ దిలకింపఁగఁ జూచు విలాసశాలికిం
బాలితసర్వభక్తజనపాళికి మ్రొక్కెదఁ జంద్రమౌళికిన్.

ఉ. తోయధిసారమై యితరదుర్లభమై గుణరమ్యమై జగ
ద్గేయమహత్త్వమై భువనదీపకమై కమలాఖ్యమై నిశా

నాయకసోదరంబయి మనఃప్రియమా రతనంబు ఆోమ్మునం
బాయక తాల్చుశౌరి నిరపాయసుఖంబులు మాకు నీవుతన్.

ఉ. ప్రామినుకుల్ ముఖాబ్జముల భారతినెచ్చెలులై వసింప నె
త్తామరపూవు పీఠముగఁ దాపసముఖ్యులు సర్వనిర్జర
గ్రామణు లాత్మకింకరులుగా జగమేలెడు మేటిభక్తచిం
తామణి మాకు సత్కృపఁ బితామహుఁ డిచ్చుఁ జిరాయురున్నతుల్.

ఉ. శంకరచారుదృక్కుముదచంద్రిక యోగిజనప్రసన్నహృ
త్పంకజరాజహంసి శ్రుతిదర్పణదృశ్యనిజస్వరూప వి
శ్వాంకురజన్మభూమి తుహినాద్రితపఃఫలరాశి చంద్రరే
ఖాంకితరమ్యమౌళి జగదంబ శుభంబులు మాకు నీవుతన్.

చ. మినుకుఁగడాని పైఁడిపసమించిన సెమ్మెయిడాలు జాళువా
ననజడికై వడి న్నగనినల్లనిమేనికి వన్నెవెట్టఁగా
గొనబువహించుజన్వని ముకుందునిపట్టపుదేవి ప్రేమతో
వననిధికన్య మామకనివాసముల న్వసియించుఁగావుతన్.

చ. నెలకొని తియ్యగాఁ బదము నేర్పుము మాకని గేరుభంగి రా
చిలుకయు వీణయందున భజింపఁగ గీతసుధాపయోధిలోఁ
బొలుపుగ నోలలాడు ననఁబోణి నిరంతరసుప్రసన్నయై
పలుకువెలంది నావదనపద్మమున న్విహరించుఁ గావుతన్.

శా. శ్రీవాణీరమణాదు లెవ్వని జయశ్రీకాములై కొల్తు రే
దేవుం బ్రాజ్ఞులు గజాననునిగాఁ దెల్పున్ జగత్కర్తగా
నావిద్యాగురునిన్ గణేశ్వరుని భక్తాభీష్టసంధాయకున్
సేవింతు న్మదిలో వినాయకుని సుశ్రేయార్థసంసిద్ధికిన్.

ఉ. మూఁడుగుణంబులుం బరమమూర్తులు మూఁడును మూఁడు వేదముల్
మూఁడుమహాక్షరంబు లొకమూర్తిగఁ బూనిన మేటి వేలుపుం
బ్రోడల కేలుమోడ్పులు సమున్నతిఁ గైకొను సామి చూడ్కికిన్
వేడుకసేయు దేవునిఁ గవిస్తుతతేజు రవిన్ భజించెదన్.

చ. ఇనజునితోడ మైత్రిఘటియించియు వారిధిదాఁటి జానకిం
గనుఁగొని వచ్చియున్ జవముగైకొని మందులు దెచ్చి లక్ష్మణు
న్మనిచియు దైత్యులం బిలుకుమార్చియు రాఘవుచేత మెప్పులం
దినహనుమంతు శాంతు వినుతింతుఁ దలంతు....నెంతయున్.

గీ. యుక్తినొక్కొక్కవర్ణ మత్యుగ్రపాప, విదళనము సేయ శతకోటివిస్తరముగ
రామచరిత మొనర్చిన వామలూరు, సంభవునకుఁ బ్రణామముల్ సంఘటింతు.

అనునీపద్యములు మాత్రము కలవు. ఏభర్తృహరిసుభాషితములను దెనిఁగించినకవి పీఠికపద్యములో తెలియదు.

1. ఇఁకఁ దత్త్వచంద్రోదయువిషయము:—ఈ 77-వ సంఖ్యగలది యొక్క కాగితపుపుస్తకము. దీనిలోఁ దత్త్వచంద్రోదయము పదిప్రక్కలలో వ్రాయఁబడినది. వేదాంతవిషయముగుద్విపద-ప్రారంభము:—

శ్రీలీల వైభవాంచిత మైనయట్టి, భూలోకమునను జంబూద్వీపమునను
నవఖండములకెల్ల నాయకమైన, కవినుతభారతఖండంబునందుఁ
దెలియ నేఁబదియాఱు దేశంబులందు,
శ్రీధాన్యకటకమై చెలువొందుచున్న, యాధేనుకొండాహ్వయగ్రామవర్తి
కరుణాకరుండైన కరుణాకరుండు, కరుణఁగాంచినయట్టి ఘనకుమారుండు
నాణెమై తగుపాకనాఁటిశేఖరుఁడు, రాణించు శ్రీతిమ్మరాజప్రధాని
తత్త్వకథార్థావతారమై నైజ, తత్త్వంబు మోక్షార్థిదాసకోటులకుఁ
దెల్పుపరానందతీర్థదేశికుని, వేల్పుగాఁగొల్చి సేవించి తావారి
యుపదేశమున రాజయోగియై నన్నుఁ, గృపతోడనటులు రక్షించెఁగావునను
సద్గుణాంభోరాశిచంద్రుఁ డైనట్టి, మద్గురుస్వామిఁ దిమ్మయరాజయోగి
భావించి సేవించి భక్తితో నిష్ట, దేవతాస్తుతిచేసి ద్విపదమార్గమున

అనిప్రారంభించి ద్వారకలో రుక్మిణి శ్రీకృష్ణుని గోరఁగా నామెకు లోకానుగ్రహకాంక్షచే నద్వైతమార్గమును దెల్పినట్లు వ్రాసినాఁడు. మధ్యభాగమున—

ఒకయిచ్ఛయును లేకయుండెడి బయలు, సకలంబు తానైన చక్కనిబయలు
లోకంబు లన్నియుఁ లోఁగొన్నబయలు, రాకపోకలు లేక రంజిల్లుబయలు
మునులకు నల్లారుముద్దైనబయలు, వినవినవీనుల విందైనబయలు
ఎందుఁజూచిన గాని యెడలేని బయలు, సందీక యంతట సాఁగినబయలు.

ఈబయలు దగ్గఱదగ్గఱ నూఱుచరణములలో వివరించినాఁడు. అంతమున:—

అని ధేనుకొండ తిమ్మార్యప్రసాద, మున కొప్పరావూరి ముమ్మిడిరాజు
గంగనామాత్యుండు గన్నపుత్త్రుండు, శృంగారనిధియైన కృష్ణమంత్రికిని
రఘుపతెమ్మకును గారాపుసుతుండు, అఘనాశమైన బ్రహ్మానందపూర్ణ
మఖిలవైభవయోగి మల్లనయోగి, సహజకోదండదీక్షాగురు పేర

భావనాకృతిపేరఁబరమాత్ముపేర, జానకీపతిపేరసదయాళుపేర
శ్రీనిధానముపేర శ్రీరాముపేర
ధరనెంచఁగా నంకితము చేసినట్టి, సరసమౌ సీతత్త్వచంద్రోదయంబు
ఆచక్రవాళాద్రియంతపర్యంత, మాచంద్రతారార్కమై యొప్పఁగాత.

ఈమల్లనయోగిపంశాదికము నతనిశిష్యుఁడు జ్ఞానసూర్యోదయమను ద్విపదలో నీక్రింద వివరించినాఁడు. తనవంశమును దెల్పుకొన్నాఁడు.

2. జ్ఞానసూర్యోదయము:—దీనికవి వేంకటాఖ్యుఁడు, తనగురువగు మల్లనయోగికే కృతియిచ్చి చెప్పినాఁడు. ఇదియు వేదాంతవిషయమే. ౨౬ ప్రక్కలుగల పెద్దపుస్తకము, నాలుగాశ్వాసములు. ప్రారంభము:—

శ్రీకరు మోక్షలక్ష్మీమనోహరు, ప్రాకటనిజపరబ్రహ్మావతారు
నానాముముక్షుమానసరసోత్తారు, భానుకోటిప్రభాభాసురోత్కారు
గురుమతశాస్త్రానుకూలప్రసారు, వరరాఘవన్యస్తవాక్యమత్కారు
తత్త్వవాద్యస్త్ర త్రదంతికంఠీరు, తత్త్వమస్యర్థసాధకనిర్వికారు
పరమమంత్రార్థ దర్పణవాక్యసారు, వరముముక్ష్వాంతర ప్రజ్ఞానమిహిరు
తిమ్మార్యగురుపాదతీర్థకాసారు, సమ్మోదహృదయ నిశ్చలబోధధీరు
సురుచిరాపస్తంబసూత్రప్రచారు, సరసయజుర్వేదసమ్యగాచారు
గురుతరశాండిల్యగోత్రప్రకారు, ధరణీసురాన్వయ ధర్మశృంగారు
తనరుకృష్ణానదీదక్షిణతీరు, తెనుఁగు దేశమునఁ బొందికఁ గొమరారు
కులజనార్జితమైన కొప్పరాపూరు, ఇల రాజధానిగా నేపున మీఱు
సతతముమ్మిడిరాజ సత్కులధీరు, ధృతిని గృష్ణయరఘుప తెమ్మకుమారుఁ
డగుమల్లనాచార్యు నాత్మసుస్థైర్యు, నిగమోక్తి హృద్వీథి నిలిపి సేవించి....
సుకవీంద్రవర్యుల సొరిదిఁ గీర్తించి, సకలశాస్త్రవివేకసారంబు లెంచి
నిరతిశయానందనిపుణతఁగాంచి, యెఱిఁగింతు మద్వంశ మెట్లన్న మఱియు
ఘనడిల్లితిమ్మయ గాయమ్మ సుతుఁడు, వినుతసజ్జనుఁడు గోవిందయనరస
మాంబసుతుండు నాయన్నార్యలక్ష్మ, మాంబసుతుండు నాశ్వలాయననామ
సూత్రఋగ్వేదభాసురుఁడ వసిష్ఠ, గోత్రుండ వేంకటాఖ్యోన్నతయశుఁడ
మునిజనహృదయాబ్జములు వికసింప, నొనరింతు జ్ఞానసూర్యోదయంబనెడు
ఘనకృతి ద్విపదగాఁ గావ్యులు మెచ్చ,

ఈకథకుమూలము శ్రీరాముఁడు సీతాదేవి యడుగఁగా బోధించినట్లు తెల్పుచున్నాఁడు. మచ్చునకుఁ గొన్ని—

విను తత్త్వమస్యాది విమలవాక్యముల, పుట్టినజ్ఞానంబు పొందునఁ దోఁచు,....
భాగంబు లానందపదలక్షణములు, ప్రాగను నొక్కటి ప్రధ్వంస మొకటి
అన్యోన్య మొక్కటి యత్యంత మొకటి, శూన్యముల్నాలుగుసొరిదినిత్యమును
వెలయును వీనిని వివరింతు వినుము, కలుగుమృత్తికయందుఘటములు మొదట
పరికింపఁగా నిది ప్రాగభావంబు, వెరవైన ఘటములు వెనక లేదనుట
పటువుగఁబ్రధ్వంసభావశూన్యంబు, ఘటములుపటమందుఁబటములాఘటము
కణఁగి లేదనుట యె కణఁగి యన్యోన్య, మనయభావంబింక నాకాశపుష్ప
మనుట యత్యంతమా నలయభావంబు, ఘననిత్యపదమిది కంజాక్షి మఱియు.

(ప్రథమాశ్వాసములోనిది.)

కడపటివాక్యములు:—

శ్రీశైలమను నామ శిష్యునిఁగూడి, వాసనతో బాహ్యవాసనమాని
భాసురస్థితితోడఁ భాసిల్లుచుండె, - - - - - -
ఇదివిన్నఁ జదివిననిష్టార్థసిద్ధి, కొదుకక సిద్ధించు గురుకృపచేత.

3. తత్త్వదీపికాప్రబోధము:—ఇదియును మల్లన యోగిశిష్యులలో నొక డగు:—

అనుచు శ్రీమల్లనాచార్యప్రసాద, ఘనత మారేపల్లి కామార్యసుతుఁడు
సుతుఁడు వేంకటభట్టు సూనృతయశుఁడు, అతనికిల్లాలు నర్సాంబ వారలకు
గారాపుసుతుఁడు వేంకటయోగివరుఁడు, సారత వేంకటాచలపతిపేర
నారూఢు లెంచఁగా నంకింతంబైన, ధీరతనీతత్త్వదీపికాబోధ.

అనుదానిలోనున్న మారేపల్లి వేంకటయోగి వ్రాసినట్లు విదితము. ఇది చిన్న ద్విపద ౫౭ ప్రక్కలుగలది. ఇది శ్రీతిరుపతి వేంకటేశ్వరస్వామి అలుమేల్మంగాంబకుఁ గరుణించిచెప్పిన వేదాంతము. ఈకృతిని:—

సరసనత్కవిరాజసంఘుంబు వొగడ, - - - -
ద్విపదగా శ్రీతత్త్వదీపికాబోధ, అపరిమితశుభాంగ యలమేలుమంగ
మది వెలుంగుచునున్న బ్రహ్మము పేర, విదితమాతత్కథావిధమెట్టులనిన.
అని శ్రీవేంకటేశ్వరులకే యంకితమిచ్చినాఁడు.
ఈకవి కొన్నివాక్యములు చిత్తగింపుఁడు—

నిదురందుఁ బ్రాజ్ఞుని నిర్వాసనాను, హృదయంబునను జీవుఁడుండును మఱియు
త్రిగుణధామత్రయత్రిపురందు నిగుడి, నిగుడు జీవుండును నీవు నేననుచు
కల్పితరాగాదికర్తంబు లెల్లఁ, గల్పితదేహివిగాఁగ నెఱుంగు

సరి యవస్థాత్రయసాక్షియై నట్టి, యెఱుకస్వరూపంబు నెఱుఁగు మెట్లన్న దేహేంద్రియప్రాణ ధీమనోచిత్త, మోహాదిగుణధర్మములు నీవుగావు.

౮. వేదాంతసారము:—కొండముదిగోపాలరాయ కవి. నాలుగాశ్వాసముల చిన్నపద్యకావ్యము. గద్యము-ఇతిశ్రీభుజంగరాయ గురువరప్రసాదలబ్ధ కవితావిలాసగోపాలరాయప్రణీతంబైన సర్వవేదాంత సారామృతంబునందుఁ బ్రథమాశ్వాసము.

ప్రారంభము:—

క. శ్రీకళ్యాణగుణగణా, ద్యాకరభయహరణ నిపుణ యార్యారమణా
రాకేందుమౌళిభూషణ, ప్రాకటభవబంధహరణ పంకజచరణా.

గీ. ఓంనమశ్శివాయ యోంకారరూపాయ, యీశ్వరాయ పార్వతీశ్వరాయ
ఫాలలోచనాయ భవబంధనాశాయ, శాశ్వతాయ శంభు శంకరాయ.

ఉ. కంటిని నీదురూపమును గన్నులునిండను సర్వమందునన్
వింటిని మంత్రగోప్యమును వీనులగుండను నాస్యమందునన్
అంటిని యైదునక్షరము లమృతధారఁగ జిహ్వయందునన్
తింటిని హాయిహాయిగను తృప్తిగ శంకర లోకనాయకా.

క. శివపంచాక్షరిమంత్రము, వివరంబుగ శివునివలన వినుటయు వలనన్
సవిశేషపదము గలిగెను, గవనంబును జయమునకును గారణమయ్యెన్.

క. ఏరామనామమంత్రము, తారకమని సాంబశివుఁడు దాక్షాయణికిన్
గోరఁగ నుపదేశించిన, యారాముఁడె బ్రహ్మమనుచు నభినుతిసేతున్.

గీ. పరమవేదాంతకవులను బ్రస్తుతించి, సకలగ్రంథాదిసారంబు సంగ్రహించి
చెప్పఁబూనితిఁ గృతిగాను జిత్తములర, ననుభవంబును జెప్పుట యలవియగునె.

కవిస్వవిషయముం జెప్పకొనుచున్నాఁడు:—

సీ. ఆంధ్రదేశంబున నతిశయమ్మై కొండవీటిసీమయందు వెలయుకొండ
ముదిపురవాసుండు నదెకొండముదివంశజుండన్ వెల్నాటిద్విజుండు మఱియు
గోత్రంబు కాశ్యప సూత్రమాపస్తంబ మాశ్వేలనియోగి యైనఘనుఁడు
పాపయ్యయనుమంత్రి పణఁతి సీతాంబయు నాదంపతులసుతుఁడైన ఘనుఁడు
వేంకటాచలమనఁగను విమలమతుఁడు,యతనిపత్నియు బుచ్చాంబయననుబడి
నావధూవరులకు సుతులేవ్వరైరి, కీర్తిమంతులనఁబడిరి కేవలముగ. [యె

క. గోపన్న వేంకటాద్రియు, నాపయ బుచ్చయ్య మఱియు నప్పయ్యయునున్
బూపులకృష్ణయయొక్కఁడు, ప్రాపితముగ నైదుగురును బ్రజ్ఞాన్వితులై.

క. వ్యవహారయోగ్యులై మఱి, శివకేశవులాలయములు చెఱువులు వనముల్
సవిశేష కార్యకరములు, నవిరళముగఁ జేసినా రిలార్యులు మెచ్చన్.

ఉ. అందున వేంకటాద్రియును నందె నలంకృతకన్యదానమున్
సుందరరామునిన్వలన శోభనలగ్నమునందుఁ బ్రీతిగా - - - - -

ఈ వేంకటాద్రిభార్యయాదిలక్ష్మి, యీదంపతులు సంతానములేక పండ్రెండేండ్లు తపస్సుచేయఁగా దపఃఫలముగా నీకవిపుట్టి నాఁడఁట. ఈతనితమ్ముఁడు యోగానందము.

కథాశైలికిఁ గొన్నిపద్యములు:—

క. అలరవిధి కర్మనఁగన్, విలసితయజనాదికములు విశ్రుతమాయెన్
ఫలమందు స్వర్గభోగము, నలలితముగఁ జెప్పఁబడెను సంగతులరయన్.

సీ. యజనాదికములెల్ల నిజముగాఁ జలుపను గఠినతరంబుగఁ గానఁబడియె
ద్రవ్యంబులేకను సవ్యంబుగాఁబూర్తి గానేరదందునఁ గార్యములును
ద్రవ్యమార్జింపను ధనికులయాచింప నధికదుఃఖముకెల్ల నాలయంబు
విత్తమార్జనచేసి విధిగాను జలిపినఁ గడట ఫలమేమొ గానరాదు
కాయకష్టంబు నధికమై కానఁబడును, వినఁబరోక్షంబునై యుండు వేడుకలర
ఫలముఁ జెందిననల్పమై యలరుఁ దిరిగి,జన్మమాననిచెప్పె నాశాస్త్రములును.

గీ. అలర నింద్రాధిపత్యంబు ననుభవింప
భ్రాంతినహుషుఁడు రఘుమహారాజవరుఁడు
మఱి యయాతియు మాంధాత మహిమదెలియ
నేమిపొందిరి స్వర్గులై యింద్రపదము.

క. అదిగాన చలనకారణ, నిది బాహ్యమునను చు విడిచి యేర్పడనుదినిన్
సదమలయంతర్యాగము, విదితంబుగఁ జలుపఁబడితి విరతినిజెందన్.

ఈ గోపాలరాయఁడేః తనగురుఁ డగు భుజంగరాయనిసంబోధించుచుఁ గొన్నికీర్తనలు వేదాంతమార్గముఁ నఁ జెప్పినవి వెనుకటిసంచికలయందుఁ బాఠకులు తెలిసికొనియున్నారు.

పీచుకాగితములమీఁద వ్రాయఁబడినది. ఇదియే కవిస్వహస్తలిఖితమగు మొదటిమాతృకయా యని సవరణలు దిద్దుబాటులుఁ జూడ ననుమానము కలుగుచున్నది. అక్షరములు కలిపివ్రాఁత కొన్నితావుల స్ఫుటముగానగపడుటలేదు.

ఇంకఁ బ్రసంగరత్నావళివిషయముం దెల్పుచున్నారము:—

24. a ప్రసంగరత్నావళి—గ్రం. సం. 77.

ఇందు 316 శ్లోకములు ప్రసంగోచితములైనవి కలవు. ఇందలిశ్లోకములనేకకవుల గ్రంథములనుండి సంగ్రహింపఁబడినవి. కొన్ని యచ్చునకు—

శ్లో॥ పక్షద్వంద్వవిరాజితోఽహ మమలో మీనప్రసేవీసదా
పూర్ణాంగ స్సకలోదితః పరిభవశ్చంద్రస్సమః కింమను
సర్వస్థాణుశిరోగతోఽహ మనిశం చంద్రం బకోఽహసతే
మాత్సర్యేణ దురాత్మకోఽపి సుజనం దృష్ట్వా సదాహసతే. 3౭

కర్పూరధూళీరచితాలవాలః కస్తూరికాచందనదోహదశ్రీః
పన్నీరసీరై రభిషిచ్యమానః ప్రాక్స్వం గుణం ముంచతి కిం పలాండుః.

వాఙ్మాధుర్యా త్సర్వలోక ప్రియత్వం వాక్పారుష్యాత్సర్వలోకా ప్రియత్వమ్
కోవాలోకే కోకిల స్యోపకారః కోవాలోకే గార్దభ స్యాపకారః.

పరోఽపి హితవాన్బంధుః బంధుర ప్యహితః పరః
అహితస్యాంగజవ్యాధే ర్హిత మారణ్య మౌషధమ్.

—। ఇందే—పద్యావళి గ్రంథము గలదు ।—

ఈపుస్తకములో 300 శ్లోకములుగలవు- మొదట-

శ్లో॥ పద్యావళీ విరచితారసికైర్ముకుంద సంబంధబంధురపథా ప్రమదోర్మిసింధు
రమ్యాసమస్త తమసోదమునిక్రమేణసంగృహ్యా తేకృతికదంబకకౌతుకాయ
ప్రారంభే మంగళాచరణమ్।

నమో నలిననేత్రాయ వేణువాద్యవినోదినే।
రాధాధరసుధాపానశాలినే వనమాలినే- కస్యచిత్.

ఇందుఁ గలశ్లోకముల కర్తలపేరులును జాలభాగము తెల్పఁబడినవి.

సారాంగస్య; శుభాంగస్య, రహస్య, కస్యచిత్, దాక్షిణాత్యస్య, విష్ణుపురీశ్రీపాదానాం, తేషామేవ, సర్వజ్ఞస్య, శ్రీరామానందరాయస్య, శ్రీధరస్వామినోక్తం, శ్రీలక్ష్మీధరస్య, శ్రీవిశ్వపురీశ్రీపాదానాం, శ్రీభగవతః, కేషాంచిత్, శ్రీవేదవ్యాసపాదానాం, కవిరత్నస్య, శారాదాకారస్య, పురుషోత్తమదేవస్య, సమాహర్తుః, శ్రీగోపాలభట్టానాం, ఔత్కలస్య, సర్వానందస్య, ఈశ్వరపురీశ్రీపాదానాం, ధనంజయస్య, మాధవేంద్రపురీశ్రీపాదానాం, రఘూపాధ్యాయస్య, శ్రీకవిరాజమిత్రస్య, శ్రీకరాచార్యాణాం, గోవిందస్య, భవానందస్య, సార్వభౌమభట్టాచార్యాణాం, జీవమాళీనాం, సంజీవస్య, గజ

పతిపురుషోత్తమదేవస్య, శ్రీమతః, మయూరస్య, వసుదేవస్య, ఉమాపతిధరస్య, అభినందస్య, సర్వానందస్య, యోగీశ్వరస్య, కవిచంద్రస్య- ఇత్యాదికలవు.

మచ్చునకుఁ గొన్ని శ్లోకములు—

కల్యాణానాం నిదానం కలిమలమథనం పావనం పావనానామ్
పాథేయం యన్ముముక్షోః సపదిపరపదప్రాప్తయే ప్రోచ్యమానమ్
విశ్రామస్థాన మేకం కవివర వచసాం జీవనం సజ్జనానాం
బీజం ధర్మద్రుమస్య ప్రభవతు భవతాం భూతయే కృష్ణనామ॥

దీనికి శ్రీమద్విశ్వపురీశ్రీపాదానాం అని యిందున్నది, దీనినే "రామనామ" యనుమార్పుతో హనుమన్నాటకము మొదటఁ జూచుచున్నారము.

శ్రుతి మితరే స్మృతి మపరే భారతమన్యే భజంతు భవభీతాః
అహమిహ నందంవందే యస్యాలిందే పరబ్రహ్మ॥
శ్రవణే మధురా నయనే మధురా తనేమధురాహృదయే మధురా
పురతో మధురా పరతో మధురా మధురా మధురా మధురా మధురా.
ఆబద్ధకృత్రిమసటా జటిలాంబిభర్తి స్వారోపితో మృగపతేః పదవీయతశ్చ
మత్తేభకుంభపరిపాటనలంపటస్య నాదం కరిష్యతి కథంహరిణాధిపశ్చ ౨౧౦
యాలాభా యాపరద్రోహా యాపాత్రే యాపరార్థకః
ప్రీతిర్లక్ష్మీర్వ్యయః క్లేశః సాకిం సాకిం సకిం సకిమ్. ౨౨౭

25. అంగపాతాళసంఖ్యపద్యములు—గ్రం. సం. 92.

అంగపాతాళసంఖ్యపద్యములు, తాళప్రస్తారపద్యములును గల యొక విడివిడి పీఁచుకాగితముల పుస్తకము. ఇందు మొదటియంగతాళ సంఖ్యను గుఱించి లేదు.

"కోవిదులందఱుఁ గొనియాడఁగానుద్వియంగపాతాళసంఖ్యయు దెలుపుదు
భళిభళి యనిమెచ్చ భరతశాస్త్రజ్ఞులు లీలత్రియంగపాతాళసంఖ్య"

ఇట్లొకొక్క పాతాళసంఖ్యలో ననేకవిధముల పద్యములు గలవు. ప్రస్తారములో దేని కెన్నివచ్చునో లెక్క తెల్పఁబడినది.

క. ఆరయ శరత్రియంగము, భూరిగభరతజ్ఞు లెఱుఁగ ముప్పదివేలా
ర్నూఱుండొంబదియైదును, ధారుణిలోఁ బలను వెలయు దశరథరామా.

గీ. ధరణి ద్రుత శేఖరద్వయ గురుప్లుకమరు, రెండులక్షలనలువదియొండునొక్క
వేలనిన్నూటపదియును వెనుకఁదొమ్మి, దియును నారసికవివరుల్ దెలియరామ

ఈరీతిని బదిపాతాళసంఖ్యలు చెప్పఁబడినవి. కొన్నితావుల నక్షరము లు మాసిపోయినవి.

౨. తాళప్రస్తారములోని పద్యములు— ఇందు చతురశ్రజాతి, త్రిశ్రజాతి, మిశ్రజాతి, ఖండజాతి, సంకీర్ణజాతి ప్రస్తారసంఖ్యలకుఁ బద్యములు చెప్పఁబడినవి.

చతురశ్రజాతిలో నష్టము—

సీ. చతురశ్రజాతినష్టము చెప్ప మనినను కాల్మాత్రయాదిగాఁ గలిగియుండు
నిన్నియక్షరముల కింతసంఖ్య యటంచు నెఱిఁగి యేసంఖ్యలో నెవ్వరైన
నిన్నగుభేదము లెటువలె నుండును జెప్పుమీ నాతోడఁ దప్పకుండ
ననియడిగిన సంఖ్యలన్నియు వ్రాసుక యడ్డయనుద్రుతములయందు ద్రుతము
చతుర్థమున లఘువు చెలఁగ నష్టమునుగురువు ద్వాదశప్లుతముతో దొరయఁగూడ
తన నడిగిన సంఖ్య గొనియు నాయిటను............................

క. ధరఁ ద్రిశ్రజాతి యరచం, దురునిసియొక్కటియు మఱియు ద్రుతమున రెండుః
శిరమునను జుట్టునాలుగు, స్థిరముగ మముఁ బ్రోవుప్రేమ సీతారామా.

క. ఒకటిం గాలుకు నాఱు, నొక్కటియు ద్రుతలఘున నీనునొకపదమూఁడుః
ఇఁక రెంట నిరువదైదగు, శుకసన్నుత దివ్యనామ సురసుత్రామా.

ఈపుస్తకముకడపట నిట్లున్నది.

"శుభమస్తు"

శ్రీరంగరతిజయ శ్రీరంగమకరంద కందర్పదర్పణకంతుకాది
రతిలీల వనమాలి రాజచూడామణి ప్రత్యంగరూపక పంచభూత
రాజమార్తాండైకరాజనందన కోకిలప్రియోద్వీక్షణ లలితబసవ
శంకరప్రతిరాయ వెంక్యోలఖత్తాఖ్య షట్పితాపుత్రికోచ్చ్వర కుడుక్క
చంచత్పుటాభంగ చాచపుటానంగ జయమంగళద్వంద్వ శరభలీల
వర్ణభిన్న త్రిశ్రవర్ణ వర్ణయతి త్రిభిన్నవిలోకిత బిందుమాలి
కరుణద్వితీయకోద్ఘట్టకళధ్వని శ్రీకీర్తిచౌతాళ సింహనాద
చతురశ్రవర్ణక రాజవిద్యాధర హంసనాద త్రిభంగి నమరవినుము

మల్లికామోద లీలాదు లెల్లఁదెచ్చి, సాహితీగీతికుచకుంభ శారదాంబ
మెచ్చి శరభోజభూప నిన్నిచ్చగించు, నలరుఁబోణి పదంబున మెలఁగఁజేసె.

దీనింబట్టి యీపుస్తకము తంజావూరురాజగు శరభోజిభూపాలుని యా స్థానములోని సంగీతవిద్వాంసుఁ డెవ్వరో రచియించియుండు నని తెలుచున్నది. కర్తపేరు తెలియలేదు.

26. శృంగారపుపాటలు - ఖడ్గలక్షణము—గ్రం. సం. 95.

ఇదియు నొక్కపీఁచుకాగితపు గ్రంథము; చిన్నది. కొన్ని మచ్చునకు—

వందేత్వాం గోకర్ణేశ వకుళారణ్యనివేశ మహేశ॥

1. వందారుదానవసందోహాసేవా మందానంద బృందముకుంద
నందము కుందపురందరవందిత వందేత్వా॥

4. సంగరరంగవిరూపా నిజకరసంగతసురగిరిచాపా
మంగళకరచిద్రూపా రవిరథాంగ వేదనుత గురుతరకోపా ॥ వందే॥

5. కాండభాండలయలీలా । వరవేదండాజినవరచేలా
పాండరకపాలమాలా । కోటితొండమాన్ కులజనవరపాలా
ఖండనమండలఖండనపండిత । చండపిచండిలకుండలికుండల । వందే।

—రాగమాలిక—

గౌరీమనోహర గోకర్ణమాంపాహి గౌరమహానట నారాయణప్రియ
సారంగధరకళారంజిత మస్తక సామగానప్రియ సర్వలోకశరణ్య
దశముఖారివినుతచరణ సరసీరుహ దళ్లాలబిళహరిప్రముఖభాగ్యోదయ
విశదపూర్ణవ్యోమలహరీజటాజూట విమలశంకరాభరణాయితాహీశ
సకలచరాచరనాటనాకార శమితారివేగవాహినీశనిమంగ॥
వికటవరాళికాక్షీహతమన్మథ వినుతజనకళ్యాణిమాదిభాగ్యప్రద.........

ఇంతయలుగనేల యేనేమిచేసితి నింతిరో బాగాయెనే ॥

రంతుకాఁడా కోటిరాజాబహద్దరుని యింతిపేరేమని యేఁదెలియవేఁడితి.

ఖడ్గలక్షణము - వచనము - ఇందుఁ గత్తులపేరులు పొడవు వెడలుపు లక్షణము ముద్రలు పిడులవివరము మొదలగునవి వ్రాయఁబడినవి.

కత్తులు 1 యిందుస్థానీసురై 2 అబ్బియూబాగుసురై 3 బక్దవాన్ త్యాగా 4 న్యహాన్ త్యాగా 5 రుమ్మీత్యాగా 6 బిందుపాస్ త్యాగా 7 హీరాన్ త్యాగా 8 అబ్బాలీత్యాగా 9 పరన్ సెరీత్యాగా 10 బద్దాత్యాగా 11 పరవరి

త్యాగా 12 మావిలీత్యాగా 13 హైదరాబాద్‌త్యాగా 14 కుచ్చిత్యాగా 15 చెంగ్లామాత్యాగా 16 విలాతిఅబాసీ 17 ఖురాసాన్‌అబాసీ 18 మంసుమాభీర 19 అందాబాడిగురుజా 20 మొర్నల్‌అనునవి చెప్పఁబడినవి. ఒక్కదాని కుదాహరణము.

ఖురాసాన్‌ఆబాసీ:—కత్తి గడుసుగా నుండును. తక్కినలక్షణములు విలాతిఆబాసువలెను.

మిశ్రకత్తి:—(మిసర్‌కత్తి?) కాలుతక్కువ నాలుగుజేనలు. వెడలుపు 3 వ్రేళ్లు. పిడికదగ్గర నొకదోరెము. పిడికెలావు. పిల్లదోరెము ౧। బీరకాయపీఁచువలె ఛాయ.

నాలువాలు:—నిడివి 3 జేనలు. పిడికె కొనదాఁక సన్నగా నుండును. నడుమ నొకదోరెము, ఉక్కుటల్లు. నీరునల్పు వెడలుపు రెండువ్రేళ్లు.

ఖండా:—నిడివి కాలుతక్కువనాలుగుజేనలు వెడల్పు 3 వ్రేళ్లు. చూరి ముందు వంగియుండును. అడుగు దుత్తెము. 3 దోరెములు. పిడికెదగ్గఅకడ వెళ్ల బటువుముద్దర. దుగళం పేరామిదపుగిఁజవలె కత్తిగడుసు' రందాపట్టు ....దప్పం కత్తిలఘువు.

ఆయాతావులఁ గత్తియొక్క ముద్రలు చిత్రింపఁబడియున్నవి. ఫరుజులు ఢాల్‌లు కేడెములు పేరులు గుర్తుకొఱకుఁ గొన్నివ్రాసికొన్నారు.

కెడెయములు— బరువుగానుండును. క్రొత్తది కోసిన నేరేడుపండు చెక్కినట్టుండును. ప్రాతగిలిన దోరబీరకాయచెక్కనఁ గోసినట్టుండును. నలుగుదగిలినఁ గూడిపోవును. నాలుగుతావులను బెట్టునది కెడెయము. తక్కినతావున పెట్టేది చిలువట్టు. ఇత్యాదికలవు.

ఈపుస్తకముజదివిన పుదుకోట్టసంస్థానములోనిదని తెలియవచ్చును.

27. స్కాందాంతర్గత ధర్మఖండము — గ్రం. సం. 117.

కవి యీఁదులపల్లి భవానీశుఁడు; కవి యీగ్రంథమును శ్రీశైలమల్లికార్జునిని కంకితముచేసెను.

గద్యము:— ఇది శ్రీమద్గురుకరుణాతిశయలబ్ధ కవితావైభవ యీఁదులపల్లి
శంకరమంత్రితనూభవ సుధీజనవిధేయ భవానీశనామధేయప్రణీతంబైన స్కాందపురాణంబున ధర్మఖండంబునందు.....ఆశ్వాసము.

ఈ క్రిందిసీసపద్యములోఁ గవి తనవంశముం జెప్పుచున్నాఁడు.

సీ. ధాత్రి భారద్వాజగోత్రపవిత్రుఁడై సురుచిరాపస్తంబసూత్రుఁ డగుచు
నిరతాన్నదానాభినిరతుఁ డౌనీఁనులపలి నరసామాత్యుపౌత్రవరుని
సంతతపూజితశంకరుం డగుశంకరామాత్యమౌళికి నాత్మభవుని
బ్రాజ్ఞుని నచ్చమాంబాగర్భశుక్తిముక్తామణి నీశ్వరధ్యాననిరతు
భవ్యశృంగారమంజరీకావ్యరత్న, మాంధ్రభాష నొనర్చిన యనఘచరితు
శంభునిభుఁడగు నివటూరిశంభుశిష్యు, ననుభవానీశనాముఁగన్గొనుచుఁబలికె.

ఇప్పద్యమందలి యివటూరిశంభుఁడు మతగురువును-

ఉ. శ్రీయుయవాగ్విలాసుఁడు నశేషలిపిప్రవణుండు భూరిశో
భామహనీయమూర్తియుఁ బ్రబంధనిబంధనబంధురక్రియా
భామహతుల్యసూత్రుఁడు నృపాలకపూజ్యుఁడు నంచుఁ దర్జనుల్
వేమఱు నెంచ దిట్టకవి వేంకటరాయ కవీంద్రుఁ డొప్పగున్.

చ. అతనికృపాకటాక్షవిభవాతిశయం బనిశంబుగల్గ నే
నతులకవిత్వతత్త్వమహిమాఢ్యతఁ బ్రౌఢిమఁగంటిఁ గావునం
గృతమతిచేఁ బ్రబంధ మొనరించు తలంపున స్వప్నమున్ సమం
చితగతి నమ్మహాత్మునకుఁ జేతులుమోడ్చుచు విన్నవించితిన్.

అనుపద్యముంబట్టి యీ వేంకటరాయకవి విద్యాగురువు నని తెలియవచ్చును. ఇంతకంటె నీతనివంశాదికము వివరముగాఁ దెలియదు. సుకవిస్తోత్రము కుకవినింద స్వప్నము నిందును గలవు.

ప్రారంభము.

ఉ. శ్రీనగకన్య ముత్యములచేఁ దలఁబ్రాలిడువేళ శీర్షగం
గానదిఁ జిందు బిందువులక్రిందున సర్వసుపర్వకోటి ను
ర్వీనుతవైభవంబునఁ బవిత్రితగాత్రులఁజేయు శంభుఁడా
శ్రీనగరాజమందిరుఁ డశేషశుభంబులు మాకు నీవుతన్.

మ. గరిమం గౌస్తుభరత్నబింబితనిజాంగస్ఫూర్తి వేఱొక్కసుం
దరియుంచున్ సిరి యెంచునత్తఱి నితాంతప్రీతి సంధిల్ల న
య్యురుభూషామణిఁ దత్కుచాగ్రమున నాయోజించి కేళీకళా
స్ఫురణన్ రంజిలఁజేయు శౌరి దయఁ బ్రోచు న్నమ్ము నెల్లప్పుడున్.

చ. సురరమణీమణీచికురచుంబితపాదసరోజ మారఘు
స్మరనిరవద్యవామతనుసౌధనివాసిని యోగిలోకహృ
త్సరసిరుహభ్రమద్భ్రమరి సర్వజగజ్జనయిత్రి సీత భూ
ధరవరపుత్రి నిత్యశుభదాత్రి ననుం గృతకృత్యుఁజేయుతన్.

....

గీ. అనుచు నిష్టదేవతాదిను సత్కవి, వందనంబుఁ గుకవినిందనంబుఁ
జేసి తెనుఁగుబాస భాసురమగుగతి, కబ్బమెలమిఁ జేయఁగా దలంచి.

గీ. స్కాందమునఁదగు సేఁబదిఖండములను, ధరణిధరములఁగనకభూధరముకరణి
మేటియై ధర్మఖండంబుమిగులనలరు, నదియునా నేర్పురీతిఁ జెప్పెదముదమున.

ఇట్లనుకొనుచుండఁగా స్వప్నములో నమృతలింగమూర్తి యీశ్వరుఁడు సాక్షాత్కరించి తనకాకృతి నిమ్మని కోరి పుచ్చుకొన్నాఁడు.

ఈప్రతిలో అగిన పత్రములలోఁ దొమ్మిదియాశ్వాసములు మాత్రము కలవు. తొమ్మిదవది పూర్తిగాలేదు. రామాయణకథలో నాగపాశములపిమ్మట.

క. సురవరులు నసురయోధులు, హరివీరులు గనఁగ రాఘవానుజుఁ డప్డే
శరవృష్టిన్ ముంచిన న, య్యురుభుజుఁ డజశరము వింటయోజించి వేసన్.

గీ. అనఘుఁ డీరాముఁడు పరాత్ముఁ డయ్యె- అనునింతవఱకెకలదు.

ఈకవి యింతకుమున్ను శృంగారమంజరి యనుకావ్యమును రచించియున్నట్లు వంశవర్ణనము పద్యముంబట్టి తెలిసికొంటిమి.

—— కవిత్వశైలికై కొన్నిపద్యములు ——

క. అడిగెడుధనికులు గమలే,వడి మాకని యతిథిఁ దిట్టి స్వల్ప మొసఁగి యా
కడఁ బశ్చాత్తాపితు లగు, జడమతులకు నల్పసుఖము సమకూరుఁ దుదన్.

గీ. వేలరానిచ్చి తని ద్వారపాలుఁ గినిసి, యతిథి గడనిడి కడువడి నారగింప
కిష్టమృష్టాన్న పానీయతృప్తుఁజేయ, వలయు నైశ్వర్యకాములై వఱలువారు.

శా. ఆతం డధ్వరకర్మ కర్తలకుఁ దా నార్త్విజ్యముం జేయుచున్
శ్రౌతస్మార్తవిధిజ్ఞుఁడై నిఖిలదేశస్తుత్య సద్విద్యుఁడై
ధూతాఘుండు వినిర్జితేంద్రియుఁడు సంతుష్టాంతరంగుండు నై
ఖ్యాతి న్సర్వమహీసుపర్వ నృపలోకాచార్యుఁడై వర్తిలున్.

ఉ. ఇష్టముఁ బూర్తముల్ వ్రతము లిద్ధతపంబును దీర్థయాత్రలు
త్కృష్టపరోపకారములు నిమ్ముగఁ జేసినవాఁ డగు న్నిజా

దృష్టతఁ గాశి కేగి నిటలేక్షణు నీశ్వరు విశ్వనాథు భ
క్తేష్టదుఁ జంద్రశేఖరు మహేశ్వరుఁ జూచినవాఁడు పోఁడిమిన్.

శ. శంభుద్వేషులు దోషదూషితులు హింసాతత్పరుల్ క్రోధులున్
శుంభత్కర్మవిదూరులు న్బుధజనస్తోమక్రియాదూషణా
రంభగ్రస్తులు నైనభక్తులు సురేంద్రా తామసుల్ విష్ణుఁ డా
దంభాచారుల దుష్కుమారులఁ బలెం దాఁ గన్గొనున్ నిష్కృపన్.

వ్రాఁతతప్పులు మెండుగాఁ గలవు. ప్రతి మంచిస్థితిలో నున్నది.

28. గోపాలవిలాసము—గ్రం. సం. 135.

ఇది యొక్క యక్షగానము. దీనికిఁ గాళింగచరిత్ర మను నామాంతరము గలదు. ౪౧ పత్రముల పుస్తకము. ప్రారంభము :—

శా. శ్రీరామా విను నే నుతింతు మదిలో సీతామనోనాయకా
ఘోరాకార మదారిదైత్యహరణా కోట్యర్కతేజోమయా
నీరేజాసనసేవితాంఘ్రికమలా నీవాఁడ నన్నేలు మీ
కారుణ్యాకర రాఘవాన్వయమణీ కాకుత్స్థవంశాగ్రణీ.

వ. ఇట్లు కృతీశ్వరుండైన రామస్వామిని వినుతించి హరిహరబ్రహ్మాదుల నేమని కొనియాడుచున్నాఁడు.

త్రిపుట—సిరికిఁ జెప్పక యుఱికి మకరిని నఱకివేగమె దరికి నీడ్చుకఁ గరికి
నభయం బొసఁగు శ్రీనరహరికి శరణు॥

మట్టిరథమఁట గట్టువిల్లఁట జంటనాలుకదంట నారఁట కంటిమంటల
మరునిగెల్చిన ఘనునిఁ గొలుతున్॥

తమ్మిఁ బుట్టినదాత తానై క్రమ్మి లోకములెల్ల నేలిన। బొమ్మదేవరపద
ములెన్నుదు నెమ్మిమీఱన్.

వ. ఇందిరా గౌరీ వాణీ మహాదేవుల నేమని సన్నుతించుచున్నాఁడు.........

ఇట్లు సకలదేవతాప్రార్థనంబును సుకవులకు వందనంబు నాచరించి శ్రీమన్మహాభాగవతంబున దశమస్కంధంబునందు శ్రీకృష్ణలీలలు వర్ణన సేయం దలంచి యున్న నొక్కనాఁడు.

సీ. నిగమగోచరుఁ డైననీలాద్రినిలయుండు విప్రవేషముఁ దాల్చి వేడ్కతోను
నొకచేత బెత్తము నుత్తరీయంబును ముసిముసినగవుతో మోదమునను

మధ్యాహ్న వేళను మందిరంబున కొచ్చి దాహము దెచ్చుచుఁ దరువులిడుచు
మాధవు చరితలు మఱచినాఁడవునీవు రచియింపుమీ చాల రమ్యముగను
వినుము మాపల్లెలన్నియు పేనులలరఁ, గనుము మోక్షము శ్రీహరికథలవలన
మనుము సుజ్ఞానివై చాల మన్మముఱచి, మనసుర జల నిట్లనె మహిసురుండు

క. నడవడి గలిగిన యప్పుడె, పడయఁగవలె విష్ణుభక్తి పదిలుఁడవై తే
విడువక కృష్ణుని చరితలు, కడు వేడుక వెన్నముద్దగణపతిపెద్దా.

వ. అనుచు నానతిచ్చి యదృశ్యుం డైనఁ బరమేశ్వరుండని నిశ్చయించి చూచి యేఁగూర్చుండి భాగవతార్థంబున దశమస్కంధంబున నేను రచియింపం బూనిన గోపాలవిలాసంబను యక్షగానంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన నెటువలెను.

సీ. అభిమన్యుపుత్త్రుండు హర్షంబుతోడను శుకయోగరాయని జూచిపలికె...

ఈపైవాక్యమువలనఁ గవియభిప్రాయము తేటపడినది. కథాసందర్భము దెలిసినది. "కడు వేడుక వెన్నముద్ద గణపతిపెద్దా" యను మాటలోఁ గవి గణపతి కొడుకు పెద్దన కవియేమో యని యోజింపవలయును. ఇంతకంటె నాతనివిషయము తెలియరాలేదు. కథాభాగములోని కొన్ని వాక్యములు:—

త్రిపుట- బింకమున గాల్ద్రవ్వి అంకెలు పెల్లుగా మ్రోయించు వృషభము వంకఁజూచిన యపుడె గ్రక్కున తెంకిద్రోపె...

జిట్టుజిట్టున నట్టులెత్తుక గట్టులవలె దుమికి కోడెలు నట్టుకట్టులు నడిచెఁ గదుపులనడుమ నపుడు......

వ. అట్టికదుపులముందలు కుదుర్చుకొని పాలు పిండుచు నీళ్ళు...దినదినంబును వింతలు గులుకుచు నావులమేఁపుచున్న రామకృష్ణులు ప్రలంబతృణావర్తబకధేనుకాసుర మొదలైనరాక్షసుల...

జంపె. ఓదేవమీయాజ్ఞ నుల్లంబురఁజెల్లె నావిన్నపంబొకటి నలినాక్షవినుము!
వాడుచే గరుడుండు వైరంబు మదినుంచి భేదించునను జాల భీతిఁజెందెదను.

వ. అనినఁ గృష్ణుం డేమనుచున్నాఁడు.

జంపె. మాపాదములు నీకుమస్తకంబున నిలిచె నాపక్షిరాజు నిన్నలయింపఁ డికను.

చిట్టచివర మంగళహారతియు వ్రాలాశ్వభ్రలుపద్యమును గలవు.

చిత్రభానునామసంవత్సర కార్తిక శు ౯ శనివారము కార్తికి నెల ౧౦ తేదివఱకు వ్రాసిన కాళింగచరిత్ర గరటయ సెట్టికి ముత్తరాజు కృష్ణయ్య వ్రాసి

యిచ్చినది. మొదటి యొత్తుపుటమీఁద "విఠోబా కాళింగచరిత్ర యెత్తినవారు చదివి యిచ్చేది- యియ్యకపోతే కొట్లోవేశి కొటుకెలుపుత్తో తీశియిచ్చేది. అని యున్నది. ఈవిఠోబా యెవ్వరో తెలియదు. దక్షిణదేశప్రతి- పుదుకోట వేంకటేశయ్యగారిచ్చినది.

(29) రామశతకము- గ్రం. సం. 136.

ఇది యొక కందపద్యశతకము. కాని యిరువదియొక్క పద్యములు మాత్రము గలవు. కవిపేరు తెలియదు- నైచ్యానివేదప్రకరణము, నిష్ఠురోక్తిప్రకరణము, అంతఃకరణదోషనివేదనప్రకరణము, చిత్తశుద్ధిప్రార్థనాప్రకరణము, నని ప్రకరణములనైదేసిపద్యములు వ్రాయఁబడినవి. కొన్నిపద్యములు-

శ్రీరమణా నీచరితము, ఘోరము లగుపాపములను గొట్టుటచేతన్
సారతమమైననామము, తారకమని తలఁతు మదిలో దయగలరామా.
సరసుఁడ నీనామముచే, స్థిరముగ వేఁడంగఁజేయు దీనశరణ్యా
కరతలుఁడు గావె భక్తుల, మఱవక నను గావు సుగుణ మతిగలరామా.
తామసగుణంబుచేతనె, పామరుఁడుగఁ దిరిగినాను పరమాత్మక నీ
ప్రేమను గలిగెడి యతులిత, నామసుధఁ గ్రోలఁజేయు నరవరరామా.

ఇదియును బై వేంకటేశయ్యగారిచ్చినదే.

(30) పాండవాశ్వమేధవృత్తాంతము- గ్రం. సం. 138.

జైమినిభారతము- అశ్వమేధపర్వము కథ- వచనము, మొదటి ౧౭ పత్రములు లేవు. మొదటిది యమునాసురునికథ, రెండవది నీలధ్వజునియుద్ధము. మూఁడవది యమృతధ్వజునికథ- ఇతనికుమారుఁడు సుధర్ముని కథ, నాలుగవది సురథునికథ, ఈసురథుఁడు సుధర్మునితమ్ముఁడు, అయిదవది వరాహదేశకథ, ఆఱవది బృహల్లీలకథ, ఈబృహల్లీలస్త్రీ- ఏడవది బభ్రువాహనునికథ. ఏడు భాగములు. ౨౬౯ పత్రములు. భాష వ్యావహారికభాష. దానికిఁదోడు వ్రాఁత తప్పులు. కవిపేరు తెలియుట కాధారము లిందేమియుఁ గనఁబడవు. అఱవము చదివిన దక్షిణాదితెనుఁగువారు వ్రాసినది. ఉన్నదున్నట్లు వరాహదేశకథలోని కొంతచిత్తగింపుఁడు.

"అటుపిమ్మట అశ్వం సంరక్షణకాయవచ్చిన అర్జునుడు అమృతధ్వజ రాజున చుట్టంచేసుకొని సకలమైనరథగజతురగపదాదులతోకూడా అర్జునుడు రథారూఢుడై అశ్వం వెనకపార్శ్వముగా నడిచి దేశం దాటి అవతల స్థాయ్యే

టప్పుడు అనేకమైనవాల్లుఁ వచ్చి నోరుతెరచుకొని చూచి అష్టాదశవాద్య ఘోషముల శబ్దములు విని భయపడి కిరీటిదండుకు జూచి భ్రమశి పరుగెత్తిరి. దండు రెండామడదూరం అవతలనడిచి పొయ్యేటప్పుడు అక్కడ వకదండకార ణ్యావనం కనిపించును. అందుకు అవతల దక్షిణముగా నడిచి పశ్చిమ దిక్కుగా పొయ్యేటప్పుడు వరాహదేశ మని వకదేశం ఆదేశం యొక్క వర్తమానం యేలాగంటేను అందులోవుండే మొగవాండ్లు ఆడవాండ్లు నిమానముగా వృక్షశాఖలులో గొబ్బిలమువల వేలాడుకొని వుండేదిన్ని పగులు ముప్పొన్ని వృక్షములమీద తొత్తుకొని వుండేదిన్ని అస్తమానమునకు సంచారములు చేశేదిన్ని ... ... అర్జునుడు అమృతధ్వజరాజును అడుగగా వినవ య్యా కిరీటిమహారాజా తెలుస్తుంన్నదే ఆపట్నం బ్రహ్మదేశం ఆదేశములో వాల్గు విధములు గల్గినకొంమ్ములు వుండే మనుష్యులు వుంటారు. అనిపల్కరించగా అశ్వం ఆపట్నం సమీపమున పొయ్యేటప్పుడు రణభేరి శబ్దం విని అందులో వుండేజనులు బయలుదేరి వాళ్ళకు వొకరికి వొకకొంమ్ము నొకరికి రెండుకొంమ్ము లు వొకరికి మూడుకొంమ్ములు ... ... వాల్లుఁ వెయి రెండువేలు మూడువేలు యీప్రకారంగా వచ్చి దూరముగా నిల్చి చెతులుకట్టుకొని కొంమ్ములచాత పొడిచేభావముగా కొంమ్ములు ఆడించుకొని నిల్చివుండగా అర్జునునిదండు జూచి భయపడి ... ...

బృహల్లీలలోని కొన్ని వాక్యములు:—"వినవయ్యా కిరీటిమహారాజా యీఅశ్వంపొయ్యేది మదనమండలదేశమని వొకదేశం ఆదేశం యెలెటటువం టిది బృహల్లీలయనె ఆడది- ఆదేశములో ఆడవాండ్లువినాగ మొగవాండ్లు మం దుకుకూడా తగలదు. అటువంటి బృహల్లీల తపస్సుజేశి సర్వాస్త్రఘాతి అని అస్త్రము పరమేశ్వరుని దగ్గరతీసుకొని వచ్చింది. కాబట్టి యీఉత్తరకురుక్షే త్రములో వుండతగ్గ రాజాధిరాజులు దేశాధిపతు లంధరున్ను బ్రహ్మరుద్రాదు లున్ను నేటివఱకున్ను దానిం జయించింది లేదని అమృతధ్వజుడు చెప్పగా— అర్జునుడు విని పరమేశ్వరుడు మహావంచనజేశిరి నేను పోయి అడిగినందుకు పాశుపతాస్త్రము ఇచ్చెను నాకు ఆ అస్త్రము యియ్యరాదా ... ..."

ఆంధ్రజైమినిభారతములో- సురథుఁ డనిన- దీనసుపుతుఁడని, ప్రమీలకే కా వచ్చును- బృహల్లీలయని- వృక్షదేశమునకు వరాహదేశమని యుండుట కథల భేదముచే నలువగ్రంథ మొక్కటి యున్నదేమోయని తలంపుగలుగుచున్నది.

(31) శ్రీపతీయమ్. సవ్యాఖ్యానమ్ గ్రం. సం. 143.

శ్లో॥ జగదుదయస్థితిసంహృతికారణ మవికారి సచ్చిదానందమ్।
శ్రీమంతం కృష్ణాఖ్యం తేజో మే హృది సదా స్ఫురతు॥
ఆచార్య శ్రీపతికృతా జాతకర్మాఖ్యపద్ధతిః।
వ్యాఖ్యాయతే మ.....................దేవేనయజ్వనా॥
పశ్యంతు త మిమం గ్రంథం శాస్త్రన్యాయోపబృంహితమ్
పూర్ణం జాతకశాస్త్రాణా మలంకారం విపశ్చితః॥

శ్రీపతి రాచార్యో భీష్టదేవతానమస్కారపూర్వకం భౌతిక.........
త్యాఖ్యం గ్రంథకరణం శ్లోకేన ప్రతిజానీతే। నత్వేతి॥

శ్లో॥ నత్వా తాం గురు దేవతాం త్రిసమయజ్ఞానోద్గతేః కారణం
తత్పాదాంబురుహప్రసాదవికసద్బోధో బుధః శ్రీపతిః
శిష్యప్రార్థనయా విచార్య సకలాన్ హోరాగమార్థాన్ బహూన్
వక్ష్యే జాతకకర్మపద్ధతి మహం హోరావిదాం ప్రీతయే॥

నత్వేతి జాతకర్మపద్ధత్యాఖ్యం గ్రంథం జాతకజ్ఞానాం ప్రీత్యర్థం కరిష్యామి॥ అత్రజాతకశబ్దేన యవన బాదరాయణ విష్ణుగుప్త వరాహమిహ రాదికృతాని జాతక శాస్త్రాణ్యుచ్యంతే। తైరుపాదీయమాన భావాద్యానయనోక్తం గణితకర్మ జాతకర్మ తస్యపద్ధతిః తదపేక్షిత గణితకర్మానుపూర్వప్రతిపాదకో గ్రంథో జాతకర్మపద్ధతి రిత్యన్వర్థా సజ్ఞా......

జాతస్యాయుర్దశావిపాకాది తమపయోగాని యాని జ్ఞాతవ్యాని తాని ద్వితీయేనశ్లోకే నానుక్రామతి.

శ్లో॥ జ్ఞేయో త్ర ప్రథమాహి జన్మసమయచ్ఛాయాదియంత్రైః స్ఫుటం
తత్కాలప్రభవావిలగ్నసహితాం కార్యాస్తతశ్చ గ్రహాః
సిద్ధాంతోక్తపరిస్ఫుటోపకరణైస్తైశ్చాసకృత్కర్మణా
భావాః ఖేటదృశో బలానిచతతః తేషాం విచింత్యానిషట్॥

ఇత్యాదిగా ౫౫ పత్రములు గలప్రాతపుస్తకము దక్షిణదేశప్రతి. వ్యాఖ్యాతపేరు తెలియుట కాధారములేకుండ మొదటఁ గొన్నిపఙ్క్తులు పోయినవి.

(32) లీలావతీదండకము- గ్రంథసంఖ్య 151.

ఈదండకమును శేషయార్యుఁడు రచించెను. కచ్చిరంగరాజదండకము భోద్రానదాదండకాదులు చదివినవారి కిదిచదివిన దండకములు పూర్వకాల

మునవారు రచించు ప్రణాళిక బోధపడఁగలదు. ఇందును రాజువర్ణన లేవఁగనే యద్దముచూపుట, తర్వాత సాముచేయుట, స్నానముచేసి భోజనానంతరము సభలోఁ గూర్చుండి కొంతసేపైనపిమ్మట గుఱ్ఱమెక్కి బైలుదేఱుట, వీథిలో నొక్కతె చూచి రాజును మోహించుట, దానివిరహము నిత్యాది- ఈదండకము లోఁగూడ రాజుపేరు మొదటవ్రాసి పిమ్మట నాయాతావుల దుడిచివైచి రామస్వామిక్షితీంద్రుండు, ఆనందపృథ్వీంద్రపుత్త్రుండు, అని సవరించినాఁడు, కారణము తెలియదు. పలుతావుల దిద్దఁబాట్లు జాగ్రత్తగాఁ బరిశీలించి వెలికిఁ దీయఁగా "శ్రీమూకరాజాన్వయాంభోధి సంపూర్ణచంద్రుం" డని యొక్కచోటను. "శ్రీవేంకట పెరుమాళ్రాజుభూనాయకుం" డనియొక్కచోటను దోఁచినవి. ఇందలి రామస్వామిక్షితీశుఁ డెవ్వరోగాని దండకాంతమునఁ గ్రొత్తగా నీతనిపైఁ జెప్పఁబడిన పద్యములు చేర్పఁబడినవి. అవి పిమ్మటఁ గనఁబఱుపఁబడును. ఈ దండకకవిత్వము పటుత్వము గలది.

శ్రీజానకీమంజులాస్యోద్యదానందసంజాతమందస్మిత శ్రీనిదానీకృతాత్మీయనర్మోక్తి లీలావహద్దివ్యతేజః పదద్వంద్వసేవాధురీణుండు......వారాశి కన్యామణీ నృత్తరంగాయితాపాంగవీక్షాకృతైశ్వర్య సంతోషితార్యాతిచాతుర్య ధుర్యానివార్యత్స్ఫురత్సాహితీమార్గసంశోభితాత్మీయకీర్తి ప్రభావుండు... ("భాస్వచ్చిదానందచిత్తాంబుజానంద పృథ్వీంద్ర") ఇంతవఱకు గ్రొత్తగాఁ జేర్పఁబడినది- పుత్త్రుండు, శ్రీరామస్వామిక్షితీంద్రుండు......తానొక్కనాఁ డక్కజంబైన రంగారు బంగారు మేలద్దపు న్మేడలో నంబుజాక్షీవికాసస్ఫురద్గంధసంబంధి మందానిలాంకూరముల్వీవ......నిద్రమేల్కాంచి కాంచీకనత్కింకిణీకంకణంబుల్ క్వణింపంగ నచ్చెంగట న్నిల్చి......చీనాపనీహార్వులన్నిగ్గులన్ ముద్దులంగుల్కు మేలద్దమున్ ముందట న్నిల్ప...నించువిల్కానివారించుచందంబుతో దంతపుం బల్కపావాలొయారంబుగా మెట్టి......కెంబట్టుదట్టి న్నొలంగట్టి- బస్కీలు గర్తాపురాల్ కొంతసాధించి జోడీలునున్ సంగడాల్ లోడులం దీసి గోతాము పై కత్తికొన్లానులా సించి...ప్రొద్దునఁ బెంజెట్టితో మల్లుపోరాడి...పట్టాను చిల్లోడి కేడెంబునున్ బూనిమాష్టీనితోఁ జేరభంగాయమానంబులౌ కాయమానమ్ములం జేసి తత్తాహ తద్ధిక్కు తద్ధెయ్య తద్ధిమ్మి తజ్జంత తక్కిణ్ణ తద్ధోం తవోయంచు... నటుండాడు బోటిం దగందిద్దుచందాన బారెంట మూరెంట జేనెంట దుత్తెంట బెత్తెంట వేద్రిప్పుచో మేలుమాజ్జష్షవాహా భళా ఛాంగు దాదా యటం

చుం గతుం బ్రీతిఁ దారంగిరు త్మెచ్చ వాహ్యాళిగా వచ్చు నప్పేడుకన్ దక్షు గుల్కం బదార్వన్నె బంగారపున్నేడలన్ ఘుమ్ఘుమ్మంచు నెత్తావులం గుల్కు నక్కల్వపూచప్రపు న్నీడల న్వాన్నెలల్ బోలు చిర్నవ్వు చెక్కిళ్లపైం గుల్కు నెమ్మేను శృంగారముల్ చిల్క...నిల్చుండి కన్పండువై చూచు నప్పారవారాంగనాకోటిలో మేటినెత్తావికిం బేటి పూవిల్తుమేల్తూన్న పూఁబోండ్లకున్నిన్న... (ఒక్కతె ప్రార్థింపఁగా) లాలించి తేలించి మెప్పించుచున్...సుఖానన్ చిరంజీవిగా వేడ్కనున్నాఁడటంచున్ జగద్గీతచర్యాతివిస్తారుపేరన్ గుణాధారుపేరన్ సంపన్నిదానీకృతాకుయ్యాపద్మాక్షుసేవాధురీణోల్లసన్మాన సాంభోజుపేరం గలాంభోజుపేరన్........కవీంద్రు ల్నుతింపంగ నుద్దండవిద్వత్కవిత్వాంకుఁడైనట్టి శ్రీశేషయార్యుండు కైసేయు శృంగారిణీదండకం బుర్వి నాచంద్రతారార్కమై వర్ధిలుంగాత !”—

దండకము పేరు మొదట లీలావతీదండకమని యొత్తుపత్రము మీఁద నున్నది దండకము చివర శృంగారిణీదండక మని చెప్పఁబడినది. ఈకవి కు ద్దండుఁ డని బిరుదము గలదఁట. ఈదండకమంతయు ౧౬ పత్రములలోఁ గలదు.

ఈదండకము తరువాయిని విశేషముగా ననేకులు రాజులపేర నంకితములైన చాటుపద్యములు గలవు.

(1) పైరామస్వామినృపునిమీఁది పద్యములు.

శా. శ్రీరంజిల్లగఁ బ్రాణభర్తయొకఁ దోఁచె న్స్వానురాగోదయం
బాహూఢిం దనలోన నిండి వెలికిం బైఁబర్వెనా నాఁగరం
గారున్ లేఁదొగరొప్పు మేనుగల శ్రీకాంతాంబుజాతాక్షిగం
భీరుండై తగు రామసామినృపునిం బ్రీతిం గృపం బ్రోవుతన్. ౧

మ. ధరలో నాజికుమారవృత్తి విబుధత్రాణోత్సుకస్ఫూర్తి శం
కరధర్మాహృతసారశక్తి సుమనఃకాంతాత్మవిఖ్యాతిచే
వరల న్నీవలరామమూర్తివె యనన్వర్ధిల్లి తౌరార మేల్
స్మరసౌందర్యనిదాన. దానఖని రామస్వామి భూపాగ్రణీ. ౨

శా. నీమాన్యం గటికేవి ? గనినంతే యాహిరణ్యోదరుం
డేమో యాహరినాభిగహ్వరము నందే దాఁగె నంతన్ హరిన్
ధామాంచద్భవదేకభక్తిదహరాంతర్లీనుఁడైనిల్చె శ్రీ
రామస్వామి నృపాలచంద్ర యిది చిత్రం బయ్యెడిం దెల్పుమా. 3

కొన్నిపత్రములు విఱిగిపోయినవి. అందుఁ బెక్కుసీసములు విమలగుణ హార యానందవిభుకుమార, సరసవాగ్ధార శ్రీరామస్వామిధీర ? అని యేమో కలవు. నిండుపద్యములు వ్రాయవలనులేదు. ఇట్టివి ౨౦ పద్యములున్నవి.

(2) అళఘరిచామధీరునిపై పద్యములు-

సీ. శ్రీనారాసింహరాజీవాక్షుపదభక్తి భూరిసత్కవులను బ్రోచుశక్తి
సకలవిద్యలయందు సంతతం బనురక్తి నీతిధర్మములందు నిండుయుక్తి
కలిదోషవిజయవిఖ్యాతియం దాసక్తి శిష్టులయందెల్ల శీతలోక్తి
తరుణులయందుఁ గందర్పకాభివ్యక్తి యిష్టులతోఁగూడి యెపుడు భుక్తి
యొసఁగ వెలసితి వౌరౌర యిపుడిలఁ, నంగజాకార కల్పద్రుమావతార
భళిర శ్రీలండకదిరి భూవరకుమార, సంగరకుమార యళఘరిచామధీర. ౧

సీ. చక్కెరపొంగలే సమరాన నెదిరించు మదవద్విరోధులమాంసరాశి
కమ్మనికూరలా కక్కసంపుతుటారి కుటిలవిద్వేషులగుండె లెల్లఁ
దాళఫలమ్ములా దంటగొంటరి వీరమాస్టీల కుండలమస్తకములు
కజ్జాయరాసులా గడెమనేదారుల మేనుఁ క్రొవ్వులు మెదడుమండఁ
బానకంబా రణాంగణవైరిభటుల, రాశిగావించు శిరముల రక్తధార
ధరను నీకత్తి యనెడు బేతాళునికిని, సంగరకుమార యళఘరిచామధీర.

ఇట్టివి ౧౬ పద్యము లున్నవి. నకుమ మూఁడాకు లిందు లేవని వ్రాసినారు. తొమ్మిదవ పద్యమునుండి ౧౩ పద్యమువఱకు దానిలోఁబోయినవి.

రఘునాథరాజు మీఁది పద్యములునుగలవు. ఈపద్యములమకుటము కలితగుణపేటి కవికోటికల్పవాటి రమ్యవాగ్ఘాటి రఘునాథరాట్కిరీటి॥ కచ్చియచ్యుతభూపాలుఘనకుమార వినుతకవిచంద్రరఘునాథమేదినీంద్ర॥ మొ।

కొన్నిపద్యములు పూర్ణముగా లేవు.

మ. స్థిరలో యళ్గరిచామభూమిపతి హే! నీవు ఘోరాజిసిం
బరరాజన్యముఖాబ్జబింబములు తేనంగంటినే యంగ భా
స్కరబింబంబును జంద్రబింబము వియత్కంజాతపత్రేక్షణా
ధరబింబంబును గంటిమె చెలఁగెఁ జిత్రం బేకవాక్యోన్నతిన్.

(3) చంద్రశేఖరనృపాలునిపైపద్యము.

శా. శృంగారాస్పదమైన సత్కరుణచే శ్రీరంగనాథుండు మా
తంగోత్తుంగతురంగముఖ్యబహుశార్ధశ్రేణి నీకిచ్చెసా

గాంగేయోపమ నీతిశౌర్యయుత వేడ్కం గచ్చిసద్వంశజా
రంగాధీశ్వరుచంద్రశేఖరనృపాలా పాలితార్థివ్రజా.

ఈప్రాసములో మూఁడునాల్గు చరణలు మకుటముగాఁ గొన్నిపద్యములున్నవి.

ఉ. తెల్లమిగాఁగ ధీయునుదఁ దేజనిమీటి పిరంగికత్తిచేఁ
బెల్లునఁ దాఁకి శాత్రవుల పిక్కలు డొక్కలు జెక్కులక్కులుం
జిల్లులు చేసి వేసితివి చెంగటిరాజులు మేలుమేలనన్
నల్లపముద్దురంగనరనాయకచంద్ర సురేంద్రవైభవా.

ఇట్టిమకుటముతో ౧౫ పద్యములున్నవి.

మ. దినమధ్యోద్భటసూర్యశౌర్యగుణసద్రీచీనసంభూతిచే
తను శత్రుక్షితిపాలజాలముల సంధన్ సందులన్ గొందులం
దున ఘూకావళిఁబోల్పన న్నిలిపి తోడ్తో మేలుగన్నావహో
విను సర్వేశ్వరవిశ్వనాథ సుకృతీ విస్తారవాగ్విస్ఫుతీ.

ఇట్టిపద్యములుకొన్నిగలవు.

చ. వరవిజయాభిరామ శుభవైభవవిక్రమవిక్రమార్క నీ
గురుతరకీర్తికాంతకుచకుంభముల న్విలసిల్లుస్వర్ణపు
న్వరమణిహారజాలముల వైపునభాసిలె నబ్జజాండముల్
స్థిర మనుబ్రోలురంగఘనతిమ్మనృపాల కృపారసోజ్జ్వలా

ఉ. దానదయాస్వరూపబలధర్మపరాక్రమ చాపనైపుణిన్
ధీనిధిరంగరాజఘనతిమ్మనృపాలుఁడు పోలుఁ జంద్రునిన్
వానిమఱంది వానిసుతు వానిపితృవ్యుని వానిబావనన్
వాననుజన్ము వానరుజు వైఖరిమీఱఁగ ధాయణీస్థలిన్.

ఇట్టివి పెక్కుపద్యములున్నవి.

చ. ఘటనయొనర్చి స్వామిహితకార్యముతప్పక నిర్వహించి వి
స్ఫుటముగఁ గీర్తిఁగాంచె మును పొందుగ మంత్రియుగంధరుఁడు ది
క్తటముల వానిచందమునఁ గంటివి కీర్తిని పత్తికొండవేం
కటపతికుప్పయప్రభుశిఖామణి దానకళామరున్మణీ.

ఈప్రాసముపైఁ గొన్ని పద్యములున్నవి.

సీ. పదచాళి వినిపించు వైభవస్ఫురణకుఁ గొమరొందు ముత్తేలకుచ్చుచెల్లు
జక్కిణివినిపించు చాతుర్యమహిమకు రంజిల్లు వింజామరములు చెల్లు
తాళవిన్యాసభేదమున నాట్యానకుఁ దులలేని బిరుదుకాహాళలు చెల్లు
అభినయం బొనరించు నతిశయప్రౌఢికి నిరతంబు డవిణెమల్హారులు చెల్లు
ననుచు నేకోజిభూపాలుఁ డనుదినంబు, మెచ్చి ముత్తేలకుచ్చు నీకిచ్చుసభను
గలితగుణపేటి యాశ్రితకల్పవాటి, భావజునిఘోటి ముద్దుమంగావధూటి.

సీ. శివునికంధరముపై శేషునిశిరముపై జలజారియురముపైఁ జఅచిచఅచి
భారతివేణిపై బలునికృపాణిపై నారదువీణపైఁ దూఁటిసూటి
తారాద్రితరులపైఁ దార్క్ష్యునిగరులపై వలిమలచరులపై వ్రాలివ్రాలి
నరసింహునక్కుపై నందిబల్మొక్కుపై గజపతిచెక్కుపైఁ గవిసికవిసి
చెలఁగె జగములఁ దావకోజ్జ్వలితయశము, హరిహీరపటీరడిండీరరుచుల
కచ్చియచ్యుతభూపాలుఘనకుమార, వినుతకవిచంద్ర రఘునాథమేదినీంద్ర.

సీ. మలయకేతన పాండ్యమధురాధినాథాగ్రసామంతనృపనీకు జయముజయము
కున్నమన్వయవార్ధికువలయినీనాథ సజ్జనావననీకు జయముజయము
మళ్వరాయాధిప మహనీయబిరుదాంక సంగరార్జుననీకు జయముజయము
అనుచుసత్కవిరాజులు వినుతిసేయ, విశ్వధాత్రీస్థలంబున వెలసితౌర......
తక్కినదిలేదు.

ఇట్టిపద్యములు కవిపేరు దెలియకుండ 25 గలవు. మఱియునైదుపత్ర
ములలో నిట్లేమెవ్వరివో పేరుతెలియని సీసపద్యము లున్నవి.
ఇతఁడుసామాన్యుఁడే తిర్మలేంద్రుకోటి, విజయరఘునాథతొండమాన్విభుకిరీటి,
రాయబిరుదాంకరఘునాథరాణ్మృగాంక, యను మకుటములతోఁ గొన్నిప
ద్యము లున్నవి. కొన్నిమాలిక లున్నవి.

(33) దత్తాత్రేయశతకము. గ్రం. సం. 158.

ఈశతకము వేదాంతబోధకము. మూఁడవపద్యములో :—

క. పరమానందయతీంద్రుఁడఁ, బరమవివేకానుబంధభాగ్యోన్నతిచే
తరచించెదఁ గృతిఁ గైకొను, తరుజతికరుణావిధేయ దత్తాత్రేయా.

అని కవిపేరు పరమానందయతీంద్రుఁ డని తెల్పఁబడెను. శతకములో
మొదటినుండి 47 పద్యములు మాత్రమే కలవు. కొన్నిపద్యములు.—

1. శ్రీవిలసిత వరసంయమి, సేవితపాదారవింద చింతితఫలదా
కావుము నను నెల్లప్పుడు, దావరముగ గుణవిధేయ దత్తాత్రేయా.

2. శరణాగతవత్సల మీా, చరణాంబుజములకుఁ బద్యశతకం బిపుడే
కరశుద్ధి విన్నవించెద, ధరలోఁ గగుణావిధేయ దత్తాత్రేయా.
3. ఎఱిఁగించుకొన్న దెఱుఁగదు, యెఱిఁగెడు నెఱుఁగించుకొదవె యెప్పటికిని నీ
యెఱుకకలవాఁడె ముక్తుఁడు, ధరలోపల గుణవిధేయ దత్తాత్రేయా.
8. తగులెందు తమకులేకే, తగిలితి మని భ్రమసి కర్మతతిచే జీవుల్
మగుడ జనించుచు మాయం, దగిలిరయో మోసమాయె దత్తాత్రేయా.
9. పుట్టక మునుపును దానే, పుట్టిన పిమ్మటను దానె పాలిసిన వెనుకన్
గట్టిగఁ దానే నిజమున, దట్టంబగు మాయ పోయె దత్తాత్రేయా.
47. గురుశిష్యులనఁగ నిద్దఱి, గుఱుతులు చెడ్డపుడె ముక్తికుదురై నిలుచున్
గురుశిష్యభావ మెఱుఁగను, దరిమే సన్మానిగేయ దత్తాత్రేయా.

దత్తాత్రేయశతకములోని దని—

క. ఎంతదయో దాసులపైఁ, బంతంబున మకరి పట్టి బాధింపఁగ శ్రీ
కాంతుండు చక్రమంపెను, దంతావళరాజుఁ గాయ దత్తాత్రేయా.

అనుపద్యమును బల్లెటూరుబడులలో నొరవడికుదుర్చుటకై వ్రాయింతురు. పైశతకములో నిట్టిపద్యమునకుఁ దావుండునా? వేఱొకదత్తాత్రేయశతకములోనిదా:

42. కర్మము జన్మము కొఱకే, కర్మత్యాగంబు ముక్తి కైకొనుకొఱకే
మర్మ మిది తెలియ జనులకు, ధర్మమయా గుణవిధేయ దత్తాత్రేయా.
44. హంసగతివలన నజ్ఞుఁడు, సంసారై మగుడఁజచ్చి జనియించు నయా
హంసగతినిలువఁ బ్రాజ్ఞో, త్తంసుండయ మానిగేయ దత్తాత్రేయా.

శతకముపూర్తిగాలేదు. ఈపుస్తకమునందుఁ గాంతాలలామశతకము, భాస్కరశతకము, ఆంజనేయదండకమును బలువితము లగుశృంగారాదిపద్యములును గలవు.

క. నలుగురు నినుఁ బలుమాఱుదు, గెలుతువు సుగుణోక్తి దీప్తికృత్యాకృతులన్
నలుగురు నినుఁబలుమాఱురు, బళిబళియనఁ గచ్చిరంగ భాగ్యతరంగా.
క. చక్రివి దయచే సౌదార్యక్రమమునఁ గర్ణుఁడౌ పరాక్రమవక్రో
పక్రమణక్రమపరభీ, మక్రోధారాయతొండమూన్ రఘునాథా.
క. నేఁటిదొఁ కెల్ల నీకును, సాటియ యావిద్ధయుద్ధజాంఘాలికసం
ఘాటనిరాఘాటశర, ద్ఘోటకరాట్ప్రతతి రాజగోపాలపతీ.

క. వెఱవను పోరా నాతో, సరసాలా యాకలీక జాణతనాలా
పొరుగింటిదాని కైతే, వరహాలా రామకృష్ణ వసుధాపాలా.

సీ. చౌకట్లు పోగులు సరిపణల్ తాళీలు గదలంగఁ దేజి నెక్కంగవచ్చు
ఉద్దావరంగులు నిద్దంపు కేడెముల్ వెలయంగ వీథిలో వెడలవచ్చు
పండుగ వేఁటలు పందెముల్ వేసుక చేకొద్ది తుంటలు సేయవచ్చు
వెలయాండ్ర కేళికల్ వేడుకల్ చూచుచుఁ గోరమీసము దిద్దికొనఁగవచ్చు
గాక యందుల కేమి సంగ్రామభూమిఁ, గక్కసపుబిరుమవ్రీలఁ ద్రొక్కుటరుదు
కోటికులవర్యరణనిరాఘాటధైర్య, రాయబిరుదాంక రఘునాథరాణ్మృగాంక.

సీ. చలువచీరలుగట్టి కలుగుసొమ్ములు వెట్టి నిలువుటద్దంబున నీడగాంతుఁ
బరిమళంబులుగూర్చి భాగాలపొడిచేర్చి నిగ్గైనతట్టలు నిండనింతు
రక్తిగాఁ గనిపింప రాగము ల్వినిపింప మేలైనవీణలు మేళవింతుఁ
దొడిమ పోవఁగ గిల్లి విడిపూలు వెదచల్లి యనువుగాఁ బానుపు నలవరింతు
నీవు వత్తు వటంచును భావముననుఁ, అవుర భాగాయెఁ గానీయ దతివమాయ
గూడ నీతోడ తోరణాగాళికూడ, కామినీమోహనాంగ గోకర్ణలింగ.

ఈగోకర్ణలింగ యనుమకుటము గలశృంగారపద్యములు పెక్కులున్నవి.

సీ. ఇది మనోహరకాంతి కింపైనబింబంబు బింబంబుగా దది బెడఁగుకెంపు
కెంపుగా దది కంటి కింపైనమంకెన మంకెన గా దది మంచిచిగురు
చిగురుగా దది మంచి జిగిహెచ్చు పగడంబు పగడంబు గా దది పానకంబు
పానకం బదిగాదు పలుచని చెఱకుపాల్ చెఱకుపా లవిగావు కులుచతేనె
కులుచ తేనియ గాదది కుసుమరసము, కుసుమరసమునుగాదదిగొనబుజున్ను
జున్ను గాదది సవిగల్గు సుధల దీవి, సుధల దీవియుఁ గాదది సుదతిమోవి.

సీ. గోత్రామరేంద్రుల కొంగుబంగారుగా ధనములు వెసనిచ్చు దానకర్ణ
కవులదారిద్ర్యాంధకారంబు లణఁగింప తరుణార్కనీభువి (?) దానకర్ణ
నిరుపేదలను గన్న నిమిషమాత్రంబున దయను గటాక్షించు దానకర్ణ
పాత్రులంచని విన్న మాత్రాన నేవారి దైన్యము ల్మాన్చిన దానకర్ణ
నీసమానుల మహిలోన నేనుగాన, ఘనముగానొక భూమహధన మొసంగి
ననుగరుణఁ జూడు మిప్పుడు నయసకలస, నాథ రాజావిజయరఘునాథరాయ
తొండమాన్ బహదరు ధరామండలేంద్ర.

పాపమీయర్థి యెవ్వరో, అడిగిన ట్లిచ్చినాఁడో లేదో.

(34) రామాయణవచనము. గ్రం. సం. 168.

శ్యామరాయకవి రచించిన వచనకావ్యము, ఆరణ్యకాండములోని 75 సర్గలకుఁ దెరుఁగు. కవింగూర్చి—

"...సాహిత్యవిద్యాగోష్ఠిప్రసంగంబున నాశ్వలాయనసూత్రుఁడును వాసిష్ఠగోత్రసంభవుండును కృష్ణయామాత్యపుత్రుఁడును షడ్దర్శనీపారంగతుఁడును లక్ష్మీపతినామధేయాగ్రజు ననుజుండును సంస్కృతాంధ్రభాషాకవితానిర్వాహక సకలవిద్యాపారంగతుండును అసహాయ శ్యామరాయవిద్వత్కవి యగు నన్నుం బిలిపించి చతుశ్శాస్త్రపండితుఁడవు కవికులతిలకుఁడవు....కళావల్లభుఁడ వని కొనియాడి కర్పూరతాంబూలం బొసంగి" కృతిపతి యైనసుబ్బరాయసెట్టి పలికి నట్లున్నది. కావున కవివిషయము తెలిసినది. సుబ్బరాయసెట్టి యెవ్వరు ?

"శ్రీకాంతిమతీశాలివాటీశ్వరకరుణాకటాక్ష ప్రశమితసకలాంతరాయుండును సేతుహిమాచలమధ్యవర్తి విద్వత్కవినికరసంస్తూయమానుండును దక్షిణకాశీతటతామ్రపర్ణీతీరస్థిత నిరంతరసత్రాన్నదానసమ్మోదమాన భూసురాశీర్వాదసంప్రాప్త సమేధమానోత్తుంగశతాంగమాతంగ తురంగపదాతిసంగతసవరత్నవిరాజితమందిరుండును చతురుదధిముద్రితవిశ్వవిశ్వంభరావలయపరిపాలన రాజాధిరాజసన్మానితుండును సకలగుణగణాలంకృతుండును వాసవకన్యకావరప్రసాదశాశ్వతైశ్వర్యవిలాసుఁడును వైశ్యకులరత్నరత్నాకరుఁడు పరిసెట్లగోత్రసంభవుండును తుమ్మలపాటి మన్నారుసెట్టిపౌత్రుండును మణప్పార వేంకటాద్రిసెట్టిపుత్రుండును నిజసుకృతవిశదీకృతమహనీయ పాతివ్రత్యాదిగుణకదంబ యగుకృష్ణమాంబావధూగర్భశుక్తిముక్తాఫలుండును......గురుమూర్తి సహోదరుండును...... శ్రీవిజయరంగచొక్కనాథమహీవరకరుణాకటాక్షవీక్షణపాత్రుండును వణిగగ్రణి యగు సుబ్బరాయవైశ్యధౌరేయుండు"

ఈశ్యామరాయకవి విజయరంగచొక్కనాథునికాలములోనివాఁడైయుండియు సుబ్బరాయసెట్టితో- "......శ్రీమద్రామాయణంబు వచనకావ్యంబుగాఁ జేయు మని పలికితివి నీవు కృతార్థుఁడ వైతివి. తొల్లి వాల్మీకీయ రామాయణ మహాకావ్యంబు భాస్కరకవి పద్యకావ్యంబుగా రచనచేయుంచె రంగనాథకవి ద్విపదకావ్యంబు చేసె నితరులెవ్వరును వచనకావ్యంబుగా రచనచేయనిది నీవు నేను జేసినపుణ్యంబుగా నీపేర నంకితంబుగా రచనచేసెద నని"

(కవిపలికి)...నవరసాలంకారంబుగా చాతుర్వర్ణాశ్రమజనంబులు పఠియింప యోగ్యంబుగా శ్రీమద్రామాయణంబు...చేయంబూనినాఁడు. దీనింబట్టి యిప్పుడు మనకుఁ గనఁబడు వచనకావ్యము లగురామాయణము లీరామాయణము నకుఁ దరువాతివా ?

ఈసంపుటములో నారణ్యకాండ మొక్కటియే యున్నను, బాలకాండము మొదట నుండఁదగిన యాపీఠికకృత్యాదిపద్యములు నిక్కడఁజేర్చుట మనకీయొక్కకాండమే కాక యన్నికాండములును దెనిఁగింపబడినవని స్పష్టపఱుచుటకుఁబనికివచ్చినవి. కృత్యాదిపద్యపములు వ్రాసిన ౧౨ పత్రములలోనివ్రాత యొక్కనిది తక్కినకథాభాగమువ్రాత వేఱొక్కనిది. ప్రతిసర్గమునకును "ఇది శ్రీమదారణ్యకాండంబునందు అసహాయశ్యామరాయవిరచితం బగువచనకావ్యంబునందు పదాఱునొకటవసర్గార్థము" అనియిట్లుగలదు. ఆరణ్యకాండము సర్వమును డెబ్బదియైదుసర్గలున్నది. సప్తసంఖ్యను దెనుఁగులో "ఏడు" అనిన రోదనసంఖ్యయని పేరుపెట్టి ఛాందసముగా ఆఱునొక్కటియనుట కలదు. అట్లే యిక్కవియుఁ బదాఱునొక్కటి యనిచెప్పినాఁడు. ఆయాసర్గముల ప్రారంభమునను —

క. జాయాహరణానంతర, కాయజసంతాపజాత ఘనతరచింతా
భూయోన్వేషణలక్ష్మణ, ధీయుతవచనాభిరామ తేజోరామా. ౨౩ సర్గము.

క. రాక్షసకృపాణవిదళిత, పక్షద్వయపాదజానుపార్శ్వకరోటీ
కుక్షివిలోచనచంచూ, పక్షీక్షణమోక్షదాన భాగ్యనిదానా. ౬౭ సర్గము.

క. భీకరకబంధబాధన, సాకల్యభుజప్రసార సంగ్రహవార్తా
శోకనలక్ష్మణరాజ, ద్రాకాశశికీర్తిజాల రామనృపాలా. ౭౦ సర్గము.

ఇట్లాయాతావుల కథాసూచనము విషయసూచికవలెఁ బద్యములు చేర్చినాఁడు. మొదట శ్యామరాయకవి పద్యకవిత్వముం గొంత చూపి తర్వాత వచనరచనఁ గనఁబఱుతము.

క. శ్రీతులసీ దామోజ్జ్వల, వాతాత్మజ సేవితాంఘ్రివనరుహయుగళా
కాతర నతజనకైరవ, శీతలగుణసాంద్రసోమ శ్రీరఘురామా.

సీ. ఎవ్వని మదినెంచ నిందిరాదేవియు మందిరంబుననుండి మహిమ లొసఁగు
నెవ్వని నుతియింప నీప్సితకవనంబు నిచ్చిశారదయు సన్నిధియొనర్చు
నెవ్వని బింబంబు నీక్షింప నింద్రియగ్రామంబు లన్నియుఁ గదలకుండు

నెవ్వాని నామంబు నెన్నుచో జనులకు బహుపుత్రలాభంబుపరఁగు చుండు
అతఁడు శ్రీరాముఁ డఖిలసన్నుతచరిత్రుఁ, డాశ్రితవనవసంతుఁడునబ్జజాది
వినమదమరముకుటతటవివిధరత్న, కాంతికలితపదయుగుండు కాంతినొసగు.

సీ. ఎవ్వనిప్రాయంబునవ్వంపుఁదోఁటకు దీర్ణాంగ తాటక దృష్టియెముక
యెవ్వనికరకరి కిక్షుఖండముగదా చండీశుకోదండదండవరము
ఎవ్వని బాణాగ్ని కింధనమ్ములుగదా యతికాయకుంభకర్ణాసురతతి
యెవ్వనివిశిఖధారేందీవరాక్షికిఁ బంక్తికంఠుఁ తలల్ బంతులాట
అతఁడు శ్రీరాము...

శా. శ్రీమత్కోసలరాజు ప్రేమ నిజలక్ష్మీకాంతికై చేయఁగాఁ
గామార్థంబులు ధర్మమోక్షము లిలంగాంక్షింపఁ దానీయఁగా
సీమాతీత దయావిశేషనుఁడై చేదోయిపద్మంబుచే
ధామశ్రీసర్మ సుబ్బరాయకృతినేతం బ్రోచి శ్రీలీవుతన్.

క. శ్రీవేంకటాద్రినేతయు, భావంబునఁ దన్నుఁ దలఁచుభక్తుండగు నా
ధీవరు సుబ్బారాయని, కావిశ్రుత...కీర్తికాంతులనొసఁగున్.

మ. శరమావిష్ణువు బ్రహ్మసారథియు నశ్వంబు ల్హో వేదముల్
పరఁగన్ ధారుణి తేరు సూర్యశశులుం బండ్లొప్పధానుష్కుఁడా
పురముల్ గూల్చినజోదు నాసుకృతికిన్ బొందొప్ప శ్రీలాదిగా
సిరి మాణిక్య మహాధనాఢ్యజయలక్ష్మిప్రాప్తిగాఁ జేయుతన్.

ఇట్లేవో మనశ్యామరాయకవి పద్యములు వ్రాసికొనుచుండఁగా—

సీ. తీఁగెచెంగటనున్న తిలకవృక్షము మాడ్కి బలువిల్లుమూఁపునఁబరఁగువాఁడు
కాఁడత్రోఁజెలువొందుకమలంబు తెఱఁగునఁగరమునఁజెన్నొందుశరమువాఁడు
కరుణారసమ్ములు కనుఁగవ నలరంగఁ జిఱునవ్వుమోమునఁ జెలఁగువాఁడు
పాదసేవకుఁ జేరుపవనజుకరమునఁ గైదండగైకొని కదలువాఁడు
రాజపుత్రుండొకఁడు వత్సరాయనెడి, పలుకులను నను బిలువఁగ భక్తితోడ
వేకువను గలలోనను వెఱఁగునంది, యేమిపనియనంగను నిట్లనియె.

"నాదుచరిత్రము నీవును, నాదరమునఁ దెనుఁగుఁజేయు" మని చెప్పి
నాఁడఁట. వచనశైలిఁ జిత్తగింపుఁడు:—ఏకాదశసర్గప్రారంభము:—

క. సీతాసాంత్వనపూర్వక, ఘాతుకరక్షస్సమూహ ఖండనవార్తా
జాతాదరవన్యాచర, చేతోనయనాభిరామ శ్రీరఘురామా.

దండకారణ్యంబునఁ జనునపు డగ్రభాగంబున శ్రీరామదేవుండును మధ్యంబునందు సుమధ్యమయగు సీతాకాంతయుఁ బిఱుంది దెస బాణబాణాసనంబులను పాణిచేరాణించు లక్ష్మణుం డనువర్తించి చనునపుడు నారాజకుమారు లిరువురు నానావిధములగు పర్వతములమధ్య ప్రదేశములు వనములుమితవింతలై రమణీయములగు నదులుంజూచుచు సీతాకాంతామణితోడంగూడి చనునపుడు ఆనదీమధ్యభాగమునఁ జెలువలరు నిసుకదిబ్బలందు సంచరించు బెగ్గురులు జక్కవలు జలంబునందు జనితము లగునీరుకోళ్ళు నీరుకాకులతోడంగూడి తామరలచేఁ దనరారు కొలంకులు గుంపుగుంపులుగ సంచరించు జింకలను మదగర్వితములై గొప్పలగు కొమ్ములచేఁ గొమరొప్పు వృషభములను గారెనుపోతులను వనవరాహములను జెట్లను విఱిచి పడవైచు వేతండములను నవలోకించుచు దూరంబగు మార్గంబును గడచి సూర్యుం డస్తగతుండగు సమయంబున సహస్రదళములచే సంకులంబగుపద్మములు నూఱురేకులచేఁ బొలుపలరు పుష్కరంబుల నెడి తామరసహితంబును సమీపదేశంబున సంచరించు సామజములచే సమలంకృతంబును......యోజనదూరవిశాలం బగుతటాకంబు నవలోకించి ప్రసన్నజలంబును రమణీయంబునగు నాతటాకంబునందు గీతంబు వాదిత్రంబు నాట్యవీణయు మర్దలంబు పిల్లగ్రోవి కంచుతాళం బనెడి చతుర్విధవాద్యములనాదంబు వినంబడునపుడు నచట నొక్కనిం గానక......ఇట్లు 151 పత్రములలో నారణ్యకాండము గలదు.

పరిషత్తులో—బాలాయోధ్యాకాండములును గలవు.

(35) శ్రీబాలగోపాల శతకము. గ్రం. సం. 901.

ఈశతకము పుసులూరి యమునాపతికిని బాపమాంబకును సుతుండును, శ్రీమదాత్రేయగోత్రుఁడు నగు సోమనామాత్యునిచే రచియింపఁబడినది. అష్టోత్తరశతసీసములతో నలరారుచు గ్రంథము సమగ్రముగ నున్నను, గ్రంథకర్తనివాస మెచటను దెల్పఁబడి యుండలేదు. గ్రంథకర్త కాలమును సూచించు నితరకవులుగాని రాజులుగాని వర్ణింపఁబడియుండలేదు. గ్రంథాంతమున 'శోభకృతు నామసంవత్సర మార్గశిరబహుళ ౬ జయవారం పోడూరి సూరప్పగారి మనుమలు రామప్పగారికుమారుడు మృత్యుంజయుడు అనువాడు నిత్యపఠనార్థమై వ్రాశ్ని మాతృక చూచి కస్తూరి సోమరాజుగారి కుమారుడు వెంకన్న.........వ్రాసెను'...ఇం దుదహరింపఁబడిన శోభకృతు

సంవత్సరము క్రీ. శ 1743 నకు సరిపోవుటచే శతకము 18 శతాబ్దమున రచియింపఁబడియుండవచ్చు నని తోఁచుచున్నది. శతకమందలి శైలి సరళముగ నున్నను గ్రంథపాతలేఖకప్రమాదములతోఁ గొన్నిస్థలముల ననన్వయముగ నున్నది. నీలశైలపాలుఁ డగు గోపాలబాలు నుద్దేశింపఁబడుటచే గ్రంథ మా ప్రాంతమున రచియింపఁబడిన దేమో యనుసందేహ మొదవుచున్నది, గాని, యిదమిత్థ మని నిర్ణయింప వలనులేదు. శైలిని దెల్పుటకై యీక్రింది పద్యముల నుదాహరించుచున్నాము.

సీ. శ్రీశుభద్రాకృతిఁ జెలఁగొంద లచ్చికిఁ బ్రాణేశుఁడయ్యె నేపరమపురుషుఁ
డవని నీలాచలం బనెడివైకుంఠంబుఁ బాలింపుచుండు నేభద్రమూర్తి
పతితపావనయశఃపాండురచంద్రికా ధవళితాజాండుఁ డేదైవరాయఁ
డపవర్గదానదీక్షాంకమై భువనైకపావనం బెవ్వని పాదయుగము
అట్టినీపాదములకు సాష్టాంగవినతిఁ, జేసి కీర్తింతుఁ బురుషార్థసిద్ధికొఱకు
బాలగోపాల కరుణాలవాల నీల, శైలపాలవనీపాల చారులీల-

సీ. గోపికాకుచకుంభ కుంకుమారుణహార కలితవిశాలవక్షంబువాని
రాసకేళికళావిలాసకుతూహలారంభసంరంభవిభ్రమమువాని
గోపికాగీతానుకూలనృత్యక్రమ ప్రకటహస్తావలేపములవాని
కటకనూపురఝుణత్కారానుగత కరతాళప్రబంధకృత్యములవాని
గొమరుగోపాలకాకృతిగొన్నవాని, నిన్నుఁ భజియింతు నామనోనిలయమందు.

సీ. ఇందీవరశ్యామ సుందరాంగముతోడ శిఖిపింఛభూషిత శిరముతోడ
మాణిక్యమణివర వేణునాదముతోడ రమణీయపీతాంబరంబుతోడ
గోపాలకాకృతి కొమరుప్రాయముతోడ వరహసితాస్యపద్మంబుతోడ
వనమాలికాగంధ వక్షఃస్థలముతోడ నవరత్నమయభూషణములతోడఁ
గన్నుదోయికిఁబండువుగాఁగమదికిఁ, బ్రేమపుట్టఁగ సాక్షాత్కరింపవయ్య......

సీ. నిరుపమాగమసార నిగమాంతసంచార నవనీతచోరవందనము నీకు
సకలామరాధ్యక్ష సన్నుతఫాలాక్ష తామరసాక్ష వందనము నీకుఁ
బతితపావననామ భద్రగుణస్తోమ దైవలలామవందనము నీకు
సకలలోకత్రాణ సత్కృపాపారీణ దానధురీణవందనము నీకు
అనుచు నానంద భావమగ్నాంతరంగ, జనితరతినీకు నిత్యవందన మొనర్తు...

(36) అకారాదిదేశీయతెనుఁగునిఘంటువు. గ్రం. సం 16.

ఇది ౧౦ పత్రముల యకారాదినిఘంటువు. దేశీయపదము లన్నియు నేర్చి వ్రాయఁబడినది. కవి యెవ్వరో—ముందు వెనుక నేమియు వ్రాయఁబడి యుండలేదు. గణపవరపు వేంకటకవి లక్షణశిరోమణిలోని భాగము కావచ్చును.

అరిది—అబ్బురము
అట్టిద—అటువంటిదె
అసలు—బురుద
అయిద—వెంబడి
అలకి—కలశము
అల్లోనేరేళ్ళు—నమస్కారము
అకరులు—కేసరములు
అత్తము—గుంపు
అల్లారుముద్దుగ—జనసమ్మతిగా
ఉత్తరించి—ఖండించి
కివ్వెను—మడిసెను
కిట్టి—దగ్గరి
చుచ్చులు—మేఁకలు
చెయిద—చెలికాఁడు
పవాడము—బిరుదు
సురెకూళుండు—చండాలుండు
హాస—క్రొత్త

(37) చంద్రాననాదండకము. గ్రం. సం. 61.

పుదుక్కోటరా జగు రాజాబహద్దరుమహీనాథుని పౌత్త్రుఁడును, రఘుస్వామిధాత్రీంద్రపుత్త్రుఁడును నగు శ్రీరామచంద్రక్షితీశునిపైఁ దదాస్థానకవి—నుదురుపాటి వేంకనార్యుని మనుమనిచే రచియింపఁబడినది. కాగితపుఁబ్రతి. వ్రాంత పరిశుభ్రముగా నున్నది. పుస్తకము మంచిస్థితిలోనున్నది. అక్కడక్కడఁ గొంత మచ్చుచూపఁబడును.

"శ్రీమద్బృహన్నాయికాన్తగర్భోక్తి విస్మేరవక్త్రారవిందస్ఫురద్దివ్యతేజస్సదాధ్యానసక్తాత్మభావుండు, భావోద్భవామిత్రఫాలాక్షకీలాసమానప్రతాపార్కబిభ్యద్విషద్ఘూకవారుండు, వారాశిగాంభీర్యగాఢత్వదానప్రవీణాతిగంభీరతాశాలి, శాలీనవిద్విడ్ధరాపాలమౌళిస్ఫురన్మంజురత్నచ్ఛవిచ్ఛన్నచక్రాదిరేఖోల్లసత్పాదపద్ముండు—జంభారివంశాబ్ధిసోముండు సర్వజ్ఞతాతుల్యసోముండు రాజాబహద్దర్ మహీనాథపౌత్త్రుండు సల్లక్షణోపేతగాత్త్రుండు శ్రీమద్రఘుస్వామిధాత్రీంద్రపుత్త్రుండు......హయాధిరాజన్యసంస్థాయమానోల్లసద్యక్షలెన్సీనమాఖ్యాభిరాముండు శ్రీమద్బృహన్నాయికాపాదసేవాప్తకాముండు శ్రీరామచంద్రక్షితీంద్రుండు తానొక్కనాఁటన్ హజారమ్మునన్...భూపాలరాగాదులన్నాగధుల్ వేకువన్ గానముల్ సేయ...స్వీయేతరంబైన భూపాలశబ్దాక్షమిత్వంబు

వంగ కృష్ణునింబూని నోనాఁగ విప్పొచునొప్పారు నేత్రారవిందంబులం గెంపుడా ల్భ్రాంతచెన్నొందు (నిద్రలేచి యద్దముఁజూచికొని) సాముకూటమ్మునుంజేరి యం దుండు నబ్బాలగోపాలమూర్తిం గనంజేయు దండంబులోనాఁగ దండంబులుం దీసి...గోవర్ధనాద్రిం గయి,బూను శ్రీవేణుగోపాలు చందంబునన్నిల్చి గోతా ము చేనెత్తి (స్నానముచేసివచ్చి సభలోఁగూర్చుండి తర్వాత పురముంజూడ వెలువడిన) కోటీశులంగాంచి యీమేటిసాటెవ్వరున్ లేమిచేఁ గోటిభూపాలవ ర్యుం డితండంచు లోకు లున్నతింపంగ (చూచి చంద్రానన విరాళిగొని) "హా హా తాస్త్రీహ కోహేతు రాసీ దిదం కిం వరాకే కిలాహా" మ్మటం చున్నవిన్నేష ణోద్యుక్తహస్తాబ్జయై (యిత్యాదిదండకవర్ణనలు) ఉద్దండవిద్వత్కవిత్వాంకనుండైన శ్రీవేంకనాభిఖ్య ధీరేంద్రపౌత్రుండు శ్రీసూత్రుభూతాఖ్య ధీమంతు పుత్రుండు శ్రీమచ్చిదాకారవిద్వత్కవీంద్రుండు కైచేయుచంద్రాననాదండకము.

(38) రుక్మాంగదచరిత్రము. గ్రం. సం. 84.

ప్రౌఢకవి మల్లనకవిచే రచియింపఁబడి దక్షవాటికా భీమేశ్వరున కంకిత ముచేయఁబడిన యైదాశ్వాసముల కావ్యము. ప్రారంభము-

చ. వశుఁడగ మొక్కెదన్ లవణవార్ధివిజృంభణతానివర్తికిన్
దశదిగధీశమౌళిమణిదర్పణమండితదివ్యకీర్తికిన్
దశశతభానుమూర్తికి సుధాన్పృహుభాషికి సాధుపోషికిన్
దశరథరాజుపట్టికిని దైత్యసతిం బొరిగొన్న జెట్టికిన్.

ఉ. రాముఁడె యిష్టదైవతము రాఘవుఁడే జనకుండు జానకీ
స్వామియె బాంధవుండు రఘువల్లభుఁడే సఖుఁ డంశుమత్కుల
గ్రామణియే సహోదరుఁడు రావణవైరియె సద్గురుండు గా
నామదిలోఁ దలంతు రఘునాథనృపాలవతంస మెంతయున్.

ఉ. శ్రీమయపత్రముల్ జడలు చెల్వగునభ్రతరంగిణీకణ
స్తోమము పుష్పముల్ ఫలము సోముఁడు నై పొలుపొంది పార్వతీ
కోమలదేహవల్లిఁ బెనఁగొన్న సముంచితదక్షవాటికా
భీమయదేవకల్పక మభీష్టఫలంబులు మాకునీవుతన్.

ఈపద్యమునకుఁ బైనున్న రెండుపద్యములును జాటువులు గావచ్చును.

చ. కలశపయోధికన్య మృదుగండమరీచుల నీడఁజూచుచుం
దిలకముఁ గమ్మకస్తురి ప్రదీప్తముగాఁ గొనగోర దిద్దును

త్పలదళమేచకద్యుతికదంబశరీరుఁడు మాధవుండు ని
చ్చలుఁ గరుణాకటాక్షములు...నితో మముఁ బ్రోవుఁగావుతన్.

ఇత్యాది కృత్యాది రచియించినపిమ్మట—

క. మనమున సేవింపుదు మ, జ్జనకుని శ్రీవత్సగోత్రసాగరచంద్రున్
ఘనుఁబోతనమంత్రీశ్వరు, ననయంబును భక్తి నమ్మలాంబాప్రియునిన్.

సీ ...యాదిశంభుస్వరూపమైయధికమహిమ, నున్నతికినెక్కు శివదేవయోగిపౌత్రు
శక్తినాథుని మద్గురుస్వామిఁ దలఁచి—

అనిచెప్పఁబడినపద్యభాగములంబట్టి యిక్కవితండ్రి శ్రీవత్సగోత్రుఁడైన పోతనమంత్రి యనియుఁ దల్లి యమ్మలాంబయనియు, గురువు శక్తినాథుఁడనియు దెలియవచ్చుచున్నది.

గద్యము:—ఇది శ్రీమత్పార్వతీశ్వరవరప్రసాదలబ్ధకవితాపవిత్ర పోతయామాత్యపుత్ర సకలజనానందచర్య ప్రౌఢకవి మల్లనార్యప్రణీతంబైన రుక్మాంగద...

ఇంతకంటెఁ గవివంశాదికము దీనిలోఁ దెలియదు.

ఈమల్లనకవి యీగ్రంథమును దక్షవాటి భీమేశ్వరున కంకితమిచ్చెను. ఈదక్షవాటి తగవులకుదూరమైన గోదావరిజిల్లాలోని ద్రాక్షారామమే యని "సప్తగోదావరీజలనవీనవిహారహారవిస్ఫురితమహాభుజంగజంగమస్థావర... దక్షపురిభీమలింగకాంతాశుభాంగ" యనుపద్యముం బట్టి యెఱుఁగనవచ్చును. ఈతనినివాసముకూడ నచ్చటికి సమీపమై యుండవచ్చును.

సీ. హాటకభీమేశుఁ డచ్యుతశర్మ యజ్ఞావధాని యజ్ఞేశుఁ డాధానయాజి
చల్లవల్లభుఁ డార్గచర్చు గోవిందుండు భట్టసోమాధ్వరుఁడు దర్భలముకుందుఁ
డీశ్వరభట్లు బ్రహ్మేంద్రసోమజ్జలు క్రమదాడిమాధవుఁడు జంద్యాలపెద్ద
భాస్కరోజ్జలు చక్రపాణి చతుర్వేది శ్రీరంగకృష్ణుఁడు మల్లుసోమయాజి
వామదేవుండు నరసింహవాజపేయ, వాదికేసర్లు వద్దిదామోదరుండు
పట్టవర్ధనమయలన్న పల్లమాచి, యాదియగు విప్రులేతెంచి రచటికపుడు.

అనుపద్యములోని వైదికబ్రాహ్మణశాఖవారు చాలమంది ద్రాక్షారామసమీపగ్రామములలో నిప్పుడునున్నారు.

హరివాసరవ్రతవిశేషముం దెలుపు రుక్మాంగదనృపాలుని చరిత్రమిందు వర్ణింపఁబడినది. దీని కేకాదశీమాహాత్మ్యమను రెండవపేరు వాడుకలోనున్నది.

కవిపురాతనుఁడు గా వినుచున్నాము. కావున "దశమినాఁ డేకభుక్తముచేసి మఱునాఁ డహోరాత్రముల భక్తి నుపవసించి" ఇత్యాదిప్రథమాశ్వాసములోని సీసపద్యము-ఆముక్తమాల్యదలోని యిట్టిపద్యమునకు మాతృకమై యుండును ఈప్రతి చాల శిథిలమైనది 121 సంఖ్యగల ప్రతి శుభ్రముగానున్నది. వ్రాఁతతప్పు లిందు నందును మెండుగాఁగలవు. కొన్నిపద్యములు-

మ. ధరఁ బాలించెఁ బురూరవుస్సగరునిం ద్రైశంకునిన్ హైహయుం
బురుకుత్సున్నలు నంబరీషు శశిబిందున్ రంతి నంగు న్మరు
త్తు రఘూత్తంసు భగీరథుం బృథు సుహోత్రు న్నాహుషున్ భార్గవున్
భరతక్ష్మాధిపునిన్ దిలీపు గయు మాంధాతృన్ శిబిం బోలుచున్.

ఉ. స్నానమొనర్చి ధౌతపరిధానయుగుల్ ధరియించి యంటఁగాఁ
గానిమనుష్యులం గనక కల్లలు వల్కక యుగ్రకృత్యము
ల్మాని వినింద్యుఁడై నియతమానసుఁడై తములంబు దక్కి శ్రీ
జానిపురాణము ల్వినుట సంగతి శ్రీహరివాసరంబునన్.

రెండవప్రతిలో "స్నానమొనర్చి" యని కలదు.

శా. ఓకంజాప్తతనూజ నీమదకరాళోగ్రక్రియాసైరిభో
త్సేకగ్రీవ...ప్రకల్పితభయోద్రేకస్ఫురద్ఘంటికా
నీకానేకఘణాఘణత్ప్రియసర్నిద్రధ్వానుల్వీనులం
దాకర్ణింపఁడు పద్మనాభపదపద్మారాధకుం డెన్నఁడున్.

క. మానినులు నూర్వురుండఁగ, నను నేరీతి మేలుగా నేర్చెదవో
భూనాథజ రుపవచ్చునె, *గానుగునుదలాదికముఁబ్రగల్భముతోడన్.

ఉ కాయజు మేనమామ కళంకుని యాఁదలపువ్వు వాహినీ
నాయకుకూర్మిపట్టి నలినాత్మునిముద్దుమఱంది కౌముది
ప్రాయము దుంప యంబురుహబంధుని యుద్ది చకోరజీవనో
పాయము పాపధంబు శితభానుఁడు కానఁగవచ్చెఁ దూర్పునన్.

ఈప్రతి ఆనందనామసంవత్సర పుష్యబహుళ విదియా అంగారకవాసరమందున వెలికంటి రంగప్పయ కొమారుడు వెంకట్నారయణ వ్రాసినది. (దక్షిణదేశపుప్రతి) 121 ప్రతి సర్వధారినామసంవత్సర వయిశాఖ శు ౯ బు॥ వరకు తెలిదేవర సుందర్రాముడు రుక్మాంగదచరిత్రము వాడ్రేవు కృష్ణమ్మగారు

* గానుగునదలాబ్ధి కఁగ్రొఁగల్భముతోడన్ — అచ్చుప్రతి.

వ్రాసిన ప్రతిక్రమానను సదరుహీ చరిత్రలో...ఆశ్వాసము వ్రాసెను.

(39) కవికర్ణరసాయనము—గ్రం. సం. 134.

ఇది యాఱాశ్వాసముల ప్రౌఢకావ్యము. కవి తనపేరు-

క. గురువరభట్టపరాశర, చరణసరోరుహసముల్లసన్మానసుఁడన్
నరసింహనామధేయుఁడ, బరిచిత సత్కృతిరసానుభవహేతువునన్.

క. కవితాదిద్యుతి గలిగినఁ, గవికంఠవిభూషణముగఁ గైకొనవలయున్
గవివరనృసింహవిరచిత, కవికర్ణరసాయనాఖ్య కావ్యము దీనిన్.

అను పద్యములంబట్టియు, "ఇది శ్రీమద్భట్ట పరాశరదేశికేంద్ర చరణ సరసిజ శఠగోపసేవక నరసింహనామధేయప్రణీతంబైన కవికర్ణరసాయనం బను కావ్యంబునందు" అను నాశ్వాసాంత్యగద్యములంబట్టియు నరసింహకవియని తెలియవచ్చుచున్నది. ఇంతకంటె నీగ్రంథమందుఁ గవి తన్నుం గూర్చి యేమియుఁ జెప్పుకొనలేదు స్వప్నములోఁ గవి చెప్పఁగా మిగిలిన- తలిదండ్రులు, వారువారు చేసిన గ్రంథములు, నుద్యోగంబులు నింటిపేరులుం జెప్పి నిష్టదైవతములును వచ్చి చెప్పలేదు. ఈకవి చేసినరెండవగ్రంథమును గనఁబడదు. మఱి యీకవియింటిపేరు సంకుసాలవారని సుంకుసాలవారని సింగసాళ్ళవారని టంకసాలవారలని యనేకులు నిరాధారముగాఁ జెప్పుకొనుచున్నారేల. కులము తెలియదు గోత్రము తెలియదు. ఇట్టివాని యింటిపేరెట్లు తెలిసినదో.

క. నేరిచిన సుకవి కృతిచేఁ, బేరెఱఁగించుకొనిజగతిఁ బెంపగుటొప్పున్
నేరక కృతిఁజెప్పుట తన, నేరమి యపకీర్తి జగతి బిలుపుటగాదే.

అని కవి తనపేరు తెల్పుకొన్నాఁడు. ఆడంబరములేని పరమభక్తాగ్రేసరుఁడగునీకవి రచించినయీగ్రంథములోని కథ మాంధాతృచరిత్రము- శ్రీరంగనాథునికిఁ గృతిసమర్పణము చేసినాఁడు.

సీ. "ఆందోళికలయందు నంతరచరులైన సవికృతాకృతులఁ బిశాచజనులఁ
బరకరాలంబులై ప్రార్థింపఁ గనుఁగొనక వామెత్తకుండు జీవచ్ఛవముల
వాలవీజనములం గ్రాలుచు నీఁగకు నాఁడీని ఖరవర్తులాండసముల
వేత్రపరంపరావిల కంటకాకృతిఁ జేరంగరాని బర్బూరతరుల
........ప్రభుమరాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు." అనుపద్యమునందు నరపాలనింద కావించుట యొక్కటి విచారింపవలసియున్నది.

సీ. జగదేకపతియయ్యు సకలాభిగమ్యుండు సర్వశాసనుఁడయ్యు సదయహృదయుఁ

దభిమతప్రదుఁ డయ్యు నంజలిసాధ్యుండు పరిపూర్ణుఁడయ్యు నుబ్రాణిత కాముఁ డతిగతేంద్రియుఁడయ్యు ననిమేషదృగ్గ్రాహ్యుఁడని యోజ్యుఁడయ్యు భక్తానుయాయి సాక్షియయ్యు నతాపచారానభిజ్ఞుండు సముఁడయ్యు నార్తరక్షాపరుండు భద్రగుణనిధి మర్గుణప్రతిభటుండు, సముఁడునధికుండు లేని యుత్తమపురుషుఁడు వెదకిచూచిన శ్రీరంగవిభునివంటి, ప్రభువనత్యంతసులభుండుఁ బరుఁడుఁగలఁడె.

అనుపద్యమునకు వ్యతిరేకాభిప్రాయమునకై వ్రాసినపద్యమే కాని కేవలప్రభువుల నిందించుటకుఁ గాదనవలయును. ధనాపేక్ష లేదు. పరమదైవభక్తుఁడు, ఆత్మస్తుతివిముఖుఁడు నిట్లు చెప్పుట పరనిందకుఁ గానగునని తలంపఁ గూడదు. ఈపద్యమునుండియే కాఁబోలును, వింతకథలు పుట్టి యల్లసానిపెద్దనార్యునకుఁగూడ నపకీర్తిం దెచ్చుచున్నవి.

ఈక్రిందిపద్యములో సత్కవులసామర్థ్యముం దెల్పినాఁడు.

చ. మనమునఁ గొన్ననెవ్వగలు మాన్పి ఘటించుతు రకాండసన్మదా
బనఘకథాముఖంబున హితాహితబోధ మొనర్తు రింపుగాఁ
గనుఁగొనుకన్న నద్భుతముగా నెఱిఁగింతు రతీంద్రియార్థముల్
ఘనమతులెల్లవారికి నకారణబాంధువులు గారె సత్కవుల్.

ఈక్రిందిపద్యములోఁ దనకవిత్వసామర్థ్యము వెల్లడించినాఁడు.

గీ. యతి విటుఁడు గాకపోవునెట్లస్మదీయ, కావ్యశృంగారవైభవాకర్ణనమున
విటుఁడు యతిగాక పోరాదు వెసమదీయ, కావ్యవైరాగ్యవర్ణనాకర్ణనమున.

కృతి ప్రారంభపద్యములు.

మ. శ్రీరామావసుధాపయోధరములం జేదోయి రెంట న్ననుప్రారంభంబునఁ జిత్రభంగి మకరీపత్రాంకముల్ వ్రాసి ని
ర్వైరప్రేమల నిద్దఱుం దుసమసారస్యంబునం దేలునా
శ్రీరంగేశుఁడు మమ్ము నిర్మల శుచిశ్రీయుక్తులం జేయుతన్.

చ. పొలయలుకన్ జపంబునకుఁ బూని కనుంగవ లెల్ల మోడ్చియుం
దలఁచిన మంత్రవర్ణమయతం గనుపట్టిన వాణిఁ జూచి న
వ్వొలయఁ గవుంగిలించి సుసుఖోన్నతిఁ జెందెడు సర్వతోముఖుం
డెలమి దలిర్ప మత్కృతికి నీవుత విశ్వజనాభిముఖ్యమున్.

మ. ముకుటేంద్రద్యుతిజాలముల్ సతతమై ముంపం బ్రభాతం బెఱుం
గక శశ్వత్పరిరంభణావిరతసౌఖ్యస్నిగ్ధుఁడై జాయఁ బా

యక లీలాపరుఁడైన శంకరుఁడు నిత్యప్రీతి సంధించుతన్
సకలాహ్లాదముగా మదీయకృతికిన్ శబ్దార్థదాంపత్యమున్.

కథాభాగములోని రెండుపద్యములు.

శా. కస్తూరీతిలకంబులై హరిశిలాకల్పంబులై కజ్జల
ప్రస్తారక్రియలై నవాగరుమషీపంకానులేపంబులై
శస్తానీలపటావగుంఠనములై జన్మించె దిక్కామినా
విస్తోమంబులయందు నూతనతమోరేఖాంకురశ్రేణికల్.

ఉ. దారశిలాదిభావనల దైవముల న్నిరసించి తామసుల్
గోరుదు రింత చేరువ యొకో తను కాత్మవివేకపాకముల్
వారిధరంబుల న్విడిచి వచ్చినచాతకధూర్తు లంబుధిం
దారు గొనంగ శక్తులె సుధామధురోదకపానసౌఖ్యముల్.

(40) పద్మపురాణోత్తరఖండము- గ్రం. సం. 115.

అయ్యలమంత్రిపుత్త్రుఁడు మడికిసింగనార్యుఁడు రచించినది ఇది "గౌతమీ దక్షిణంబున...సబ్బినాటిరాష్ట్రంబున రామగిరిపట్టణంబు నిజరాజధానిగా... గల, నిరువెత్తుగండ గండగోపాలాది బిరుదాంచితుఁడగు గురుజాలముప్పభూపాలకుని మంత్రి యోబళామాత్యుని పుత్త్రుఁ డగువాణస కందనామాత్యున కంకితము చేయఁబడినది. తొమ్మిదియాశ్వాసములు నిండుగా నున్నవి. పదియవది పూర్తిగ లేదు. ఈకందామాత్యుఁడు సింగనకవీశ్వరునకు మిత్త్రమయినట్లు "నీ సహవాససౌఖ్యముల నెమ్మిఁ జరించుట జేసి దిక్కుల న్వ్యాసికి నెక్కి యిష్టజనవర్గముచేఁ బొగడొంది...ప్రస్తుతి కెక్కితి"నను కృతిపతి వాక్యములోఁ దేటపడుచున్నది.

"ధాత్రిఁ బద్మపురాణఖండత్రయమున, సర్వసారాంశమై పుణ్యజననమగుచు
మండితంబైన యుత్తరఖండ మీవు, తెనుఁగుగావింపు నాపేర ననఘచరిత.

గీ. బాదరాయణమునిముఖప్రభవ మైన,యిప్పురాణార్థ మిలఁ గొంద ఱెఱుఁగ నేర
కునికి నేఁటికినంధ్రభాషోక్తిఁ దెలియఁ, జెప్పి లోకోపకారంబు సేయవలయు.

వ. అట్లయిన నేను గృతకృత్యుండ నగుదు నీకును గీర్తిసుకృతంబులు సంభవించు—అని కవిని గందామాత్యుఁడు కోరినాఁడఁట.

చ. అమరిన మత్స్యకూర్మవిభవాదులు దీవులు వేదవాక్యసా
రము జలపూర మున్నతతరంగము లాగమశాస్త్రపద్ధతుల్

విమలయశోభిరామమగు విష్ణుచరిత్రము భోగితల్పమై
యమృతపయోధినాఁగఁ బఱపై చనుఁబద్మపురాణమిమ్ములన్

సీ. ధర్మబోధైశ్వర్యతతిమూలనికరంబు విమలాదిశక్తుల వెలయుకంద
మామ్నాయశాస్త్రంబు లనుపమశాఖలు బహుకథాసూక్తులుపల్లవమ్ము
లుపనిషద్వాక్యంబు లురుపుష్పసంఘంబు పొలుపారహరిభక్తిపుష్పరజము
వరయోగివైష్ణవవరులు భృంగంబులు పరమసౌఖ్యాసక్తి పరిమళంబు
బాదరాయణువాక్సుధాప్రౌఢిఁ బరఁగి, నిఖిలధర్మంబులకు నిల్వనీడ యగుచు
విష్ణురూపంబు దానయై వెలసిసౌఖ్య,రసికమై యొప్పుఁ బద్మపురాణతరువు.

వ. కలికాలజనితమహాదోషాతపసంతప్తాంతరంగులునుసంసారపథాశ్రాంతస్వాం
తులు నగు మనుష్యులీపుణ్యతరుశీతలచ్ఛాయ నాశ్రయించి-తాపత్రయం
బుఁ బాసి జరామరణభయబుభుక్షారహితులై యవ్యయానందంబు నొం
దుదురు. అని దీనిఫలశ్రుతియుందే యాంధ్రీకరణోద్యమమునకుఁ గారణము
గాఁ దెలిపినాఁడు. ప్రారంభపద్యములు.

శా. శ్రీరమ్యం బగుదుగ్ధవార్ధి నడుమన్ శేషాహితల్పంబుపై
నారూఢంబగు నిందిరా సహితుఁడై యానందలీలన్ గుణా
ధారుండై వరసంయమీంద్రులకు నాత్మజ్ఞానరూపంబుఁ దా
నై రంజిల్లెడు వేల్పు ప్రోచుఁ గృపఁ గంబామాత్యు నెల్లప్పుడున్.

చ. చెలువగు జూటరంధ్రములఁ జెచ్చెరఁ బిల్లలఁ బెట్టి యెప్పుడున్
వెలయు చకోరదంపతులు వెన్నెలమేఁగడలంచు ముక్కులం
జెలయుచుఁ గుప్పసంపుదారఁ జివ్వఁగ మేల్కని చూచు శేషుమై
యలకున గాంచినవ్వు శివుఁ డబ్బయకందని ధన్యుఁ జేయుతన్.

చ. తనకు నివాసమైన వెలిదమ్మిఁ జెలంగెడు చంచరీకని
స్వన మొగి విన్నవారలకు సామకృతాభ్యసనప్రవృత్తి శి
ష్యనినదమోయనంగఁ గడు నింపెసలారెడు వేల్పుపెద్ద శో
భనయుతుఁ జేయుఁగాతఁ బ్రతిభావిభు నాభళమంత్రికందనిన్.

ఇక్కవిగద్యము-ఇది శ్రీనరసింహవరప్రసాదలబ్ధ కవితావిలాస భారద్వాజగోత్ర
పవిత్ర అయ్యలామాత్యపుత్రసరసగుణధుర్య సింగనార్యప్రణీతంబగు...

ఈతఁడొనర్చిన వాసిష్ఠరామాయణము, ద్విపదభాగవతము నిటీవలివి
కావచ్చును. ఇందు వానిం దెల్పలేదు.

(41) రసమంజరి—గ్రంథ. సం 165.

గుడిపాటి కోదండకవి రచించినది. మూఁడుగుచ్ఛములు మాత్రము గలవు. నడుమనడుమం గొన్నిపత్రములు లేవు. ప్రతిగుచ్ఛమునను ప్రథమ కుసుమము ద్వితీయకుసుమము అష్టాదశపద్యదళంబుల తృతీయకుసుమము నని భాగము లున్నవి.

సీ. శ్రీకరనందవరీకాగ్రగణ్యుండు వహిమీఱు గుడిపాటివంశభవుఁడు
బిరుదుగా నవఘంటసురధాణి పేరంది మహితుఁడౌ వెంగళమంత్రిపౌత్రుఁ
డతులితుం డగురంగయామాత్యతనయుండు వీరమాంబానందవృద్ధికరుఁడు
సింగనవెంగళశ్రీనిధు లనుజులై భాసిల్లు కోదండపతి ఘనుండు
నరసకవితాచమత్కారసార్వభౌముఁ, డవని శ్రీరంగధామదయాశ్రితుండు
ఎలమిరసమంజరినిరచియించె ననందుఁ, బ్రథమగుచ్ఛంబుమాధ్వీకఫణితినమరు.

ఈవంశావళి వివరముగా మొదట నిచ్చియున్నాఁడు, గాని, పూర్తిగా లేదు. అక్కడక్కడఁ గొన్నివిషయములు:—

స్వాధీనపతిక:—అష్టవిధనాయికలయందు స్వాధీనపతిక యనునది యెల్లప్పుడును దనయింగిత మెఱింగి తనయాజ్ఞకు లోనుగా నడిచెడు పతిగలయది. ఈస్వాధీనపతికకు వనవిహారాదులు మదనమహోత్సవములు మదాహంకారములు మనోరథావాప్తులను జేష్టలుగాఁ గలిగియుండు- లక్షణము.

చ. గరిమ కుచంబులం గ్రసిమ కౌనునఁ గాంతిమ యంగకంబులం
బిఱుఁదుల మిక్కిలిం బ్రథిమ స్ఫీతిమ నవ్వుల వాక్పటుత్వముల్
వరనటన న్మహాప్రతిమ వక్రిమ చూపుల మందయానముల్
కొరవడి లేకయున్న సతి మిక్కిలి చూడ ని దేమి చిత్రమో.

2. అభిసారిక:—తాను నాయకుని గూర్చి యభిసరించునదైన నాయకుని నభిసరింపఁ జేయునదైన నభిసారిక యనందగు, నీనాయికకీచేష్టలు సమయోచితమైన భూషణములు ధరియించునదియు, శంకయు, బుద్ధినిపుణతయుఁ గపటము, సాహసమును లక్షణములు, స్వీయాభిసారికా పరకీయాభిసారికలకుఁ బ్రకృత మొక్కటే యుండును.

ఇందు ముగ్ధాభిసారిక, మధ్యాభిసారిక, ప్రౌఢాభిసారిక, జ్యోత్స్నాభిసారిక, దివసాభిసారిక, స్వీయాభిసారిక, సామాన్యాభిసారిక లనుభేదములు గలవు. అందు స్వీయాభిసారికాలక్షణము.

చ. కులుకుచుఁ దారహారములు గుబ్బల వెన్నెలగాయ నందియల్
ఘలుఘలుఘల్లుమం చనఁగఁ గాంచి ఝళంఝళ లుప్పతిల్లఁగా
నలయఁగ ధక్కమ్రాయ యభిసారికవైతి మతేల తెల్పుమో
సొలయుచు మిక్కిలిన్ బెదరి చూచెద వెంతటిమాధురాలవే.

3. సకలనాయకులయందును సమమైన సహజానురాగము గలవాఁడు దక్షిణనాయకుఁడు.

ఉ. ముందఱ నున్నవారు పరిముగ్ధవిలోచన లెందఱైన నే
నిందఱియందు పక్షియుగ మేక్రియనిల్పెద నంచు నెంచి తా
నందము మీఱ మీలితదృగంచలుఁడై మధుసూదనుండు నిం
పొందఁగ మేనఁ గ్రొంబులక లూరఁగ నిల్చె దరస్మితుండునై.

ఈరసమంజరి కర్తారిలో శ్రీపతికుల సుధాకరులైన గానవిద్యాపారంగతులైన కోసుకోలు వేంకట్రాయలవారి తనుజనికొఱకు తిరుమలస్వామి వ్రాసి యిచ్చినది.

ఈపుస్తకములోనె మొదట (మువ్వగోపాలపదములు) క్షేత్రయపదములు గలవు. దానికి మొదటఁ బదములపట్టిక యీయఁబడినది. ఇందు 184 పదములున్నవి.

కొంత సాహిత్యలక్షణము గలదు. గణలక్షణములు సాహిత్యరత్నాకరము, సాహిత్యచంద్రోదయము, అలంకారచూడామణినుండి కొన్నిశ్లోకము లిచ్చియున్నాఁడు. పంచమస్థానమందు కకారవిషమాక్షరం యేలూరి శేషయ్యయుంచి చెప్పినకవిత—

చ. మునుపొక కేల రావణుఁడు మోదమునన్ రజతాద్రి నెత్తినం
తన హరుఁ డప్పుడే తనపదంబునఁ ద్రొక్కి మదం బడంచెఁ గా
మనమయగారి తుక్క సచివా నెలశ్రీగిరి గడ్డపాఱలం
గనలుచుఁ ద్రవ్వి సర్వమును గైకొన నీకును నాతఁ డోపఁడే.

కొన్నిపత్రములు, సంగీతరత్నాకర మని సంస్కృతముగలదు.

శ్లో. సప్తాధ్యాయాత్మకం గ్రంథం శార్ఙ్గసూరిస్వమాతనోత్
శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గీతరసం ఫణి
అజ్ఞాతవిషయా గోపాల మురళీశబ్దశ్రవణాత్ దూరరూఢగోచరాత్। ఆగత్య
పటిలో గావః పిబన్తి సుషిరామృతమ్। వ్యాళగ్రాహికగానేన స్థితా అహి,

కార్వ్యదండవత్ । నిర్భిద్య రోభగముద్ధృత్య పిబన్తిస్మ స్వరామృతమ్
అస్తిస్వస్తి గ్రహాం వంశ శ్రీమత్కాశ్మీరసంభవమ్
యజ్వభిర్దక్షభి ధుర్యైః వేదసాగరపారగైః
తత్రాభూ ద్భాస్కరః ప్రఖ్యే భాస్కర స్తేజసాంనిధి
అలంకర్తు ర్దక్షిణాశాం యశ్చక్రే దక్షిణాయనమ్.
తస్యాభూ త్తనయః ప్రభూతవినయః శ్రీసొడ్డళః ప్రౌఢధీః
యేన శ్రీకరణప్రవృద్ధవిభవాభూవల్ల......
ఇట్లసంపూర్ణముగా నై దాకులుగలవు.

(42) గజారణ్యమాహాత్మ్యము. గ్రం. స. 167.

ఇది యొక వచనకావ్యము. కవి పేరు తెలియదు. గ్రంథము పూర్తిగా లేదు. చిట్టచివర కవిపేరు వేసికొనియుండును. ఇదియును దక్షిణదేశప్రతియే దాక్షిణాత్యులందఱును సంస్కృతపక్తినే యధ్యాయములుగా రచించి కొన్ని యధ్యాయముల కొక్కయాశ్వాసముగాఁ దెనుఁగురీతి ననుసరించువారు. వచనము చక్కనిది. పద్మపురాణంబున మధ్యమఖండంబున ఉమామహేశ్వరసంవాదంబున నూటముప్పదిరెండవ యధ్యాయమునుండి ప్రారంభింపఁబడినది. 142 వ యధ్యాయము దాఁకఁ గలదు. కొంతశైలికై చూపుఁడు. 139 అధ్యాయములో-

"తదనంతరంబ లోకపితామహుండైన సురజ్యేష్ఠుండు ఫాలాక్షునికిం బ్రత్యక్షంబుగావించి నమస్కరించి బహువిధంబులం గొనియాడిన భగవంతుండైన యమృతేశ్వరుండు విరించి స్తోత్రంబునకు సంతసించి కమలగర్భా నీతవంబునకు మెచ్చితి వలయువరమ్ము లొసంగెద వేఁడు మనుటయుఁ జతుర్ముఖుండు పంచముఖుఁ జూచి దేవా నీవే సరోవరంబున నావిర్భవించితి వానరస్సు బ్రహ్మపుష్కరిణి యనం బ్రసిద్ధిఁ గాంచవలయు బ్రహ్మపుష్కరిణి తోయంబున మునింగిన మనుజులు దురితవిముక్తులై భవదీయసాయుజ్యంబు నందవలయు- దేవా! ధ్వజారోహణంబు సేయించి నేఁటిమొదలు నీకు నుత్సవంబు సేయుచెద నీయుత్సవం బాచంద్రార్కంబుగాఁ బ్రతిసంవత్సరంబు నడువవలయు, నానక్షత్రంబైనరోహిణియందు రథారూఢుండవైన నిన్ను సేవించి నీకోడంగూడ నవభృథస్నానంబు సేసిన నరులకు సాయుజ్యంబు గలుగవలయు ననిన "... అమృతేశ్వరుండు నలువపలుకు లాలించి...మాఘమాసంబున మృగశిరానక్షత్రం

బున నుత్సవంబునకు నారంభించి ఫాల్గునమాసంబున రోహిణియం దవభృథస్నానంబు...ఈయిరువదియేనుదినంబులును నాగమోక్తవిధానంబున శైవాచారసమన్వితుండవై—సేవింపు మని యానతిచ్చిన..."

దీనికిఁ బ్రారంభ మెట్లుండునో తెలియదు. ఉన్నదాని మొదటనే "అంకితంబుగా నాయొనర్పంబూనిన గజారణ్యమాహాత్మ్యంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన" యని మొదలిడినాఁడు. ఈపుస్తకము గరిమెల సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచ్చినది.

(43) ఆంధ్రరసమంజరి—గ్రం. నం. 148.

ఈగ్రంథమును పుదుక్కోట గరిమెల సుబ్రహ్మణ్యశాస్త్రిగారొసఁగినదియే. ఇందు మొదట శ్రీభానుదత్తమిశ్రవిరచితమైనసంస్కృతరసమంజరి కలదు. అది రాక్షసనామసంవత్సర వర్షరుతు శ్రావణబహుళత్రయోదశిస్థిరవారం-వచ్చిమిరియం ఆదిప్పయ్యగారి మనుమడైన వీణాకుప్పణ్ణయ్యగారి కుమారుఁడు వీణసుబ్బయ్య వ్రాసినది. 20 పత్రముల గ్రంథము పూర్తిగాఁ గలదు. తరువాత నాంధ్రరసమంజరి కలదు. ఈరసమంజరి పుదుక్కోటసంస్థానప్రభు వగు తోటి రాజగోపాలభూపవిజయరఘునాథవసుమతీవిభుని సభలోని నారాయణయ్యంగారు రచించినది. సమగ్రము. ప్రారంభము-

క. శ్రీరంగస్థలవక్షః,స్ఫార శ్రీవత్సకౌస్తుభప్రభలం దను
స్ఫూరులఁ గేరు స్త్రీకిన్, శ్రీరంగస్థలపతిని భజింతును భక్తిన్

ఉ. వల్లభు నుల్లమందుఁ గృతవాస యగుం దనదివ్యదేహము
త్ఫుల్లసితద్యుతి న్వెలికిఁ దోఁచె ననం దదురస్థలంబునం
జెల్లువడి న్నిరంతరము చేరి వసించు సరోజపాణి యు
త్తల్లి యభీష్టసిద్ధి సతతంబు నెసంగ నొసంగు నెంతయున్.

క. వినతియొనరింతు మలయమ్లునికి వటసచలితముకులలురదమరధునీ
ఘనతరతరంగబింబిత,వనజారికలాసహస్రవల్గనగతికిన్.

క. కేవలకాంచనకటకవి,భావిష్కృతియుతులు కాళిదాసాదికవుల్
భావింప రత్నకటకము,హావిభవులు నన్నయాదు లాంధ్రకవీంద్రుల్......అని

వ. ఎద్దియేని యొకసరసకృతి చమత్కృతి కృతసమున్నతిగ రచియింప మతిఁ బూనియున్న సమయంబున,

సీ. కోటివంశాంభోధికుముదినీరమణుండు కువలయానందైకగుణగణుండు...
కలితనిజనామబోధితకాంతివిభవ, సమరసాహససత్యవాక్రమసమాన
శీలపురుషుఁడు రాజగోపాలభూప, విజయరఘునాథవసుమతీవిభుఁడు మహిని,

మ. ప్రసరచ్ఛాత్రుని నప్పయార్యవరసత్పౌత్రుం ద్విషస్సీరద
శ్వసనస్ఫూర్తిని జియ్యవేంకటమహాచార్యాత్మజుం విశ్వవి
శ్వసనీయు న్వరగోపయోగికరుణాసంప్రాప్తసారస్వత
స్వసనాథుం ద్వయపూర్వవాక్యముఖమద్వర్ణప్రసిద్ధాహ్వయున్.

మ. ...ప్రతిభోదంచితకావ్యకల్పను భరద్వాజీయగోత్రుం జగ
న్నుతచారిత్రుని నన్నుఁ జూచి పలికెన్...............

మ. సుకవీంద్రుండవు మద్గురుండవు జనస్తుత్యుండ వత్యాదరం
బకళంకాత్ముఁడ వాంధ్రసంస్కృతకవిత్వాశ్రాంతవిఖ్యాతుఁడ
వకలోర్వీనుతరీతి నీవొక కృతిన్ సంతుష్టుఁడై చేసి వే
డుకఁ గావింపు మిల న్మదంకితము ప్రౌఢోక్తిన్ సుధీంద్రాగ్రణీ.

క. శీలితబుధమానసముధు, పాళి రసాసంగహేతువై యలరఁగ వా
క్కేళిని నేరసమంజరి, బాళిఁ బ్రకాశింపఁజేసె భానుఁడు జగతిన్.

క. ......ఆరసమంజరి తెలుఁగొనర్పు రసికులు పొగడన్

వ. అని రాజు పలుకఁగా నీకవి యాంధ్రీకరించెను. కృతిపతివంశావలి విశే
షముగ వర్ణించియున్నాఁడు. నాలుగాశ్వాసములు– ప్రత్యాశ్వాసాంతము
నను గద్యము, పద్యరూపమున రచించెను. చిట్టచివర–

శా. వన్నెల్మీఱఁగ నుల్లసిల్లిన భరద్వాజీయగోత్రార్ణవో
త్పన్నశ్రీఁగొనుసూరిచంద్రుఁడు దలిర్పన్ వేంకటాచార్య శ్రీ
మన్నారాయణసత్కవీంద్రుఁ డొనరింపన్ రమ్యమై యాంధ్రమై
యొన్నన్ రసమంజరీకృతిఁ జతుర్థాశ్వాస ముద్వొందగున్.

వ. అనియున్నది. "నవసాలపురమునను౦డే పడమటినగరుధోరపై యంకితము
గా శ్రీమన్నారాయణయ్యంగారు జేసిన రసమంజరి యను గ్రంథము–"
దీనినిగూడ వీణె సుబ్బయ్య యే రాక్షసనామ సం॥ శ్రావణశు॥ షష్ఠికిఁ
బూర్తిగ వ్రాసెను. దీనితరువాతను సంగీతరత్నాకర మను సంస్కృతగ్రంథ
ము కొంత కలదు.

"భరతాఖ్యసుధాసింధుసంభూత ఇవ కౌస్తుభః
రఘువీరపదాంభోజమిళిందశుచిచేతసా
గోవిందనామ్నా సంగీతశాస్త్రః సంక్షేపతోచ్యతే" ఇట్లు —

28 పత్రములుగలవు. కటపట- ద్విసప్తతితమే భేదే రసికప్రియనామకమ్ తజ్జాతం రసమంజర్యా రాగద్వయ మితీరితం ద్విసప్తతితమే వాళ్ళజాతం రాగః ప్రకీర్తితాః" శ్రీరామజయం అనియున్నది.

(44) హాలాస్యమాహాత్మ్యము. గ్రం. సం 170.

ఇది యొకవచనకావ్యము దక్షిణమధురాక్షేత్రమాహాత్మ్యము. 71 యధ్యాయము. 8 ఆశ్వాసములుగ రచియింపఁబడినది. అధ్యాయాంతంబుల "ఇతి శ్రీస్కాందే మహాపురాణే హాలాస్యమాహాత్మ్యే... అధ్యాయః" అనియున్నది. ఆంధ్రీకరించినకవి- శ్రీపతి రామభద్రకవి- అతఁడు తనగద్యము నీక్రిందివిధమున వ్రాసికొనియెను.

ఇతి శ్రీమీనాక్షీసుందరేశ్వరసాంద్రకృపారసఁబ్ధ కవితామాధురీధురీణ కాశ్యపగోత్రాశ్వలాయనసూత్ర శ్రీపతికులపవిత్రచరిత్ర శ్రీగిరియమాంబాసత్పుత్ర సూరయామాత్యపుత్ర కవిరామభద్ర ప్రణీతంబైన హాలాస్యమాహాత్మ్యంబునందు వచనకావ్యంబున... ఆశ్వాసము."

కవి దక్షిణదేశస్థుఁడు. పుస్తకమును దక్షిణదేశమునుండి వచ్చినదియె- వచనము సంస్కృతజటిలముగ నున్నది. వ్రాఁతపొరపాటులు గలవు. ఉభయభాషలయందును యమకములు తఱుచుగాఁ గనఁబడును. కొన్ని పంక్తు లుదాహరణమునకై చూపఁబడును.

"అశ్వినీదేవతలు చూచి యిది యపరిహార్యం బనిన నిరుద్యోగులై జాగులైరి. తద్రోగపరిహారార్థంబుగా నొక్కయుపాయంబు దేవరానతీయవలయు ననిన వరుణముఖావలోకనంబుచేసి వానవుండు విను మోనంబు లే దనిసుధాసారసమానవచనంబులు పలికినపుడు- ఏమహావ్యాధిపీడితులై పాశకృత్యులై యపమృత్యుపీడితులై కాలమృత్యువశులైనవారెవ్వరో వారందఱు సుందరమూర్తి సందర్శనంబునఁబునీతు లగుదురు గావున మనోవాక్కాయపరిశుద్ధుఁడై యాయభిషేకపాండ్యరాజాగ్రణి భక్తిప్రభావంబును, ఆదేవుని మహిమాతిశయంబును నీవు లెస్సఁగఁ బరీక్షించి తెలిసి తల్లింగార్చనంబు గావించితివా యెనా నీరోగంబు తొలఁగు నిందుకు సందియంబు లేదు. అనిన శక్రుని వాక్యంబులు విని

వరుణుఁడు చొక్కమని యాచొక్కనాథుని శోధింపఁ దలఁచి గ్రక్కున లేచి యతనికి మ్రొక్కి మక్కువతోడ మిక్కిలి యెక్కువైన హర్షభరవశుండై చక్కఁ దనపురంబునకుఁ జని యంత నొక్కనాఁడు- ఆరాజును సుందరరాజును జక్కన శోధింపఁదలంచి వరుణుఁడు సముద్రుని బిలిచి సముద్రగ సిద్ధరేచి నీయందుఁ గలజలచరపరివృతుఁడవై యనేకతుంగతరంగావృతంబుగ నామధురానగరం బుఁగబళింపు మనిన-"

పరిషత్పుస్తకభాండాగారములో నంజరాజకృత మైనహాలాస్యమాహాత్మ్యవచనముఁ గూడ నున్నది.

ఈరామభద్రకవిగ్రంథము "గర్భపురీక్షేత్రనిత్యనివాసులగు బ్ర॥ శ్రీ లక్ష్మీనృసింహసూరినప్త్రిండును శ్రీలక్ష్మీనృసింహార్యపౌత్రుండును శ్రీరామార్య వర్యుల పుత్రుండు నగు నెందవగోత్రాశ్వలాయనసూత్రుండు నగు శ్రీసీతారామయ్యది." అని మొదలఁగలదు. వ్రాతచక్కనిది. మంచిస్థితిలోనున్నది.

(45) హరివంశము. గ్రం. సం. 4534.

ఎఱ్ఱాప్రెగడరచించిన పూర్వోత్తరభాగములతోఁగూడిన యొకతాళపత్రగ్రంథము. ఇం దుత్తరభాగమున, చతుర్థాశ్వాసము తరువాత 5, 6, 7 ఆశ్వాసములు నేమానిభైరవికవి రచియించినవిగలవు. ముద్రితప్రతులలో నివిలేదు. 8 వ యాశ్వాసము, ఎఱ్ఱాప్రెగడ పంచమాశ్వాసముక్రిందను లెక్కింపఁబడు చున్నది. ౨౦౯ పత్రము మొదలు పంచమాశ్వాసము ప్రారంభమున- ఈమీఁదట నేమానిభైరవాంధ్రాల్లకవిత్వము" అనికలదు. ౨౧౬ లో నాల్గవపంక్తిలో "యీామీఁదట యఱ్ఱయకవిత్వము" అనియున్నది. ప్రారంభము-

ఉ. శ్రీరమణీయకౌస్తుభశుచిప్రభలందున బింబితాంగియై
శ్రీరమణీలలామ తనచక్కటఁ జెయ్యఘటింపఁగాంచి యా
త్తోరపులక్కఁ దీర్పుతటిఁ దొయ్యలిపాదములంటి యంటి వే
మాఱును మారుకేళి బతిమాలెడు వెన్నుడుఁ మమ్ముఁబ్రోవుతన్.

చ. వరగుణశాలి కోటగిరివంశభవుం డగు శ్రీనివాసభూ
వరుఁ డతిభక్తితోడ హరివంశకథాశ్రవణైకచిత్తుఁడై
యరయుచుఁ బారిజాతహరణాదికథావళి లేకయున్నచో
సురుచిరదృష్టిచేత ననుఁజూచి దయామతితోడ నిట్లనన్.

గీ. ఎఱ్ఱనార్యుండు తెలిఁగింపఁ డేలనొక్కొ, తెలుఁగుఁ జేసినపిదపను దొలఁగెనొక్కొ
యీకథలునీవు దెలిఁగింపుమింపుమీఱ, బ్రకటనేమానిభైరవసుకవిచంద్ర.

క. వేంకటభర్తకు నీకృతి, సంకితముగ సేయునేతయగు నాతని హే
మాంకితరుచిదేదీప్య, త్తాకంకణగత మైన కెంపుకరణిం బొలుచున్.

వ. అనిపలికి, తాంబూలాంబరజాంబూనదాగ్రహారాదిప్రదానంబుల నాదరిం
చినఁ బ్రహృష్టాంతరంగుండనై షష్ఠ్యంతములం జెప్పెద-

అని షష్ఠ్యంతంబులు రచించెను. పైదానింబట్టిచూడ నీకవి పారిజాతాప హరణాదికథ లింకఁ జెప్పి చేర్చియున్నట్లు తేలుచున్నది. భైరవకవి తనమూఁడవయాశ్వాసము పూర్తిచేయలేదు. చివర-

క. "హరిగరుడారూఢుండై, సురనగరీతులితభద్రశోభాంకితమై
మెఱసిన తద్ద్వారవతీ,పురమంతటఁ జూచె నపుడు భూపతితిలకా."

ఇట్టి భైరవకవికడపటిపద్యమును,

వ "అట్లుగాంచి భగవంతుండైన హరి మణిపర్వతయంత్రంబులను క్రీడాగృహం
బులును-" ఇత్యాది యెఱ్ఱాప్రెగడ వచనముతో సంబంధముకలిపెను. శైలి
కై రెండుపద్యములు-

ఉ. అతతకీర్తి కాశ్యపవరాన్వయజాతము లౌట మీరు మ
ద్భ్రాతలు దేవపుణ్యజనభాసురదివ్యవిమానవాహవి
ఖ్యాతము లైతి రేకద సురాళికి శత్రుహ కార్యసాధనం
బీతఱిఁ జేయఁగావలయుఁ జేయఁడు కూడదు మంత్రభేదమున్.

మ. హరిపై చేన్ దివిజారినాథు పయిఁ గోపాటోపమేపాఱఁగా
నిరవద్యామితకాంతిదర్శనదశాంధీభూతభూచక్రమున్
శరణార్థీంద్రముఖామరావనలసత్సౌలభ్యనిర్వక్రమున్
వరధారాహతఘోరరాక్షసవిభాస్వన్నక్రముం జక్రమున్.

ఇక్కవి గద్యము. ఇది శ్రీమత్కల్యాళిగౌరీచరణసరసిజషట్పదాయమానమా
నసోభయకవితాసార్వభౌమబిరుదాంక వేంకట భట్టారకపౌత్ర సూర్యనా
రాయణ సోమయాజిసత్పుత్ర నితుందినసగోత్రపవిత్ర నేమానిభైరవావ
ధాని ప్రణీతం బైన హరివంశంబునందు......ఆశ్వాసము.

"ప్రమోదూతనామసంవత్సర శ్రావణబహుళ ౧౦ శుక్రవారము వరకు రాజశ్రీ రావు రామయ్యగారికి మాళ్లు వెంకయ్యగారు హరివంశము యిరవై మూడాశ్వాసాలు రాజశ్రీ కోటగిరి శ్రీనివాసరాయసింగారి ప్రతిస సంపూర్ణంగాను వ్రాయించిరి-" ఈపుస్తకమును, పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారొసంగిరి.

(46) హనుమద్దండకము—గ్రం. సం. 176.

వేదపురీనివాసుఁడైన శ్రీయాంజనేయునిపై రచియింపఁబడిన దండకము. కవిపేరు లేదు. దక్షిణదేశప్రతి. తుదనుగూడఁ గవిపేరు లేదు. చాల శిథిలమైనది. కొన్నియాకులు విఱిగిపోయినవి. ఆంజనేయుండు సీతాన్వేషణమునకై బైలుదేఱినది మొదలు యుద్ధకాండము చివరవఱకుఁ గలరామాయణకథయంతయు నీదండకములో వర్ణింపఁబడినది. అక్కడక్కడఁ గొన్నివాక్యములు:—

"శ్రీజానకీనాథ పాదాంబుజధ్యానహృత్సన్నిధానా! నిధానా! సదానందా! సుజ్ఞానపారీణ! వేదాగమజ్ఞానవైమాని కానేకగంధర్వగానా! మరున్నందనా! వందనానేకభక్తాభిమానా! సుధాబృందవా క్చాతురీభాసమానా! మనోల్లాసకైలాసవాసప్రియా! యుక్తసద్వీర్య సద్రంజనీయాంజనీగర్భసంజాత సంజీవరాయా! మహారాయ......శ్రీవేదపుర్యాశ్రమావాస! హన్మంతరాయా!...... నిన్ను స్మరింపంగ నేనెంతవాఁడ స్సమర్థుండనా యైననానేర్చినంతం బ్రపంచంబున న్విన్నవింతు న్వినోదంబుగా నీవు త్రేతాయుగంబందు శ్రీరామకార్యార్థమై పార్థివుల్మెచ్చఁగా సంగరంబంది యెంతోప్రమోదంబునం జెంది బల్దానవానీకము ల్గూల్పఁగా సీత నీక్షింపఁగా వచ్చి............ఎల్లచోటన్ విచారించి యెచ్చోటనుం గానక............" వ్రాత తప్పులు మెండు. మందబుద్ధేనిరా! నన్గూ దయోధ్యాపురం బేలరా! ఇట్టి ప్రయోగములున్నను పదములకూర్పు నియమములు బాగుగానున్నవి. "రాక్షసనామసంవత్సరము, అధికాషాఢ బహుళ చతుర్దశీ శుక్రవారమునాడు వ్రాసిన దీపుస్తకము." అనియున్నదిగాని వ్రాసినవారి పేరుగూడ లేదు. ౧౩ పత్రములుగలవు.

భారతారణ్యములోని "శ్రీకంఠలోకేశ" యనుదండకముగూడఁ గొంత కలదు. మఱియు,

సీ. శృంగారరాయని చెలువుమీఱినకొండ ఫణిరాజుపేరింటి వసిఁడికొండ
పుష్పజాతులకెల్లఁ బూజింపఁగలకొండ కల్పవృక్షములెల్లఁ గల్గుకొండ
చిలుకలు కోయిల ల్చెలఁగి యాడెడుకొండ మృగరాజకొల్లలమెలఁగుకొండ
ఘోరదురితముబాపు కోనేరుగలకొండ తలఁచిన మోక్షంబు దగులుకొండ
అమరవరులకువైకుంఠ మైనకొండ, ఆటు వారికిఁ బ్రత్యక్షమైనకొండ
యర్థిఁజూచిన బ్రహ్మాండమైనకొండ, యేను గనుఁగొంటి శ్రీవేంకటేశుకొండ.

అనవద్యమును నామగిరీశునిమీఁది పాటలు కన్యకామ్మవారి హెచ్చరీకలు మొదలైనవి.

"సీ. హ్రీంకారి హుంకారి హిమశైలకన్యా అమృతస్వరూపిణి బహుపరాకు
మలయధ్వజునిపుత్రి మధురాపురేశ్వరి వరదేశిరక్షకి బహుపరాకు
సౌందరేశ్వరురాణి శాంభవీ జగదంబ భవవిమోచన దుర్గి బహుపరాకు
... ...
అఖిలలోకైకవందితా యాదిశక్తి, పరమకల్యాణి మాయమ్మ బహుపరాకు
పావనంబైనమీపాదపద్మములకు, దేవి మీనాక్షి కృపఁజూడు బహుపరాకు."

ఇట్లు కొన్ని తప్పులతో నున్నవి. సవతులకొట్లాట యని కృష్ణునిగూర్చి యఱవత, తెలుఁగుది, వాదించుట గలదు.

"ఎన్నఁడీవడుమాచ్చిమన్మథకేళి యోడీఅతికప్రసంగమాయి,తిట్టాదడీసొన్నేన్
అఱివదాన నాదేవుని చెయిబట్టితే,యాలకూ శేవునాతోనువగలాఁడిపోపోవే.
వహా యెన్న కొండాయెడీ వడుమాచ్చి వంజనె శెయ్యవేండాం,
మింజాదె యెన్నుడయ రంగసామియెక్కూడి శెంబుగ కలవిశెయ్యావో.

కూడినగర్వమున, అఱివదాన, కాట్లావచ్చితివేమి, ఆడరానిమాటలాడేవు నాతోనుఅవునె చెంపవేతునే॥ చెంపె యంగిర దెన్నడీ వడుమాచ్చి అతు మాత్రం శొల్లువాయా కడుకడుతు మెత్తగై మింజి వారాదే కన్నత్తులె యడిప్పేన్."

ఇట్లే రెండుభాషలలో నత్తకుఁగోడలికి సంభాషణ కొంతకలదు.

(47) రంగపురిపారిజాతము. గ్రం. సం. 184.

యక్షగానము- 106 పత్రముల పుస్తకము. పుస్తకమువ్రాఁత చాలఁ దప్పులుగా నున్నది.

క. శ్రీరంగపురనివాసుని, సారకృపం బారిజాతసంగ్రహణంబుం
గోరి రచియించినాఁడను, ధారుణిఁ గవిశ్రీనివాసదాసుఁడఁ బేర్మిన్.

ద్వి. అగణితసౌందర్యులైనట్టిబుధులు,
శేషాంబ శేషార్యశిష్యులరకును, భాషావళీకృపన్ బాలుఁడ నగుచు......

అనువాక్యములంబట్టి కవికులగోత్రములు తేలుచున్నవి.

సత్యభామకథ, కృష్ణునికథ, దేవకికథ యిట్లు భాగములుఁ గలవు.

సీ. అమితతిమాలవృక్షములార కానరే ఘననీలదేహు నొక్కరుని నిందు
లలితజ్యోతిర్లతావళులార కానరే శ్రీమించు పీతకౌశేయవాసు
విమలమాకమలాకరములార కానరే కళలఁ జెన్నొందుమొగంబువాని
ఆత్తగంధఫలీలతాంతములార కానరే నవమౌక్తికాగ్రనాసంబువాని

అనుచు నాసత్యభామ మదాంధయైన, మోహాము మొదలోనమతిమతియుమ్మరించ
రంగపురవాసుఁ గానకయుంగభవుని, ధాటిగూడుచు వెదకె నాతరువనములఁ

(48) సుందరకాండము—గ్రం. సం. 181.

యక్షగానము—పట్టాభిరామకవికృతము. ఈకవికవిత్వము తక్కినయక్షగాన కవులకవిత్వముకంటె నిర్దుష్టముగా నున్నది.

ద్వి. ఇది భక్తరక్షణహితమతిపేర. విదితపూర్ణానందవిభవునిపేర
సదనారతప్రభాసాంద్రునిపేర, సదయుఁ డౌ శ్రీరామచంద్రునిపేర
రచియించె నవసుధారసధారలీల, సుచరిత మధురిమస్ఫురణసొంపునను
సూర్యనారాయణసోమయాజికవి, వర్యనందనుఁ డైనపట్టాభిరాము
సుకృతి సుందరకాండసుకృతి నాంధ్రమున, నకళంకమతినిగేయప్రబంధముగ.

శా. శ్రీసీతాలలితాంగి యంకమున రంజిల్లంగ నంగాంగలీ
లానంగంబునఁ జెంగలింపుచును గల్పద్రుస్ఫురచ్ఛాయను
ద్యానత్ప్రోన్నతరత్నపీఠమున మోదంబొప్పఁగా నున్నయా
కౌసల్యాసుతుఁ డిచ్చు మాకు నెపుడుం గళ్యాణసాకల్యముల్.

అని యిష్టదేవతావందనంబు గావించి శ్రీరామదాసాగ్రేసరుం డైన యాంజనేయుని గవి యేయుని వినుతింపుచున్నాఁడు—ఇది ప్రారంభము.

ద్వి. కోటవాకిటిమీఁది కొత్తళంబునకు, గాటంబుగను జివ్వున వేగ దుమికి
పదలించి కట్ల నావలఁ బడఁద్రోచి, మదమునఁ దనవాలమున నద్భుతముగ
జ్వాలియింపుచున్న యాజ్వాలనుని జూచి, వెలయ నీయగ్నికిఁ బ్రీతిగాలంక
వెలిఁగింతు నని యతివేగంబు మీఱి, నలప్రహస్తునియింట నగ్ని రగిల్చి
యింద్రజిత్తునిగృహంబిడియుంగఁదన్ని, సాంద్రంబుగానగ్నిసముగొల్పియచట.

ఇది కథాభాగములోని యంశము. పిలవంగనామసంవత్సరం వంగుని నెల ౫ి ని శెవుడాపుపట్టి యేర్లగడ్డ వేంకటకుప్పావధానుల కుమారుఁడు రామసుబ్బయ్యశాస్త్రి వ్రాసినది.

(49) బచ్చుపురిమల్లికార్జునశతకము—గ్రం. సం. 206.

స్వప్రకాశశతకమును.

ఈపుస్తకములో దాశరథిశతకము, నరసింహాశతకము గూడఁ గలవు. కొన్ని యచివము వేదాంతపద్యములు గలవు ధన్యోహం కృష్ణాకృష్ణధన్యోహం, బ్రహ్మాభిర్ధన్యోహం. అను సంస్కృతకీర్తనము గలవు. బచ్చుపురీశ్వర మల్లికార్జున

శతకములో అంబికకు మల్లికార్జునునకును సంభాషణముగా నగపడుచున్నది. “బచ్చపురీశ్వర మల్లికార్జునా” అని యంబిక ప్రార్థింపఁగా “బచ్చపురీశుఁడ నంబికాసఖి!” యని మల్లికార్జునుని ప్రత్యుత్తరమును గలవు. శృంగారభూయిష్ఠముగానున్నవి.

ఉ. శ్రీరజతాద్రివాస మునిసేవిత మీకు నమస్కరించి నే
నేరిచినట్లు వృత్తములు నెమ్మది రంజిల నూటపద్యముల్
కోరికలూరఁ జెప్పెదను గొబ్బునఁ గైకొని వేడ్కఁ బ్రోవఁగా
పాదము మీఁద మ్రొక్కెదను బచ్చపురీశ్వర మల్లికార్జునా' ఇది కవిప్రార్థన.

చ, చల మిఁక మానరా సరససద్గుణ నిన్నిఁక నమ్మితింతురా
నిలువరప్రాణ మీయెడల నేరము లెన్నకు మేలుదానరా
పిలిచినఁ బల్కవేమి యిఁకఁ బ్రేమతో చూడర కోర్కి దీర్చరా
వలువలు నీకు మ్రొక్కెదను బచ్చపురీశ్వర మల్లికార్జునా.

చ. సరసుఁడ నాదు నెచ్చెలియ సారసలోచన ముద్దుగుమ్మరో
విరసము లాడకే యిఁకను వేడుకచేయవె జోడుగూడవే
నిరతము నీదులోకముగ నిండుగ నున్నది ప్రేమ నామదిం
బరమహితుండ నెవ్వరికి బచ్చపురీశుఁడ నంబికాసఖి.

తొంబదియేడుపద్యములు మాత్రముగలవు కవిపేరు తెలియదు.

స్వప్రకాశశతకము- గీతపద్యములు- “సకలతత్త్వకాశ స్వప్రకాశ” అని మకుటము- మచ్చుచూడుఁడు.

పద్మనేత్రశంభుబ్రహ్మాత్మరూపుల, నొప్పాలవడియాస్యయోష్ణకముల ?
నతిముదంబుతోడ నతిరాత్రయాజుల,ననవరతము హృదయమందుఁదలఁతు.
పెండ్లికోరువారు పెండ్లాలుగలవారు, యతులు మునులుశూద్రులంగనలును
జ్ఞానమార్గమునకు శ్రవణాధికారులు, సకలతత్త్వకాశ స్వప్రకాశ. 2
భాగ్యవంతుఁడైనవాఁడు మోక్షముగోరి, యుండెనేని వాఁడు నుత్తముండు
జ్ఞానసాధకుఁ డని శాస్త్రజ్ఞు లంచురు, సకలతత్త్వకాశ స్వప్రకాశ. 3

వేదాంతమార్గమును బోధించును. ఎనుబదిరెండుపద్యములు మాత్రమే కలవు. కవిపేరు కానరాదు.

(50) నానార్థ సంగ్రహపద్యకావ్యము. గ్రం. సం. 201.

ఇందుఁ బెక్కుపద్యములు నానావిధములవి గలవు. ముప్పాతికపాలు శృంగారరసము.

భూరిగుణహారి శ్రీబృందపురవిహారి, దితిజకులవైరి కేశవదేవశౌరి- ముద్దుశ్రీహరి నేలఁగోముద్దుగుమ్మ- బుధజనానన్న వరకూరిపురముచెన్న- రాజగోపాలుఁ దేవమ్మ రాజవదన- వనితసేవేగి శ్రీవాయలూరిశౌరిఁ, దోడితేవమ్మ పోవమ్మ తోయజాక్షి- బళిర వినవయ్య యీబాలప్రౌఢతనము- నరసమ్మమైనట్టి మాటలనత్య మెఱిఁగి, తగవుదీర్చినవాఁడె పో ధర్మరాజు- రార యేలుకో కోదండరామచంద్ర- విపులకరుణాంతరంగ శ్రీవిజయరంగ, చొక్కనాథధరాపాల సుగుణలోల. ఇట్టిమకుటములతోఁ గొన్ని పద్యములున్నవి.

ఇందు మొదట బాలసుబ్రహ్మణ్యశతకములోని పది నాల్గుపద్యము లున్నవి. అవత్రము శిథిలమైనది. కావున వానిని మాత్రమిందుఁ బొందుపఱుప వలసినవి బూర్తిగఁ జూపుటమైనది.

సీ. శ్రీకంఠవరపుత్ర శృంగారతరగాత్ర సన్మునిస్తుతిపాత్ర జలజనేత్ర
వల్లీమనోహార వాహీకృతమయూర యఖిలలోకాధార యరివిదార
దేవసేనాలోల దివిజసన్నుతశీల కుధరజాబాల సద్గుణవిశాల
భానుకోటిప్రతాప బ్రహ్మణ్యవరరూప యమరసేనాటోప యహికలాప
నీదుపేరిట శతకంబు నేర్చినటులు, విన్నవించెద వినవయ్య వేడ్కమీఱ
శూరసంహార కిరిగిరి సుఖవిహార, సుకవిజనగేయ శ్రీబాలసుబ్బరాయ. ౧

సంతసంబును నిన్ను సంస్మరించుచు భూమి సంచరించెడువాఁడె సజ్జనుండు
నీపదాంభోజముల్ నిర్లజ్జుఁడై సదా భజన చేసెడువాఁడె భాగవతుఁడు
నిర్మలచిత్తుఁడై నిన్ను సేవించుచు ధరనుండు వాఁడె పో ధన్యుఁడరయ
సకలచరాచర సంవాసుఁ డౌనిన్నుఁ బూజచేసెడివాఁడె పుణ్యతముఁడు
నీదు లలరంగ నీనామగానరసము, విని సుఖించెడువాఁడె వివేకధనుఁడు.శూ-

మంచుకోర్వనివాఁడు మార్తాండుఁ గనిగట్లు   త్రిగాంచినట్లు
క్షుద్బాధితుఁడు దివ్యసుధగన్న యట్టులు కడుదరిద్రుఁడు నిధిపడసినట్లు
జడమధ్యగతునకు సుధువ మబ్బినయట్లు ధరఁ దపస్వికి సిద్ధిదొరకినట్లు
తిమిరంబులో మంచి దివ్వెఁ జూచినయట్లు శిశువు తల్లిని జూచి చెలఁగినట్లు
నిన్ను గనుఁగొంటిశుభములు నింపుగంటి,భవనదారిద్ర్యభూతంబుపాఱఁగంటిఁ.

పట్టింట(లోనున్న) నవ్యనిక్షేపంబు గానకయాచించువానికరణి
యమృత మపేక్షించి యౌషధకాంక్షమై వనమూలికల కేఁగువానిపోల్కిఁ
గల్పకంబును బాసి కాంతారములలోనఁ దుమ్మచెట్లను బోయి నమ్మురీతి
భాగీరథినిపీడి పల్వలోదకముల వెతకిగ్రుంకెడు వట్టివెఱ్ఱిమాడ్కి

నిన్ను నేమఱిమూఢుండై యన్యసురులఁ, గొలువఁబోవుటవ్యర్థంబుకువలయమున
దానధర్మము లేని ధనరాసు లవియేల భోగింపఁగాలేని పొలఁతి యేల
ఆప్తులు గాకున్న యన్నదమ్ములు నేల దయతోడఁబ్రోవని దైవ మేల
శరణన్నఁ గావని నరపతి బ్రతుకేల సత్యంబు మాలిన సఖ్య మేల
వేదహీనుండైన విప్రుజన్మంబేల తనయులఁ బ్రోవని తల్లి యేల
బుధులు వరికించిరిన్నియు వృథయటంచు, నిన్నుఁగొల్చినవారెల్ల ధన్యులంద్రు.
కవి యెవ్వరో తెలియదు. కొన్ని సంస్కృతశ్లోకములుగలవు. ప్రాఁతప్రతు లు రెండుగానున్నవి.

శ్లో. లంకానాథకుహేళికాపరిభవః ప్రద్యోతనో జానకీ
వక్షోజద్వయహేళికేళిరసిక స్త్వాం రమాకాతర్పితా (?)
సర్వేభ్య స్వపదారవిందయుగళీభాజాం నిలింపద్రుమః
శ్రీరామ శ్శివతాతి రస్తు భగవా నామ్నాయ చూడాస్పదః.

(61) దండకములు- చిల్లరపద్యములు- గ్రం. స. 208

(1) నామగిరి దండకము- నామగిరినరసింహస్వామి దేవియైనమహాలక్ష్మిపై దండకము- కవిపేరు లేదు. మచ్చునకు-

శ్లో. తారాధీశసహోదరీ భవమహాదారిద్ర్యసంహారిణీ
కారుణ్యాంబుధి సర్వలోకజననీ కల్యాణి కాంతామణీ
చారుశ్రీకరశోభనాంగి నరపంచాస్య ప్రియా-
క్షీరాంభోధికుమారి నామగిరిలక్ష్మి భక్తసంరక్షిణీ.

దండకము—శ్రీమన్మహానిత్యకల్యాణి నీలాంబుభృద్వేణి నీరేజపాణీ బుధశ్రేణి సంరక్షిణీ సైకతశ్రోణి కంజాతసంజాత మాతా జగద్విఖ్యాతవిఖ్యాత శశ్వద్గుణోపేత...... గర్వకుర్వాణుఁడై నిత్యసర్వావరాధింగృపంజూడు మాపంత మాపంతలుం దీర్చి నాయొక్కవిజ్ఞాపనాలాపము ల్వింపు లాలించిపాలించి చేకొంగదే......... శర్వాణియు న్వాణియుం జామర ల్బట్ట నింద్రాణి కాళాంజి పట్టఁ సువర్ణాంగనల్ ఊడిగంబుల్ ప్రమోదంబుతో సల్ప...... ఓయమ్మ యవ్వారిగా వారికిప్పింపవే కాళిఁగాళీపురీ వేంకటాధీశ్వరుం డైనశ్రీమన్నృకంఠీరవస్వామి గారాపుపూఁబోఁడి శ్రీనామగిర్యంబ లక్ష్మీజగన్మాత......నమస్తేనమః.

దండకము చివరకుఁ జక్కగానున్నది.

(౨) ఆర్యపురీనాథదండకము—కవిపేరు దీనికినిలేదు. మచ్చుచూపుడు.

శ్రీమానినీమానసాంభోజసారంగ సారంగసంకతునా నిత్యకల్యాణ కల్యాణగోత్రేశధీరా సుధీర ప్రజాధార విశ్వంభరాకాంత ధారాధరాకార...... ధూళీకృతాక్రూర మారీచదోషాటదోషాటవివ్రాతకంజాతకంజాతనేత్రా అనత్తంబుసుగ్రీవ సుగ్రీవమిత్రానుచారిత్ర...ప్రార్థించి నేమ్రొక్కెదగా మొక్కువన్మక్కువ న్నిక్కువ, బొవ్వ నావిన్నపం బొక్కటాలింపవే మంచి నీపాదపాథోరుహధ్యాన మిక్కాల మేమూఆకగా- నమ్మితి నమ్మితి న్నిన్ను......నామాతయుగా ధాతయుగా భ్రాతయు న్నీవె నీవాడ...కృపంబ్రోవుమార్యాస్తుతార్యాపురీనాథుడైనట్టి దేవోత్తమా యుత్తమాంగాచలాధీశ్వరా దేవదేవా నమస్తే.

ఆర్యాపురములో నుత్తమాంగాచలము కలదు కాబోలును, ఆయచలముపై నీస్వామి వేంచేసియుండును. కొన్ని మాటలంబట్టి పైదండకము నిదియు నొక్కరే రచియించిరా యను సంశయము కలుగుచున్నది.

(౩) కామాక్షీదండకము:—శ్రీమన్మహాదేవి శీతాద్రిజాతా జగన్మాత లోకైకవిఖ్యాతదేహాంగనా రాజితాద్రిప్రసాదంబునం దుండు మందారకాదంబజంబీర పున్నాగబిల్వాదిభూజంబులుం గల్గు నారామమధ్యంబున న్వజ్రవైడూర్యరత్నావళీ నిర్మితం బైనసన్మంటపంబందు మాణిక్యసింహాసనాసీనుడై యున్న ముక్కంటికి న్వామభాగంబునన్ భద్రపద్మాసనాసీనవై భక్తులం బ్రోచు.........తల్లీ నినుం జూచి సాష్టాంగదండప్రణామంబులం జేసెదన్ నన్నురక్షించు...........సర్వలోకేశ్వరుండైన యేకాంబరాధీశ్వరుంగూడి యున్నట్టి కాంచీపురీనాయకీ.....నన్ను రక్షింపవే చాల నాపాలిదోషాంధకారంబునుం బాపు పోచూరి శ్రీకేశవస్వామికిం జెల్లెలైనట్టి యోకంచి కామాక్షి దేవీ నమస్తే.

ఈకవి పోచూరినివాసియేమో-పేరు తెల్పకొనలేదు.

(౪) సూర్యదండకము:—శ్రీమన్మహాకశ్యపబ్రహ్మపుత్రా పవిత్రా జగన్మిత్ర పూషార్కమిత్రా.....సూర్యనారాయణా వేదపారాయణా దేవదేవానమస్తే నమో.

ఈదండకము క్రొత్తదిగాదు. పలువురు నిత్యమును బఠించునదియే. దీనికిని గవి పేరు తెలియదు.

(౮) చిల్లరపద్యములు:-కాంతాలలామశతకములోనివియు, నల్పు, తెల్పు, పసుపు సీసపద్యములునుఁ గలవు.

రామచంద్రునివంటిరాజు తాఁ గల్గెనా పవననందనువంటి బంటుగలఁడు
ధరణి. గృష్ణునివంటి తండ్రి దాఁగల్గెనా కుసుమబాణునివంటి కొడుకుగలఁడు
విక్రమార్కునివంటి వీరుండు గల్గెనా భట్టివంటి యుపాయపరుఁడు గలఁడు
రమణ భోజునివంటి రసికుండు గల్గెనా కాళిదాసునివంటి కవియుఁ గలఁడు
నాఁటివారికిఁ దక్కువే నేఁటివారు, ఎంతవారికిఁ గలుగుదు రంతవారు
కలఁడు వేయింటికొక్కఁడు కడమ లేదు, ఆశ్రితామరయూథ సింహాద్రినాథ.

సీ. ఎలనాఁగ నీదేశ మేదేశ మన్నను జెలువంపు గానొక్క చేలఁజూపెఁ
బద్మాయతాక్షి నీపట్టణం బేదన్న శిలల తటాకంబు పేరబలికె
నిందీవరాక్షి నీయిల్లెక్కడన్నను దలవాయి మోచినతరువుక్రింద
ఏటిదావవె కోమ లెటఁగింపుమన్నను యేటిలో కొన్నల్లు మొదురుబుచ్చి,
నళినాయతాక్షి నీనామ మేదన్నను తరువాతఁ దిమమని తరుణిబలికె
వెలఁది నీకు విభుఁడు గలఁడే యటన్నను, నీళ్ళమీఁదవ్రాసి నలఁతచూపె
నలఁత నీకు నిద్ర గల[illegible]ంత యన్నను, చుక్కఁజూపి సుదతి సున్నచుట్టె.

... ...

క. అంబా పూర్ణసుధాకర, బింబానన త్రిజగదతులబిసరుహనయనా
జంభారివినుత శ్రీబృహదంబా జగదంబ శ్యామలాంబ మదంబా.

బృహదంబపైఁ బద్యములు చాలఁగలవు.

భళిరరవితేజ శ్రీకందివరదరాజ-రమ్యగుణయూథ కావేటిరంగనాథ-చందమామ- ఏలతరితీపుఁజేసేవు మొమ్మలాఁడి- ఇట్లంత్యనియమములు గల పద్యములు కొన్నిగలవు. నాదబ్రహ్మానందయోగి- పదములు గలవు.

ముక్తిమిచ్ఛసి చేత్తాత విషయాన్ విషవత్త్యజ
క్షమార్జవదయాశౌచసత్యం పీయూషవద్భజ

ఇట్లు శ్లోకము లనేకములుగలవు.

ఉ. బూరుగమానియున్నతముఁ బువ్వులుఁ బిందెలుఁ జూచి యాశతోఁ
గీరము లాఱునెల్లు తమకింపఁగఁ గాచి ఫలాభిలాషియై
చేరి రసంబుగ్రోలఁ గొనఁ జించినదూదియు రేఁగినట్లపో
కూరిమిలేనిరాజులను గొల్చినఁ బెమ్మయసింగధీమణీ.

(52) వచననైషధము- గ్రం. సం. 263.

ఇది దాక్షిణాత్యుఁడు వ్రాసినవచనము. దక్షిణదేశమునం దున్నయాంధ్రుఁడే కావచ్చును. భాష గ్రామ్యము గా నున్నది. కథ కేవలభారతములోనిదే కాదు నైషధకథకూడఁ గొంత చేర్చినాఁడు; అటువనైషధకథ కూడఁ జేరియున్నదేమో యన్నట్లున్నది. గ్రంథము పెద్దదియే కాని సంపూర్ణము గాదు; ఉన్న దున్నట్లు కొంతభాగము చూపఁబడును.

"అదిఁన్ని మీరుఁన్ను కూడి వుండ్డేటప్పుడు అది చెప్పగా మీకు సకలమున్ను తెలియపోసుంన్నది. ఓనళమహారాజా! మీరు శీఘ్రముగా పోతే దానికి ప్రాణము నిలుచును, ల్యాకపోతే నిలువచాలదు కాబట్టి అతిశీఘ్రముగా మీరు పొండ్డని చెప్పి ఆనళమహారాజు దగ్గర వుత్తరవు తీసుకొని ఆఅంసము తనకూటముతో కూడా యెగరి ఆకాశమార్గముగా పోయి బ్రహ్మాయొక్క మానస సరస్సులో పోయి చేరెను వింట్టిరా ధర్మనందనా! అవతల ఆనళమహారాజు అంసను అంప్పించ్చివేశిఁ మన్మథుని కోపించ్చుకొని విరహతాపము తాళజాలక అలిసి క్రిందపడి నిద్రపోయేటప్పుడు మన్మదుడు వచ్చి తంన్ను దమయంతితో కూడా చేరుకొన్నట్టుగా స్వప్నంకని లేచి కలగనినామని లేచి చూచి వఖరితోనుంన్ను మాటాడగనే మన్మథబాణములు చురుకు చురుకుమని నాటేట్టందుచేతను నిండ్డావ్యాకులముతో- అంన్నమూ హారనిద్ర ల్యాకనే హరికీర్తనము చేసుకొనుచుంన్ను వఖక్షణం వఖయుగముగా కాలం దొబ్బుకొని నళమహారాజు వుండ్డెను...."

"వోయి ఋషులార నేను నాపురుషుడుంన్ను నాబిడ్యలుంన్ను కూడుకొని వుండ్డేద్దానికి యెన్నిదినాలు చెల్లు నని అడుగగ మునీశ్వరులు యోచన చేశి అంమ్మా దమయంత్తి యింక్కా మూడుసంవ్వత్సరములు పోయినవెనుక నీవున్ను నీపురుషుడుంన్ను నీబిడ్యలుంన్ను చేరివుండ్దురు. అప్పుడు మేము చెప్పినమాటను నీవు తలచుకొపోసునావు" ఈవాక్యములు కడపటనున్నవి తరువాతకథ లేదు. 79 పుటలు- కవిపేరు తెలియదు.

(53) తపతీసంవరణోపాఖ్యానము- గ్రం. సం. 292.

పద్యకావ్యము- కొట్ర నరసింహకవివిరచితము. చతుర్థాశ్వాసము చివర గద్య మి ట్లున్నది.

"ఇది శ్రీనరసింహావర ప్రసాదలబ్ధవాగ్విచిత్ర కౌశికసగోత్రపవిత్ర

కొట్ర నారాయణార్యపుత్ర నయగుణవిధేయ నరసింహనామధేయప్రణీతం బైన సంవరణోపాఖ్యానం బను మహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము."

అద్దంకి గంగాధరకవికృత తపతీసంవరణోపాఖ్యాన మొకటి కాకి నాడ సుజనరంజనీముద్రాక్షరశాలలో నచ్చుపడినది గలదు. ఇందు నడుమనడుమఁ గొన్ని పత్రములు లేవు. ప్రారంభము కనఁబడదు. కవిత్వము సరసమైన ది. ఉన్నపత్రములు వరుసగాలేవు. కొంతభాగము శిథిలమైనది. కొన్నిపద్య ములు మచ్చుచూపఁబడును.

మ. మధురంబై యతిశీతమై విమలమై మందానిలాలోలమై
సుధతో సాటువయై మనోహరమునై శుద్ధంబునై యొప్పు నీ
పథికవ్రాతవిదాహతాపహరణప్రావీణ్యతోయంబు త్వ
ద్విధ మెవ్వారు నుతింపనోపుదురు కావేరీ నదీరత్నమా.

చ. ఖరకరధాటికి న్వెఱచి కాదె హిమంబు కురంగలాంఛనా
గురుకుచశైలమార్గములఁ గూపముల న్గతి న్రాఁకునీడలన్
శరణము నొందె నట్టియెడ సందియమైనఁ దుపారవేళ లం
దరయఁగ నందు వేఁడి మెనయు న్బనియేమి జగత్ప్రసిద్ధిగన్.

మ. హితునిం గన్గొని పక్షులై నాపురికి నీవే తెంచి యిక్కార్యమున్
మతిదోఁప న్సచిమంతుతోఁ దెలిపి హేమంబు ల్సుచేలంబులు
న్వితత శ్రీయుత రత్నభూషణములు న్విఖ్యాత తత్తత్క్రియో
చితవస్త్వాత్తర మిచ్చి పంపు మని పంచెం గౌతుకావాప్తుఁడై.

క. యమునానది పుణ్యానికా, యమునా నది యుం పెసంగ నంభోనిధి సం
భ్రమదా భ్రమదాపహావి, భ్రమదారితదురితదావపావక యగుచున్

ఉ. అంతఁ బురంబు వెల్వడి నిరంతరభూసురకోటి సంతతా
క్రాంతము రాజమార్గపరికల్పితభూరితరాన్నసత్రశో
ధ్ధాంతము వేదశాస్త్రనిజతత్త్వనిశాంతము చోళమండల
ప్రాంతము సహ్యజాసలిలభావుకవంతముఁ గాంచె వేడుకన్.

(54) ప్రపన్నజనచింతామణి. గ్రం. సం. 331.

ఇది యొకపద్యకావ్యము. కవిపేరు తెలియఁజేయు భాగము లేదు. ఇందు పరబ్రహ్మలక్షణ వినిర్ణయ ప్రకరణము, పూర్వాచార్యావతారప్రకర ణము, సంప్రదాయ రత్నాకరప్రకరణము నని కొన్నిభాగములు గలవు-

విశిష్టాద్వైతమతసంప్రదాయము తెల్పఁబడినది. కవిత్వము సొగసైనది గాదు. ఒక్కొక్క ప్రకరణమున 50, 60, 80 పద్యములు గలవు. అన్నియుఁ గందములే.

క. కదలక నిలిచినవారికిఁ, గొదవేమియు లేదు శౌరి కొనసాగించున్
మదిలోఁ దలఁచిన కోర్కెలు, తుదముట్టఁగఁ జేయునతఁడు తోడాసింపన్

క. ఎఱిఁగించెద బరవస్తును, దిరుమలయాం దవతరించెఁ దిరుమలపతిచేఁ
బెరుఁగును సాదము నందిన, పెరియగు గోవిందులకును బెరియస్తుకునూ.

క. కూడారగించెఁ దిరువడి, తోడను సహభోజనంబు దొలఁగక శబరిన్
జాడలు తొన్నక యామెచె, వేడుకతో నారగించె విష్ణుఁడు ప్రీతిన్

క. పరవస్తగు రంగేశులు, చరణద్వయమైనవారు శఠ వైరులు త
చ్చరణులు యతిరాజులు త, చ్చరణులుపరయోగివారిచరణులుజియ్యారూ.

క. ఉండఁదగుచోటు గురువరు, నండను నెపుడుండఁ దగును నది మే లదిలే
కుండిన హరిసన్నిధిలో, నుండుట గుణ మితరచోట్ల నుండఁగఁ జెప్పరూ.

క. తనుబాధింతురు రాజులు, ధన మిమ్మని దొంగవాండ్రు దాయాదులు స్త్రీ
జనములు మందులు పెట్టుదు, రనయము కామాదిలోభమైనది ధనమూ.

కడపట కులశేఖరాళ్వారుల ముకుందమాలయు, అష్టశ్లోకియుఁ మొదలగునవి గలవు.

(55) చాటుధారాపద్యములు

ఈపద్యములు గ్రం. సం. 2531 భాగవతములో ౧౭౨వ పత్రము తరువాయిని శ్రీమద్వన్నరుభ్యోనమః అని యొకపత్రములో వ్రాయఁబడియున్నవి. గ్రంథభాగములోఁ గలసిపోయినవే గాని క్రొత్తగాఁ జేర్చినవి కావు.

సీ. "శ్రీకరకవిభటాశ్రితజనావళులకు విరివిగా సిరులూరు వెల్లటూరు
తాంబూలకదళికాజంబీరతతులచే విఱ్ఱవీఁగుచుఁ గేరు వెల్లటూరు
ద్విజరాజవిట్ఛూద్రసుజనవ్రజమునకు వేల్పుగి ఢ్డనమీఱు వెల్లటూరు
సతతంబు దేవతాసంతర్పణంబుల వేడుకల్చేకూరు వెల్లటూరు
అట్టి వెల్లటూరు కధిపతులైనట్టి, కమలకాళిపతుల గరుడవృషభ
గమనులను పినాకఘనశార్ఙ్గహస్తుల, శూలికేశవులను జాలఁ దలఁతు.

క. పురుషోత్తమ లక్ష్మీపతి, సరసిజభవ వామదేవ సంస్తుత్యహరీ
నరసఖ శౌరి జనార్దన, గరుడగమన పాండురంగ కలుషవిభంగా,

క. శ్రీమానినీమనోహర, దామోదర వాసుదేవ దశరథతనయా
కామితఫలదాయకని, న్నేమఱు వినుతింతు బిజనవేములచెన్నా.
క. వర్తించెద హరిభక్తిని, బ్రార్థించెద నీదుదివ్యపాదాబ్జంబుల్
కర్తయు నీవని సతతముఁ, గీర్తించెద వెల్లటూరి కేశవమూర్తీ.
క. కమలాప్తుని శిష్యుఁడవై, కమలాప్తుని వంశ్యుఁడైన ఘనునకు సీతా
ప్రమద సుఖం బెటిఁగింపవె, యమడాలలో వెలసినట్టి యంజనితనయా.
గీ. దహనమిత్రపుత్ర తపననందనమిత్ర, శక్రరిపులఁ బట్టి విక్రమమున
భంగపఱిచినట్టి బలవంతుఁడవు నీవ, యమడవాళ్ళనుండు నాంజనేయ.
క. కోటిమదనసౌందర్యని, శాటభయద శూలహస్తశార్ఙ్గధరసఖా
పాటించి నిన్నుఁ బొగడెదఁ, దాటిపరితి రామలింగ ధవళశుభాంగా.
క. కంతుని జనక మురాంతక, శాంతహృదయ తావకాంఘ్రి జలజంబులు నే
సంతతమును మదిలోపలఁ, జింతించెదఁ దాటిపర్తి చింతలరాయా.
శ్లో. వ్యాసం వసిష్ఠనప్తారం శక్తేఃపౌత్ర మకల్మషమ్
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్.
శ్లో. మునిం స్నిగ్ధాంబుదాభాసం వేదవ్యాస మకల్మషమ్
వేదావాసం సరస్వత్యా వాసం వ్యాసం నమామ్యహమ్.
శ్రీవేదవ్యాసభగవాన్ నారాయణాయనమః
శ్లో. తత్త్వవిద్యాపయఃపూర వర్ధితచ్ఛాత్రబాలకమ్
రాగయోగసుధాతాక్ష్య సుబ్రహ్మణ్యగురుంభజే.
క. విద్వద్గజకంఠీరవుఁ, డద్వైతవిచారి మన్నతాధికగుణసం
పద్విభవమతోద్ధురుఁడ, స్మద్వరగురు సుబ్బయోగిమండను గొలుతున్.
శ్రీమదస్మద్గురుభ్యోనమః”- అనికలవు.

(56) పృథుచరిత్రము- గ్రం. సం. 534.

ఈప్రబంధ మెన్నియాశ్వాసములదో కాని పరిషద్గ్రంథాలయములో నున్నది యసంపూర్ణగ్రంథము- తృతీయాశ్వాసములోఁ గొంతభాగమును జతుర్థాశ్వాసములోఁ గొంతభాగమును మాత్రము కలవు. తృతీయాశ్వాసాంతగద్య మిట్లున్నది.

“ఇది శ్రీమత్పంచాక్షరీపంచదశాక్షరీమంత్రప్రసాదాసాదితైకసంథాగ్రహణనవ్యకావ్యవిద్యావధాన షట్సహస్రసుల ప్రధాన ప్రధాన హరితహరితస

గోత్రపవిత్ర చరిత్రప్రభట్ట పట్టమట్టపోతనామాత్యపౌత్ర పెద్దనామాత్య పుత్ర సారసారస్వతవిభ్రాజి సరస్వతిసోమయాజిప్రణీతం బైసపృథుచరిత్రం బనుమహాప్రబంధంబునందు తృతీయాశ్వాసము-

క. శ్రీమద్గంగాజూటీ, హైమవతీభానుమితమహత్త్వగుణమయ
త్వామితమూర్త్యనుషంగా, ప్రేమావితశిఖితురంగ భీమయలింగా !

ఇది చతుర్థాశ్వాసాదిపద్యము. కృతి భీమలింగేశ్వరస్వామి కీయఁబడినది. ఈకవి గోదావరీమండలములోనివాఁ డనుకొనవచ్చును. కృతిద్రాక్షారామభీమలింగమున కిచ్చుటయుఁ దత్సమీపముననే వెలువలపల్లిలో పట్టమట్టవా రుండుటయుదానికిఁ గారణము. పట్టమట్ట సోమనాథకవి యనునతఁడు స్కాందపురాణములోని సూతసంహితను దెనిఁగించి బిక్కనవోలిప్రభు వగుకామారెడ్డి కంకితముచేసెను. సోమనాథకవియు సోమయాజియు జ్ఞాతులే యని తోఁచుచున్నది. సూతసంహితను గృతినొందిన కామారెడ్డి షట్చక్రవర్తిచరిత్రమును రచించిన మల్లారెడ్డియన్న. ఈమల్లారెడ్డియే శివధర్మోత్తరమను గ్రంథమును రచించి తనయన్న కామారెడ్డికిఁ గృతియిచ్చెను. కామారెడ్డికాలము కవులచరిత్రమునకుఁ దెలియలేదఁట. మల్లారెడ్డి ఇబ్రాహింకాలములోనివాఁడనియు ౧౪౪౦- ౧౪౮౧ సం॥ లో నుండుననియు నిర్ణయించియే యున్నది. కావున కాలనిర్ణయములోఁ జిక్కు లేదు. బిక్కనవోలును గోదావరిజిల్లాలోని బిక్కోలని కవులచరిత్ర మనుకొనుచున్నది. రాజమహేంద్రవరమును బాలించిన వీరభద్రరెడ్డి మొదలైనరెడ్లసంబంధుఁ డనితోఁచుచున్నదనుచున్నది. అది నిజాం రాజ్యములోని సిద్ధరామేశ్వరక్షేత్రమునకుఁ జేరిన బిక్కనవోలు గాని యీబిక్కోలు గాదు. దోమకొండసంస్థానాధీశ కామినేని వంశసంభూత రాజామల్లారెడ్డికవిప్రణీత శివధర్మోత్తరము పీఠికఁ జదివినఁ దేటపడును. దానిని శ్రీరాజా మహారణసిరవంత్ బహద్దరుగారు దోమకొండ సంస్థానాధిపు లచ్చువేయించి ప్రకటించిరి. మల్లారెడ్డి షట్చక్రవర్తిచరిత్రను రచించినపిమ్మట రచించిన దగుటచే శివధర్మోత్తరము విషయమును బలువురు తెలిసికొనుటకు వలనుపడ లేదు.

సరస్వతీసోమయాజి గోత్రసూత్రాదులు పైగద్యమువలననే స్పష్టమగుచున్నవి. కవిత్వము రసవంతమైనది. చూడుఁడు-

మ. అనలం బున్నది నీమమండలములో నశ్వోఁడి లేకున్న నీ
తనుమధ్యంబున లాంఛనచ్ఛలమునం దద్ధూమ ముప్పొంగునో
వనితామానసదేహదుస్సహతరజ్వాలాశిఖావైఖరుల్
గనునో నీయమృతస్వరూపకరముల్ కాకోలకంఠాకృతుల్.

ఉ. ఏమని దూఱుదాన జగదీశ్వర విన్ను సముద్రనేమిసు
స్వామినిగా మహాఘనులఁ గన్నదిగా కమలాసపత్నిగా
సోముని మూర్తిగా ననక చూచెద వాగ్రహదృష్టి నయ్యయో
కాముని తల్లిఁ జెప్పెడిదిగాక నృపాలుర నేల చెప్పఁగన్.

ఉ. అత్త సుధాబ్ధిపుత్త్రికిని నాయమకోడలికొమ్మ శారదా
మత్తచకోరనేత్త్రికిని మైత్త్రియ కాని విరోధ మెయ్యెడన్
హత్తగఁ జేయఁ డీధరకు నాదిమభూపతి ప్రజ్ఞ మెట్టిదో
చిత్తజమిత్త్రశత్త్రులకుఁ జేయు మహత్తరమిత్త్రభావముల్.

ఉ. సారసజీవనంబులను సర్వజగజ్జనజీవనంబులన్
నీరసతీవ్రధామములఁ నిష్ఠురతం దపియింపఁజేయఁగా
సారసబంధుశబ్దమును సర్వజగజ్జనబంధుశబ్దమున్
సూరున కింకఁ జెల్ల దనఁ జొచ్చిరి వేసవి నెల్లవారలున్.

ఈపృథుచరిత్రము సంపూర్ణప్రతి యున్నవారు పరిషత్తునకుఁ బ్రతి వ్రాసికొనుట కొకసారి పంపఁగోరెదము.

(57) ముక్తిచింతామణి- గ్రం. సం. 539.

ఇది యొక వేదాంతపద్యగ్రంథము. మూఁడాశ్వాసములు. కవి అండలూరి మల్లికార్జునకవి- గద్యము. "ఇది శ్రీమదఖిల విద్వత్కవిరాజేగీయమాన నరసకవితావిచిత్రాండలూరి శరభనార్యపుత్త్ర సమధిగతవీరశైవాచారవిధాన మల్లికార్జునాభిదానప్రణీతంబైన ముక్తిచింతామణి యనువేదాంతప్రబంధంబునందు రాజయోగనిరూపణం బన్నది సర్వంబును దృతీయాశ్వాసము."

ఈగ్రంథమును సృష్టికరణాధులజుఁడును ముఖికాశీపతిపృథ్వీమండలరమణలబ్ధవిభవుఁడు నగు కృష్ణమంత్రి కంకిత మిచ్చెను. ముఖికాశీపతిపృథ్వీరమణుఁడు శృంగవరపుకోటప్రభువు. శృంగవరపుకోట విశాఖపట్టణమండలములో నున్నది. ఈకృష్ణమంత్రి, పాత్రుని కృష్ణమంత్రి కావచ్చును. గ్రంథప్రారంభము:—

ఉ. శ్రీకుచకుంకుమం బెదను జెందఁగ డెందమునందుఁ జెందున
స్తోకదయారసంబు పయిదోఁచె ననం దగుభక్తలోక ర
క్షాకరుఁ డిందిరాధరుఁడు శాశ్వతవైభవలక్ష్మి నిచ్చి సు
శ్లోకుని గృష్ణమంత్రి నతిశోభనదృష్టిఁ గృతార్థుఁ జేయుతన్.

వ. అభ్యుదయపరంపరాభివృద్ధిగా- అని- కృత్యాదిపద్యములు విడు
వఁబడినవి. ప్రథమాశ్వాసాంతమునందు-

చ. అతిబలభీమ సృష్టికరణాన్వయవారిధిసోమ కీర్తి గుం
భితకకుబంత బంధుకవిమిత్రవనాంత వనంబు సాధువ
ర్ణితకృతధర్మ షడ్గుణవినిర్జితశాత్రవమర్మ మేరుప
ర్వతసమధైర్య కాశిపతిరాజహితా దృఢకార్యధీమణీ.
ఘనవైభవసాంద్ర సృష్టికరణకులేంద్రా! అను మొదలగునవి కలవు.

క. శ్రీముఖకాశీపతిపృ, థ్వీమండలరమణలబ్ధవిభవైశ్వర్యో
ద్దామముఖినీపంకజనీ, స్వామిఘృణీకృష్ణమంత్రి సామంతగుణీ.

ఇది ద్వితీయాశ్వాసాదిపద్యము. ఆశ్వాసాంతపద్యములు లేవు.
తృతీయాశ్వాసాదినిగూడ "శ్రీముఖకాశీపతి" యనుపద్యమే కలదు.
తృతీయాశ్వాసాంతపద్యములును లేవు. కవిత్వము మచ్చుచూడుఁడు.

గీ. అన్యసాధనంబు లన్నిటికన్నను, బోధనంబు మోక్షసాధనంబు
పాకమునకు వహ్నిపగిది నీజ్ఞానంబు, గలుగకున్న ముక్తిగలుగ దనఘ.

చ. వెలుచ ఘటాదులందుఁ బ్రతిబింబితమైన నభంబు మార్గిలో
నిలిచి యుపాధిసంగతి ననేకవిధంబుల భిన్నమూర్తియై
చెలఁగి శివుండు ప్రొద్దులు నశించినఁ గేవలుఁడై చిదాత్మయై
యలరుటఁజేసి యాశివుని కన్య మొకించుక లేదు చూడఁగన్.

చ. మనసు నివృత్తిగాక లవమాత్రము చిత్తము శుద్ధిగాదు లో
నొసరఁగఁ జిత్తశుద్ధి గనకుండిన జ్ఞానము లేదు జ్ఞానమా
త్మను సమకూడకున్నఁ బరతత్త్వముఁ గానరు తత్త్వ మబ్బకర
గనుఁగొనరాత్మ నాత్మకడగానక ముక్తులుగారు యెవ్వరున్.

రౌద్రి సం॥ అధికఆశ్వయుజ బ ౧౦ ఆ॥ వరకు మలాల పాపయ్య
వ్రాసెను.

(58) ఆంధ్రకుసుమావళి—గ్రం. సం. 552.

వారణాసి వేంకటరాయకవిప్రణీతము.

ప్రారంభపద్యములంబట్టి కవియుద్దేశము తెలియును.

క. శ్రీకంఠ భక్తవత్సల, లోకైకస్తుత్యనామ లోకాతీతా
శ్రీకశిమికోటపురహర, శ్రీకరత్రిపురాంతకాఖ్య శివశివలింగా !

గీ. పొసఁగ నాంధ్రశబ్దపుష్పంబు లొకకొన్ని, పద్యరూపగుచ్ఛపటలిఁ జేసి
యదియు మీకు మదికి నర్పణచేయుదుఁ, జిత్తజారి దీనిఁ జిత్తగింపు.

గీ. ఆంధ్రకుసుమావళియనునట్టిపేరఁ, దెనుఁగుభేదములొకకొన్ని తేటపఱుతుఁ
గౌరి సత్త్వవిపల్లు లాధారముగను, దేవ నీదగుకరుణచేఁ దెలిసినట్లు.

గీ. ఆంధ్రశబ్దశాస్త్ర మనువార్ధి నేర్పాటు, చేయనోరుల కెట్లుచెల్ల నేర్చు
నల్లసానిపెద్ద నన్నయభట్టాది, శబ్దవేత్తలకును జనునుగాక.

గీ. తొలుత సంజ్ఞల నొకకొన్ని దెలిపిపిదప, సంధిభేదంబులొకకొన్ని జాడదెలిపి
శబ్దసంగతు లెఱిఁగినసరణిఁ జెప్పి, యందుమార్గంబుఁజెప్పెదనరసికొనుఁడి.

ఈకవిగద్యము—

"ఇది శ్రీమద్గౌతమసగోత్ర వారణాసిలక్ష్మీనృసింహార్యతనూభవ వేంకటరాయనామధేయప్రణీతంబైన యాంధ్రకుసుమావళి యనుశబ్దశాస్త్రంబునందు సంజ్ఞాపరిచ్ఛేద సంధిపరిచ్ఛేద శబ్దపరిచ్ఛేదంబులు సర్వంబును నేకాశ్వాసము" మచ్చుపద్యములు—

గీ. దీర్ఘవర్ణమందుఁ దేరిచూడంగను, సున్న లేనియట్లు నున్నయట్లు
నర్థబిందు వనఁగ నరసున్న యనఁగను, పేర నిదియుఁ జెల్లు భేర్మిరుద్ర.

క. పుల్లింగశబ్దజాలము, చెల్లు మహత్తులనఁగ మఱి స్త్రీజడపశ్వా
ద్యుల్లసిత శబ్దజాలము, నెల్లెడ నమహత్తులనఁగ నీక్రియఁజెల్లున్.

క. నీవును వచ్చితి వనఁగను, వావిరి మఱియొకఁడు వేఱె వచ్చినయట్టే
నీవును జనుమని యనఁగను, భావంబున వేఱె యొకని బంపెదననుటన్.

"శేనాధిపత్యం శేషాచార్యులు వల సం॥ జేష్ట బ ౧ లక్ష్మింవారం సరికి యీకుసుమావళిలో వకప్రకరణం వ్రాసె నని తెలియగలందుఃలకు సఃజనులఝునవారిని ప్రార్థిస్తాను" అని చివరనున్నది.

(59) త్రిమలమాసాదినిర్ణయము-గ్రం. సం. 596.

చోళరాజీయ మనునోక్తసిద్ధాంతగ్రంథములో మొదట నొకపత్రముమీఁద నీవిషయము వ్రాయఁబడియున్నది.

శ్రీమద్విజయాభ్యుదయప్రాభవశాలీ సశాలివాహనరాట్
జీయా దస్య శకాబ్దా శ్చతురంబుధిశైలభూమిపరిమితయః. ౧
అద్యతనచిత్రభానౌ మాసత్రితయం మలీమసం భవతి
ద్వామాసౌ విగతరవీ ద్విరవి ర్మాస స్తథైక ఇత్యేవమ్. ౨
రవిరహితః ప్రాక్పృథ స్సంసర్పాఖ్య స్తతో ద్విసంక్రాంతః
అంహస్పతి రపి శుద్ధ స్తదుప ర్యరవి ర్మలిమ్లుచ స్త్వశుచిః. ౩
భాద్రపదమాసదర్శే కన్యామాక్రమతి భూయ ఆదర్శః
తదను ప్రతిపది తౌళే మాయూఢో మాసి మార్తాండః. ౪
తదుపరి దర్శ మతీత్య త్వష్టా సముపైతి వృశ్చికం భూయః
తౌళీవృశ్చికసంస్థే దర్శసమాప్తి ర్విభావ్యతే యత్ర. ౫
తత్సమసంఖ్యౌ మాసౌ తౌ ద్వౌ భవత స్తథాశ్వికార్తికౌ
బాహుళదర్శ మతీత్య ప్రతిపది ధనురేతి తదను దర్శేచ. ౬
మకరప్రవేశ ఇతిత న్మాసో భవతి ద్విసంక్రమాక్రాంతః
కుంభస్థేత్రే మాఘ స్సతి మీనస్థేచ భవతి ఫాల్గునికః. ౭
సంక్రాంతిహీనమాసః తత ఏక స్త్రిమలసంభవ స్త్వేవమ్
ఆశ్వినమాసవిధేయ ప్రత్యాబ్దికక ర్మరూప ముభయత్ర. ౮
సాంకల్పికం సపిండం కుర్యా దిత్యేవ శాస్త్రసిద్ధాన్తః
మార్గశిరః పౌషగత శ్రాద్ధా న్యేకత్ర మాసి విదధీత. ౯
పూర్వాపరాహ్ణభేదా దిత్యేషా భవతి శాస్త్రమర్యాదా
దశమాసాః ప్రకృతిస్థాః వైకృతికాస్తు త్రయో భవంత్యేవ. ౧౦
సంసర్పాంహస్పత్యౌ మలిమ్లుచశ్చే త్యేత త్రయోదశేతే
వెల్లాలాన్వయజనుషా హోబలనరసింహనామధేయజుషా. ౧౧
విదుషా మేతత్త్రిమలీమసమాసవివరణం శరణమ్
వేదాద్రినందవర్షే శాకే పూర్వం గతోథ తిథిరంధ్రైః. ౧౨
పశ్చాదంగశరాక్షిక్షితిభి రథాష్టాద్రిరామ శశిభిశ్చ ౧౩౭౪

అథపర్యాయత్రితయా దేకో ననభో(౧౯)నశశిజలేందు మిహై(౧౪౧)౧౨౨
సముపాగతా దుపేత స్త్రీమలీమసమాసవర్ష ఉదయాయ
వేదాబ్ధిశైలభూమితి రభిధేయ శ్చిత్రభానుశబ్దేన
ఉపరిష్టాదప్యేవం క్షయమాసః క్వాపి సంభవే దేవ. ౧౪
ఆపంచాబ్ద ముపేయుషి ద్విరధికే మాసేవ నైవ త్యజేత్సంసర్పి
పితృవార్షికం తదుభయోః కుర్యా దపిండం పురా. ౧౫
తచ్చాంహస్పతిమాస ఏవ విధివ త్కుర్యాద్వయో ర్మాసయో
యః కర్తవ్య మహః పురాపరభిదా మాం శ్రిత్య ధర్మస్థితేః. ౧౬

(60) శ్రీరంగమాహాత్మ్యము—గ్రం. సం. 672.

ఇది యొకపద్యకావ్యము-ఐదాశ్వాసములు.

గద్యము—శ్రీరఘురామచంద్ర చరణారవింద నిష్యందమరంద బిందు సందోహలాలసేందిందిరాయమాన మానస తాండవకేళికౌతుకోజ్జృంభమాణ మహాభుజంగపుంగవవిభూషణోత్తమాంగ రంగద్గంగాతరంగాభంగుర చతురకవితారచనాధురీణ శ్రీహరిభక్తామృతసార ప్రబంధ నిర్మాణప్రవీణ చేకూరువంశపయఃపారావార రాకాసుధాకరాయమాన సిద్ధులు నామధేయ ప్రణీతంబైన శ్రీరంగమాహాత్మ్యం బనుమహాప్రబంధమునందు......అని—దీనివలనఁ గవిపేరు సిద్ధులు (సిద్ధయ్య) యని తేలినది. ఈతఁడు శ్రీహరిభక్తామృతసార మను ప్రబంధమునుగూడ రచించియున్నాఁడఁట.

శ్రీనలగొండ్లలక్ష్మినరసింహకవీంద్రకృపావలోకనా
నూనసుధారసంబున వినూతనసాహితి లక్షణాదిక
జ్ఞానము గల్గి సత్సుకృతికాండము దండిగ నిచ్చమెచ్చి యా
సేనన రంగనాయకమహత్త్వ మనం గృతి నే నొనర్చెదన్.

అనుపద్యముంబట్టి నల్లగొండ్లలక్ష్మినరసింహకవిగారిశిష్యుఁ డని తేలినది.

వ......లబ్ధమనోరథు లగుగండకరబలిజకులంబునం జెలువలరు జలకలగోత్రపవిత్రులనం బరఁగు నాగునువంశం బలఘుతరంబై ప్రవర్తిల్లు.

ఉ. శ్రీమత్తంజదళాక్షు సత్కరుణ నాచేకూరువంశాంబుధిన్
సోముం బోలి జనించెఁ గృష్ణుఁ డనఁగా సువ్యక్తశీలాత్ముఁడై
శ్రీమంతుం డగుకృష్ణదేవపదరాజీవార్చనాసక్తతన్
ధీమంతుం డన బుచ్చమాంబను మహాతేజంబునం బెండ్లియై.

దీనింబట్టి కవి గాండవరబలిజకులస్థుఁడు జలకలగోత్రుఁడు నని తెలిసినది, పైపద్యములోని కృష్ణయ్యకు గోపాలుఁడు వెంగళయ్య యను నిద్దఱుసుతులు. ఆవెంగళయ్యకుఁ జలమయ్య, కృష్ణుఁడు నని యిరువురుతనయులు. చలమయ్య గృహిణి మంగమాంబ.

గీ. ....మంగమాంబాభిధాన, సాధ్విగర్భాబ్ధిసంపూర్ణచంద్రమూర్తిఁ
బరఁగి సిద్ధాఖ్యఁజెలువొందిపద్మనాభు, మదిని భావింతుఁబూర్వజన్మానుసరణి.

ఇట్టి కవివంశావళి దీనిని బట్టి తెలియవచ్చుచున్నది. ఈతనికవిత్వము సంస్కృతపదజటిల మైనది గానున్నది. కృత్యాదిపద్యములు కొన్ని—

ఉ. శ్రీమిథిలాధినాథనృపశేఖరజాతసనర్మభాషణ
స్తోమలసద్ధరస్మితుఁడు సుందరవిగ్రహుఁ డాష్టపాళికా
రామవసంతుఁ డర్యమకులాంబుధిపూర్ణసుధాకరుండు శ్రీ
రాముఁడు సత్కృపామతి నిరంతరము న్మముఁ బ్రోచుఁ గావుతన్.

ఉ. ప్రీతి నమోనమో యనుచుఁ బెక్కువిధంబుల మ్రొక్కుదున్ మనో
జాతుని తల్లికిన్ సుకవిసంస్తుతకల్పకవల్లికిన్ ఖనీ
భూతదరిద్రవారిధరపుంజప్రభంజనదృగ్జగత్రయీ
పూతకు దుగ్ధసాగరసముద్భవకున్ జగదేకమాతకున్.

మ. సరిదిభ్యావృతగోభృదంశజవిభూషాంగార్చరాజన్మహీ
ధరరాట్సంభవ కబ్జిజాబ్జభవకాంతానంత సంతోషశ్రీ
కరమాధుర్యహితానులాపకు సమగ్రానుగ్రహాలోకనో
త్కరసంరక్షితభక్తజాలకుఁ గవిత్వాకాంక్షినై మ్రొక్కెదన్.

గ్రంథభాగములోనిపద్యములు—

చ. అన విని రామ రామ విను మాఁడది యంచుఁ దలంచెదీవు నీ
వనితఁ గనం గృతాంతయభవాబ్జభవాదులకైన మృత్యుకై
నను భయమున్ ఘటించు మునినాథసుపర్వవినాశకారిణిన్
హనన మొనర్చి సంతతము హర్ష మొనర్పుము సాధుకోటికిన్.

ఉ. అచ్చటివానికాంతలు ధరాత్మజఁ గాంచి మహానుభావు లీ
సచ్చరితు లసమున్నతులు శస్త్రధనుర్ధరు లగ్ర్యతేజు లి
ట్లచ్చపుమానివేషు లెవరన్న మఱంది నెఱుంగఁ జెప్పితా
హెచ్చినలజ్జ నుండ నగి రింతి జనంబు గిలాకిలంబుగన్.

ఉ. రాముఁడు రావణాసురు శిరంబులు బాహులు ద్రుంచె మొల్చె నా
స్తోమము ద్రుంచె మొల్చె మఱిద్రుంచెను మొల్చెను ద్రుంచె మొల్చినన్
వేమఱుఁ ద్రుంచుచుండ నవి వేమఱు మొల్చె సవిస్మయంబుగా
నామహి శీర్షముల్ కరము లగ్రలభంగిఁ దనర్చె భూవరా.

(61) బాలభారతమ్-గ్రం. సం. 855.

ఇదియొక సంస్కృతకావ్యము. అగస్త్యకృతము. దీనినిఁ గొంత బ్ర॥ కోలాచలము శ్రీనివాసరావుగారు రాంధ్రీకరించి ముద్రింపించియున్నారు. వారికి మొదటినుండి పంద్రెండుసర్గముల గ్రంథము దొరకినదఁట. అందాఱుసర్గములే వారు తెనిఁగించిరి. ఈపుస్తకములో, తృతీయసర్గము మొదలు షోడశసర్గము వఱకుఁ బదునాలుగు సర్గములుగలవు. "అగస్త్యకృతే బాలభారతే" యనియున్నది. ఒక్కచోట అగస్త్యసంవాదే యనివ్రాసి సంవాదే యనుదానిని గుండలీకరించినారు. పరిషత్పుస్తకభాండాగారములోని గ్రంథము ప్రారంభమునందలి కొన్నిశ్లోకములు:—

జాతు జహ్నుదుహితు ర్జలే చిరం పద్మగన్ధిని విహృత్య నిర్గతైః
పౌరవైః పటగృహేషు భూషితైః భుక్తవద్భి రుషితం తటే సుఖమ్.
తత్ర వారివిహృతిక్రమాలసం నిద్రయా పరవశం వృకోదరమ్
సింధుసీకరభృత శ్శిషేవిరే మందరాద్రినవిరామవాయవః.
ఆయతాభి రహితం సుయోధన స్తం సుషుప్తి మవబుధ్య వల్లిభిః
భోగిబద్ధ మివమందరం హరిః సింధుగర్భపయసి న్యపాతయత్.
స ప్రబుధ్య సరిత స్సముద్ధితః ఛిన్నబంధనశతః స్వపన్ పునః
విద్విషా కుసుమతేన మోచితై రుద్విషాగ్నిభి రదృశ్యతోరగైః—3 సర్గః.

పవనతనయే నాశ్వత్థామ్నః సనామ్ని హతే ద్విపే
చకితమనసా ద్రోణా దభ్యర్థితో మురవైరిణా
పతతి సమితా వశ్వత్థామా హతః పరవారణః
స్ఫుట మితి గిరం రాజా ధర్మాత్మజః స్వయ మబ్రవీత్-
ససత్యవచసో గురు ర్గిర మజాతశత్రో స్తదా
నిశమ్య సుతవత్సలః సపది హాసుతేతి బ్రువన్
విసృజ్య సశరం ధనుః ప్రబలశోకముహ్యన్మనాః
రథోపరినిషేదివానభవ దశ్రుధౌతాననః.

దృష్టద్యుమ్నేన సద్యస్సముపగతవతో వాహినీం తస్యరోషా
దున్ముక్తప్రాణవాయోః కరకలితకచే నాసినా మూర్ధ్నికృత్తే
సంక్షుబ్ధే సైన్యసింధౌ శ్రుతపితృనిధనః క్ష్మామపాలా మకృష్ణాం
కర్తుం నిష్పాండవంచ వ్యసృజ దరిబలే ద్రౌణి రాగ్నేయ మస్త్రమ్.
దగ్ధైకాక్షౌహిణీకే జ్వలితదశదిశా పార్థముక్తేనతస్మిన్
బ్రహ్మాస్త్రేణ ప్రశాంతే సపది గురుసుతం రోషసన్న్యస్త శస్త్రమ్
వ్యోమ్నః క్లుప్తావతార స్తరళతరజటావిద్యుదుద్యోతదీప్తా
ద్వ్యాసః కాంతారవాసవ్యవసితముచితైర్వారయామాసవాక్యైః-౧౬సర్గ.

పరిషత్పత్రిక 19 సం. 1-2 సంచికలలోఁ బ్రకటింపఁబడిన నలకీర్తి కౌముదిని రచించిన యగస్త్యుఁడు నీయగస్త్యుఁడు నొక్కఁడేనఁట. నలకీర్తికౌముది పూర్తిగ నెక్కడనైనఁ గలదా!

(62) శకుంతలనాటకము—గ్రం. సం. 695.

ఇదియొక యక్షగాననాటకము. నరసింహకవికృతము- ప్రారంభము:—

ద్విపద.

శ్రీమంతుఁ డఖిలలక్ష్మీప్రసన్నుండు । భూమి సోమాన్వయాంబుధిసుధాధాముఁ
డరిశైలపవిధారుఁ డసహాయబలుఁడు । వరుసతో నంద్యాలవంశవిస్తారుఁ
డమలసదాచారుఁ డాత్రేయగోత్రుఁ । డమరేంద్రనిభవైభవస్ఫీతుఁ డనఁగ
రమణ నారాయణ రాజశేఖరుఁడు । విమలయశోరూపవిజితతారకుఁడు
ఆమహీపాలున కనుఁగుతనూజుఁ । డైమించు రాఘవానవనినాయకుండు
అతులప్రతాపుఁ డూర్జితశక్తియుతుఁడు।నతనికగ్రసుతుండు నయగుణయుతుఁడు
రణకోవిదు..................................అన్నృపవర్యునకనుజన్ముఁడగుచు
అమలగాంభీర్యరత్నాకరుం డగుచు । రమణనారాయణ రాజదేవేంద్రుఁ
డొప్పునానృపవర్యుఁ డొకనాఁడు ... ...
అమదార వర్ఘ్యులనరసింహాసుకవి । వరయంచు రావించి... ...
అంబరతాంబూలజాంబూనదాది ... ... లోసంగి
పరికింప నన్నయభట్టారకుండు । విరచించె దుష్యంతవిభుచరిత్రంబు
నాకథ యక్షగానంబుగా మిగుల । శ్రీకరంబుగఁ గీర్తి చెలువొందఁ జేయు
మనిపల్కి దీవించి.........పెనుపొందహరిపేరఁ బ్రబలునీకృతియు

కమనీయమగుకథాక్రమ మెట్టిదనిన:—

దీనివలనఁ గవిసంగతియు తత్కృవికిఁబ్రోత్సాహ మొనర్చిన నంద్యాల ప్రభువులపేరులును, కథ యెందుండిగ్రహించినదియు, దెలిసికొనుచున్నాము, కథాకల్పనము యక్షగానములకుఁ దగినట్లే యున్నది. భామవేషకథవలె నున్నది.

క. పచ్చలబాకు కరంబున, ముచ్చటగ హుమాయిపిట్ట ముంజేతిపయిన్
 మచ్చికలర మంత్రులతో, వచ్చును దుష్యంతనృపతి వైభవమలరన్.

గీ. ఎవరయా మీర లేదేశమేలుదొరలు,ఇపుడుమీకిటువచ్చుటయెందుకొఱకు
 తల్లిదండ్రులు యెవ్వరు ధరణినాథ, తెలియ జెప్పుముమీనామధేయమేమొ.

దుష్యంతవచనము:—

ప్రేమమీరఁగ నాదు పేరేమనెదవు, ఏమిరాప్రియభృత్య యెఱుఁగవా నన్ను.

భటునివచనము- రాజేంద్రా !

గీ. మీరు యిటఁజేరినది మొద లేదినీశ, సభికులందఱుఁ జాలఁగా సంతసించి
 యెదురుచూచెదరయ్యయిం కేలతడవు, తెర వెడలిరమ్మయి చటికిఁదీవ్రముగను.

రాజు- ఆలాగేవచ్చెదమురా భృత్యా !

దరువు. వెడలివచ్చెనూ వేడ్క-మీఱ దుష్యంతనృపతి- వెడలివచ్చెను-

పైమాటలే సర్వమును వేత్తలకుఁ దెలియఁ జెప్పుచున్నవి.

విళంబినామసంవత్సర భాద్రపద బ ౧౦ లు నాఁటికి సమాప్తముగా శ్రీమన్మహామండలేశ్వర నంద్యాల నారాయణరాజుదేవమహారాజులుంగారు స్వహస్తముగా వ్రాసినది.

(63) లక్షణచంద్రిక—గ్రం. సం. 552.

దీనిఁకి గవి యెవ్వరో తెలియదు- తొమ్మిదిపత్రములు గలవు- ప్రారంభము-

గీ. శ్రీమనోనాథ నుతచర్య శ్రీమహేశ, సర్వనత లసదచలాత్మజాకళత్ర
 బాలజనములకెల్ల విస్పష్టముగను, జేతు లక్షణచంద్రిక చిత్తగించు.

గీ. పూర్వకవులకు భక్తితో మ్రొక్కి నూత్న, కవుల వేడ్కనుతించి కాకవుల విడిచి
 లఘుతరంబుగ జనులు సులక్షణంబు, దెలియ లక్షణచంద్రికఁ దెలుపు దీశ.

క. సుకవికృతిఘటపదార్థ, ప్రకరము మ్రుచ్చిలుచు నెపుడుఁ బరఁగుచు నుండీ
 కుకవిశునకముల కిలమ, త్సుకృతిస్నేహాభిలాష చొప్పడు నెటులన్.

గీ. మునుపులక్షణంబు గనువా రెఱింగితే, దీనఁ గొన్ని మరలు తేటపడును
మున్నెఱుఁగకుండి కన్న సూక్ష్మంబుగా, లక్షణంబు దెలియు లక్షణముగ-
(విషయము క్రొత్తదియును గాదు, చెప్పినంత సుకరముగాఁ దెలియుపద్ధతి
యును గాదు.)

క. కంద మిారీతిగా కొక, యందంబున నైసఁ జెల్లు నాదిమపాదం
బందుఁ బదిరెండు మాత్రలు, చెందిరువది రెండవదియు శేషం బటులన్.

ఇందుకులక్ష్యము- జ్ఞానవాసిష్ఠరామాయణము.

క. ఇది తత్త్వరహస్యార్థము, పదసంగతిఁ దెలుఁగుపఱుచు ప్రాజ్ఞులకును బె
ట్టిదము తాత్పర్యవాసన, విదితంబుగఁ గవులుమెచ్చ వివరింతుఁ దగన్.

భారతము- శాంతిపర్వము-.

జననీజనకసోదరులు, తనూభవులు.........
తేలుమండా మె బోనము, పాలాయెను మంచినీళ్ళు పండితవర్యా.

ఉ. బ్రహ్మవిరామమున్ భరనభారలగంబుల నుత్పలంబగున్.
మ. పదమూటన్ సరభంబులున్ నమయవల్ వల్లిన్న మత్తేభమా.
చ. సజభజజల్ జరేభల గనంగ దశాయతి చంపకంబగున్.

క. పదుమూఁడుగోటులును న, ల్బది రెండగులక్షలు దగుఁ బదియేడు వేల్
పిదపేడునూఱులు న్నిరు, వదియూఱుసమాంఘ్రివృత్త పంక్తులు దేవా.

49 పద్యములైన పిమ్మట- సేనాధిపత్యము శేషాచార్యులు నలనామ సం॥ జ్యేష్ఠ బ ౮ ఆదివారమునరికి యీలక్షణచంద్రిక వ్రాసెను. అని- తర్వాత మరల మకారయతికి యరలవశషసహమాత్రలకు యీ ౮ అక్షరములకు దాపల సున్నలు వున్నయెడల మకారము మాత్రమే యతులుచెల్లును- ఇత్యాది గొన్నిపంక్తులు గలవు. పూర్తికాలేదు.

(64) అచ్చతెనుఁగునిఘంటువులు. —

ఒక తాటియాకుల చిన్నపుస్తకము. ఇందు చౌడప్ప సీసములు- ప్రగడపువారికందము లని రెండుభాగములు గలవు. ప్రగడపువారికందము లని యే కాని కవిపేరు లేదు. సుమారు 80 పద్యములు గలవు. చౌడప్పసీసములు ప్రారంభములో,

క. కప్పామెయితేనిపేరిట, ముప్పదిసీసంబు లాంధ్రముగఁ జెప్పును జౌ
డప్పయు నీకబ్బఁబునఁ, దప్పెంచకుఁ డార్యులార తగనుతిసేతున్.

అనియున్నది. ఈతఁడు కవిచౌడప్పయో మఱియింకొకరో తెలియదు.

అంద్యోక్తపద్యము—

సీ. గోలనా ముగుదారిగోలనాఁ గను ముల్లుఁగోల యోఁడయుఁబరిగోలయనఁగ
డిందు వనంబు కడిందు తోరంబు ను డిందు నుంటకు ను బేరిందు క్రీడ
తీడ్రంబు చికిలి మెట్టంగ్రు మట్టాట వా డంగ్రు వాడఁటిగ్రేగంగ్రు బయపు
వెల్లి నిండుట పాలవెల్లి పాల్లవలి రే పెల్లి నాఁగను గొఱు గల్లి నాఁగ
తట్టియన యెడ్డె పెనుచోరపట్టె మీఁటు, తోట్టుప ట్టాలవాట్టె ప్రోటుట్టె నాఁగ
మట్టిచిట్టఁ బరున్న రాకుట్టమిన్న, కట్టిచెలివేల్ప ముజ్జగాలొజ్జదాల్ప.

ప్రగడపు వారికందములు ప్రారంభము.

క. శ్రీరమణీకుచలిప్తసు, సౌరభఘనసారగంధసారవసీరా
సారఘనసారసారస, సారరజోవత్స వత్ససారవిదారీ!

క. ఇమ్మహి నిరసించుట కగు, గిమ్మా నవఘళించ నేవగించను బలుమే
లమ్మాడెఁ బెగడె నెకస, క్రొమ్మాడె దురంగలించఁ గేడించనగా.
పేరొప్పును మరుభూమికి, మోరపురతనాలమెట్ట మొరకబువి యనా
వారిజము బాడిదము నిం, డారును గంకేళి పేరు లంబురుహాక్షా.
ఏడ్తెఱయు సాంపరాయము, నేడ్తెఱయు నితాంతమునకు నిలఁ బేరొప్పం
దోడ్తోనన సంప్రతి యగుఁ, దోడ్తోననఁ బూర్వమునకుఁ దొడరురమేశా.
సారవయనఁ గేదారము, సారవయన సేతువునకుఁ జనుఁ బేరవనిఁ
బూరుగయన శాల్మలియును, బూరుగయనఁ గాహళంబు భూసురవినుతా.

వ్రాఁతతప్పులు మెండుగా నున్నవి. దానితోపాటు కవి బుద్ధిపూర్వకముగాఁ జేర్చిన "బుయనాఁగయోని గెబ్బుయనా జయింపు మబ్బుయనాఁగ మొయిలు గబ్బుయనత్రుల్లు" ఇట్టి పొరపాటులును గలవు.

క. వనదేవత కాల్రేఁడనఁ, దనరును గువ్వకరి యేకతమునకుఁ జేరై
చను వంకకట్ట లాతో, మనఁ గూఁకటి యనఁగఁ జుట్టు అంబుజనేత్రా.

అను కందపద్యముకూడ సీసములచివర నున్నది. దీనిచివర సంస్కృతము ద్విరూపకోశముకొంతఁ గలదు.

వికృతినామసంవత్సర చైత్ర బ ౧౧ సోమవారము వఱకు క్రొత్తపల్లి లచ్చయ్య స్వంతమునకు వ్రాసికొనినపుస్తకము.

(65) సురాభాండేశ్వరోపాఖ్యానము. గ్రం సం. 1018.

ఇది యేకాశ్వాసపద్యకావ్యము- కుచేలోపాఖ్యానమును, యాజ్ఞవల్క్యపురాణమును రచియించిన గట్టుప్రభువు దీనికవి. ఘట్టుప్రభుఁడనివాడుక.

గద్యము:—ఇది శ్రీమద్భ్రమరాంబికా వరప్రసాదలబ్ధ కవితాధురంధర సరస కవిమిత్ర యెల్లనామాత్యపుత్ర గట్టుప్రభునామధేయప్రణీతం బైనసురా భాండేశ్వరోపాఖ్యానంబునందు సర్వంబు నేకాశ్వాసము.

గట్టనఁగాఁ బర్వతము-పర్వతమనఁగాఁ బ్రసిద్ధికెక్కిన శ్రీశైలము-శ్రీశైలేశ్వరునిపేరు గావున గట్టుప్రభుఁడు అనితల్లిదండ్రులొనర్చిననామకరణము కావచ్చును. కొండలరాయఁడు, ఉప్పాకయ్య,కొండయ్య,సింహాచలము, తిరుపతయ్య,అన్నామలై, అరుణాచలము-ఇత్యాదిగా వచ్చినపే రగును.

ప్రారంభ మిట్లున్నది.

క. శ్రీమత్కాశీపట్టణ, ధాముఁడు విశ్వేశ్వరుండు ధరణీధరజా
భామాకుచకుంభయుగ, శ్యామలవక్షుండు మముఁ గృతార్థులఁ జేయున్.

చ. హరిణపినాకహస్తుని బురాసురఘోరమదాపహారునిం
బరమపవిత్రునిం గుముదబాంధవపావకమిత్రనేత్రునిన్
సురగణవంద్యుని న్శివుని శుభ్రభశేఖరు సర్వమంగళా
వరదుని గాశికాపురనివాసిని విశ్వపతిన్ భజించెదన్.

ఈకథకు మూలము స్కాందాంతర్గత కాశీఖండములో నున్నదని చెప్పుచున్నాఁడు.

సీ. ... ...
కలవందుఁ బర్వత ఖండంబు కేదారఖండంబునన భువి ఘనతగాంచి
యొందును నందుల నెక్కుడు కాశికాఖండంబు ముక్తికిఁ గారణంబు
పరఁగె నందుల సురాభాండేశ్వరం బను పుణ్యచరిత్రము భూరిమహిమ
నట్టికథఁ దేట తెనుఁగుననతులమృదుల,సరసమాధుర్యవాక్యముల్ సంఘటించి
కపులకరుణావిశేషంబు కలిమికతన, విశ్వపతి కంకితంబుగ విన్నవింతు.

క. భ్రమరాంబాకరకలితా, త్యమలిన సద్వర్ణసముదయాంకిత జిహ్వా
సుమహితుఁడ నేను గవితా, ప్రమదాజనకుండ గట్టుప్రభువాంకుండన్.

కథలోని రెండుపద్యములు—

క. తెక్కలు విదలిచి యీఁకలు, ముక్కులఁ జక్కఁగ దిద్ది ముందటికి మెడల్
నిక్కించి మిన్నుఁ జూచుచుఁ, గొక్కొరొకొ యటంచుఁ గోళ్ళుఁ గూసెన్.

వ. అంత.

గీ. వారుణీవిక్రయుండుగృహద్వారమునను, నిల్చి సనభర్తృగేహినిఁబిల్చుటయును
గడగడవడంకుచును లేచికమలనయన, యవనిదేవోత్తమునకిట్టులనుచుఁబలికె

శా. ఏబూమెల్ యెటువచ్చునో యనుచు మున్నే నెన్నియుం జెప్పిన
న్నాబుద్ధుల్ వినవైతి విపుడు కటా నాథుండు వచ్చెఁ గదా
యేబొంకు ల్గొంటగావు పోవు మిఁక నీ వెంటైనఁ బోనోపవే
నీబాన న్వసియింపు వారుణిరసం బేపాటి యందున్నదో.

శ్రీముఖసంవత్సర జ్యేష్ఠ బ ౯ అంగారవారము వఱకు జంగం నాగలింగం సురాభాండేశ్వరము. తాడేపల్లి సుందరరామయ్య వ్రాసియిచ్చెను. అని గ్రంథాంతమునఁగలదు. మొదట నొత్తుపటామీఁద తనువుల రామలింగయ్యగారి కుమారుడు బసవశంకరయ్య సురాభాండేశ్వర మని యున్నది.

(66) దేవాంగచరిత్రము. గ్రం. సం. 931.

ఇది యొక పద్యకావ్యము. కవి యెవ్వరో తెలియదు. ఆశ్వాసవిభాగము లేదు. వ్రాఁత గొలుసుకత్తు. గొలికిగొలికి కొట్టికొట్టి దిద్దిదిద్ది వ్రాసినపంక్తులు కనఁబడుచున్నవి, చూడఁగా నిదియే ప్రథమప్రతియేమో యని తోఁచుచున్నది. పద్యములు ధారాళముగాఁ జదువ నను వుపడదు. కష్టముమీఁద దెలిసికొని చదువవలయును. కవిత్వము చక్కనిది. హృద్యము లగుపద్యములు గలవు. ఇందు వస్త్రనిర్మాణము దానికై తంతుసంపాదనము దేవతలు మొదలుగా నందఱకు వస్త్రప్రదానముం జెప్పఁబడినది. దేవాంగముని యిందు కథానాయకుఁడు, లోకమునకుఁ దెలియుటకై యందందుఁ గల కొన్నిపద్యభాగములం జూపి విడువఁబడును.

ప్రారంభమున—

క. వందన మొనర్తు సేవక, సందోహానందునకు గజాస్యునకు జగ
ద్వందితునకు ధూమాంకున, కుం దుర్దను విఘ్నభేదకోద్యోగునకున్.

క. వాణికి వీణాపుస్తక, పాణికి భక్తజననివహపావనికి ఘన
శ్రోణికి మ్రొక్కెద సుగుణ, శ్రేణికి ననిశమును సురకరీంద్రస్తనికిన్.

చ. వితతఖ్యాతివహించు నైమిశనివేశుల్ పార్వతీశార్చనా
వ్రతులా త్మజ్ఞులు సంశ్రితైకగుణు లార్యాచారసంపన్ను లం
చితవిజ్ఞానులు శౌనకాదులు మహర్షుల్ సూతుఁ బౌరాణికా
గ్రతపీఠి స్థితుఁ గాంచి యిట్లనిరి ప్రత్యాసక్తితో నందఱున్.

ఉ. మాఱుగ దేనిచేత నభిమానము గోపనమయ్యె నట్టివ
స్త్రానకు సాధనంబులు తిరంబుగ నెవ్వనిచేతఁ గల్పనం
బైనవి గోప్యగోపనము లన్ని నొనర్చి మనుష్యులందఱా
బూని పరంబుఁ జేయుటకుఁ బూనిక నెవ్వఁడు చేసె నాదటన్.

గీ. ఇతరకథలవలన నీఁగని పాపముల్, దేని వినినఁ బాసి దివ్యులగుదు
రట్టి కృష్ణ మీర లడిగితి రిపుడు మ, హారసమ్మ మిది మహాత్ములార.

చ. గురుఁడగు బాదరాయణుని గోరి నమస్కృతి చేసి తొల్లియ
ప్పరమమునీంద్రుచే వినినభంగిని దెల్పెద మీకు మీరు సా
దరమనస్కులై ననుఁ గృతార్థునిఁ జేసి కథార్థతత్వత
త్పరమతులై వినుం డని పదంపడి యిట్లని పల్కె వారితోన్.

గీ. పరమయోగీంద్రులకు నైనఁ బడయరాని, శైవసాయుజ్యమే కథాశ్రవణమునను
గలుగు నుత్కృష్టులకు నైన నెలమి దీని, మహిమ వర్ణింపఁదరమె మనస్వులార

ఉ. పాయక యెల్లలోకములఁ బ్రస్తుతికెక్కి సృజించినట్టి ప్ర
జ్ఞాయుతుఁ డైన బ్రహ్మవలనన్ జగదీశ్వర గుహ్యరక్షణో
పాయము గల్గదయ్యె ననపాయముగాఁ దగులోకరక్షణం
బీయెడ నెట్లు గల్గు జను లెట్లు సుఖింతురు సర్వకాలమున్.

వ. దేవి నీకు నమస్కారంబులు గావించెద ననుగ్రహింపు మని వెండియు
నిట్లనియె.

క. తంతువు దెచ్చుట కొఱకై, యెంతయు విష్ణ్వంతికమున కేగెదు నన్నుం
జింతింపుము రక్షింపుట, కింతట దీవించి వఁత లెడలెడునట్లున్.

గీ. అయిదురంగులు చిహ్నితమైనవస్త్ర, మొకటిగావించి నీ నేర్పు ప్రకటమొందఁ
దాపసోత్తము నీశుభదంబు కొఱకు, నీశ్వరున కిప్పు ముందు ధరించుటకును.

(67) ఉత్తరరామాయణము. గ్రం సం. 999.

తిక్కనసోమయాజికృత నిర్వచనోత్తరరామాయణము పదియాశ్వాస
ములు తరవాయిని బదునొకండవయాశ్వాసము. జయంతి రామభట్టను కవి

రచియించినది, యీగ్రంథములోఁ జివరఁ జేర్పఁబడినది. ఇందు వచనములు గూడఁ గలవు. కవిత్వ మంత రసవంతముగా నుండదు. అచ్చుపడినదానిలో నీభాగము నెవ్వరును జేర్పలేదు. కావున దానివిషయమై కొంత యిందుఁ దెల్పఁబడుచున్నది. ప్రారంభము.

క. శ్రీమద్రఘుకుల జలనిధి, సోమా పరమాత్మనామ సుగుణస్తోమా
భీమాహవదైత్యకులవి, రామా భద్రాద్రిధామ రాఘవరామా.

క. శ్రీరాముఁడు చెలువ బుగ, ధారుణిఁ బాలింపుచుండి ధర్మాన్వితుఁడై
సారెకు మైథిలిఁ దలఁపుచుఁ, గారుణ్యము కలిమి చెలిమి గౌరవ మొప్పన్.

క. కుశలవపుత్రత్వబోధము, కుశలవులకు ననుజులకును గుశలముఁ జెందన్
విశదముగ వేదశాస్త్ర, పశమమునగు రాజ్యనీతి పద్ధతిఁ దెలిపెన్.

ఉ. జానకిఁ బాసి రాఘవుఁడు స్వర్ణమయుం బగు సీతతోడుతం
బూని సమస్తయజ్ఞములు పొందుగ దక్షిణ లిచ్చి సేయుచున్
మానుగ సర్వభూప్రజల మన్ననఁ బ్రోవుచు నాఁడునాఁటికిన్
భానుతుఁడై వసుంధరను బూజిత మొప్పఁగ నేలునంతటన్.

క. కౌసల్యాదిగఁ దల్లులు, వాసవపురి కేగినంత వారలకొఱకై
భూసురులఁ బంపె రాముఁడు, భాసురముగ భర్తృలోకపదమునఁ బొందన్

గద్యము—ఇది శ్రీమద్భద్రాద్రిరామ వరప్రసాదలబ్ధ కవితా(విచిత్ర)గార్గేయ గోత్రపవిత్ర జయంతి కృష్ణభట్టారక సుభద్రాంబావరతనూజ రామభట్టప్రణీతం బైన శ్రీమద్రామాయణకావ్యంబున నుత్తరకాండ తిక్కనసోమయాజి రచితంబై యున్న శేషంబునం గల్గు మీఁదటికథయందు.......... సర్వము న్నేకాదశాస్వాసము.

కథలోని రెండుపద్యము:—

ఉ. భూపతి నన్నుఁ దా విపినభూముల కంపిననాఁడు వెంబడిం
బ్రాపయి కందమూలఫలరాసులఁ దెచ్చియు మమ్ముఁ దన్విఁ దాఁ
గాపరియై వసించుచును గాచుకొ యుండును నిద్రలేక హా
పాపురె నేఁడు లక్ష్మణుని బాయఁగఁ జేసితి మాయదైవమా.

గీ. అమరగంధర్వమానిగణాంశజనిత, మైనమర్కటభల్లూకయాతుధాన
సంఘ మంతయు నిర్మలస్వాంతు లౌట, నన్నుగమనమ్మున కొడఁబడియాదరించె

క. పది వేలవత్సరంబులు పదినూఱులయేండ్లు నిండఁ బదపడి సమయం
బిదె వచ్చెఁ బ్రతిన వేళయుఁ, బదపడ వైకుంఠ లోకపదవికి రామా.
ఖరసంవత్సర ఆషాఢబ 3 బు స్వస్తి మేడవర్పు ఆదినారాయుడు మళ్ళచేనుల
కొమారుఁడు రాజగోపాల్నికి వ్రాసి యిచ్చెను.

—(68) బాలభారతమ్—గ్రం. సం. 936.—

అగస్త్యకృత బాలభారతమ్. పరిషత్పుస్తకభాండాగారములోని సం. 855 గ్రంథ
మసంపూర్ణము. ఇందు ౨౦ సర్గలు సంపూర్ణముగనున్నవి. ప్రారంభము:—
అస్త్యత్రినేత్రప్రభవః కలాన్త్మా శశీతి నక్షత్రగణస్యనాథః
యం వారిజశ్రీ హార మాస్తవాచో వామం హరే ర్లోచన మామనన్తి.
సేవ్య స్సురాణాం హిమవద్గిపాద స్సంభావనీయ శ్శిరసా శివేన
మహీంధ్రథ గ్గేవ తమోపహంత్రీం యః కౌముదీందివ్యనదీం ప్రసూతే.
నజాహ్నవీయైశ్చ నయాముసైశ్చ నచాపరాసాః సరితాం పయోధిః
యస్యోదయే నైవసుజాతధామ్నో బహీర్వాయసీమృద్ధి ముపైతి వార్ధిః.
అంతమున—
సమైన మాహస్య చిరాత్రి తేన శునా సునాసీర వినామునా మే
నరోచతే నాకవిహారసౌఖ్యం శ్లాఘ్యం పరం భ్రాతృసమాగమోవా.
విహాయ తచ్ఛ్వానకరూప మగ్రే మూర్తేన ధర్మేణ సహక్షితీశః
ఆరోపితో మాతలిచోదితాశ్వం రథం మఘోనా దివ మారురోహ.
ఆందోళయ న్నభనదీతరంగా న్నమోదయో నందనగంధవాహః
నృపాయ కల్పద్రుమపుష్పగంధ ముపాయనత్వం గమయాంబభూవ.
పాంచాల్యాసమ మద్ధితై ర్నిరయతః కర్ణాదిభి ర్భాతృభి
స్స్వంస్వం ధామగతై రభిష్టుతయశా దివ్యైశ్చ తై ర్బంధుభిః
సింధౌ దిగ్గజదాన దిగ్ధపయసి త్యక్త్వా వపుర్మానుషం
సర్వాసా దివిషద్గృశాం సవిదధే శర్మాణి ధర్మాకృతిః.
ఇతి శ్రీ అగస్త్యకృతౌ బాలభారతే వింశఃసర్గః—

—(69) అజ్ఞానధ్వాంతచండభాస్కరము—గ్రం. సం. 4313.

ఇదియొక వేదాంతవచనగ్రంథము. కంభముపాటి అమరేశ్వరకవి రచి
తము. భాష సంభాషణరూపముగా నున్నది. గద్యము—"ఇది శ్రీమదద్వైత
బ్రహ్మవిద్యావిశారదుం డైనకంభముపాటి అమరేశ్వరశాస్త్రుల్లవారి చాతను

శిష్యానుగ్రహార్థమై ఆంధ్రభాషాప్రబంధరూపముగాను రచియింపఁబడినఅజ్ఞానధ్వాంతచండభాస్కర మనేటి విచారదశరూపక మైన వేదాంతప్రకరణంసహస్తమూ.

ఇందు అనుబంధవిచారము—జీవేశ్వరవిచారము,సృష్టివిచారము, ఇట్లు పదిప్రకరణములు గలవు. కొంతమచ్చునకు —

"పుత్రదోషాలనువివరించేము.

"పుత్రుఁడు పుట్టకమునుపు పుట్టడాయనని తల్లిదండ్రులకు దుఃఖము గర్భము నిలిచి స్రవిస్తే దుఃఖము స్రవించక శిశువు పుట్టినప్పుడు శిశువుకైనా హాని తల్లికైనా హాని హానిపొందకవుంటేనా గ్రహాదోషాదిదుఃఖము రోగానులవలన దుఃఖము నడిచేకాలముదాఁకా ఘూర్ఖుఁడా ఆయనా యవండ్లుకొట్టుకొంటున్నారో అని దుఃఖము వాఁడుగుగాదాయనని చదువురాదాయనని పెండ్లిగావాయనని దుఃఖము. వయస్సువాఁడాయనాండ్లో పరదారాగమనం చేసెనా లోకులు నిందించేరు అని రాజులు దండించేరు అని పరలోకమందు నరకానఁబడేనని దుఃఖము"......

ఇట్లేయర్థదోషాలు వివరింపఁబడినవి.

బ్రహ్మజ్ఞానోపాయము—శ్రీపరమహంసపరివ్రాజకాచార్య శ్రీసచ్చిదానందేంద్ర శ్రీగురుచరణకమలశిష్య శ్రీరామకృష్ణానందవిరచితము.

గురుశిష్యసంవాదకీర్తన- కావితిప్పగొనసచ్చిన ౧౧౮ చరణములు వేదాంతము-కొన్నిచరణములు—

కాలినవిత్తులు క్రమ్మరమొలవావు లీఁజ్ఞానికి పుట్టు లేదు సుమ్మోయి
కారణమణఁగిన కార్యమ్మొడనుండు నారీతి సంసారమని చూడుమోయి!

మడికిసింగన్న వాసిష్ఠరామాయణము- మొదటిధనవించుఁగలవు.

౨౩ వ పత్రములో నీక్రిందిపంచరత్నములు గలవు.

మ. నిగమాంతప్రతిపాద్యమై విమలమై నిర్వాసనాభాగ్యమై
సగుణాతీతము నిర్గుణాదికమునై శశ్వత్సుఖానంద స
ర్వగురుత్వం బగు రామలింగగురుచంద్రావాస మైనట్టి మా
మగరాల్పట్టణ మెంతదవ్వు చెపుమా మర్త్యాంగనారత్నమా. ౧

మ విగతాశాభయుఁడై మహాశుభదుఁడై విశ్వాత్ముఁడై నిత్యుఁడై
జగదజ్ఞాదివికారదూరుఁడయి దోషధ్వంసియై సద్గురుం

డగుచుం బ్రోచెడి రామలింగగురుచంద్రావాస మైనట్టి మా
మగరాల్పట్టన మెంతదవ్వ చెపుమా మర్త్యాంగనారత్నమా. ౨

మ. జగమం దెన్నఁగ భక్తకల్పతరువై సర్వత్రసౌఖ్యంబులం
దగరక్షించి వరించి ముక్తిలలనా తాదాత్మ్యమొందింప ధీ
రగుణుండై తగు రామలింగగురుచంద్రావాస మైనట్టి మా
మగరాల్పట్టణ మెంతదవ్వ చెపుమా మర్త్యాంగనారత్నమా. 3

మ. జగతిం బుట్టు ముముక్షులైన సుమనస్సంస్తుత్యుండై సదా
జగమద్యధ్వరిజాలభీషణలసత్సన్మాత్రకుండై చు వే
తగ రక్షించెడు రామలింగగురుచంద్రావాస మైనట్టి మా
మగరాల్పట్టణ మెంతదవ్వ చెపుమా మర్త్యాంగనారత్నమా. ౪

మ. పగడా లింద్రనసీలగారుడమణుల్ వైడూర్యరత్నంబుల
స్సగరాజిల్లెంపులు చంద్రకాంతరుచుల న్నాసించు వెల్గొంది పా
దగుచుఁ శ్రీకరరామలింగగురుచంద్రావాస మైనట్టి మా
మగరాల్పట్టణ మెంతదవ్వ చెపుమా మర్త్యాంగనారత్నమా. ౫

శా. ముక్తిద్వారకవాటముం దెఱచి పై ముక్కంటిపైకంటిలో
రక్తిన్గాని విరక్తిచే మిగులఁ బేరొకంటిపై కంటిలో
యుక్తిం బొందినయోగి మూకజడబాలోన్మత్తులం బోలు నీ
భక్తిన్ శ్రీమగరాలపట్టణవరా భావజ్ఞ సర్వేశ్వరా.

ఇట్టివే "కోట్టా మున్నదె కంతదవ్వ చెపుమా కోన్నాసరోజాననా-
పొందూరెక్కడ కెంతదవ్వ చెపుమా పూర్ణేందుబింబాననా-
అను మొదలగుపద్యము లీప్రాంతములలోఁ గొందఱు చదువుచున్నారు.

—(70) హంసవింశతికథలు - గ్రం. సం. 1087—

ఇదియొక్క చక్కనివచనకావ్యము. మొదటిపత్రము లేదు. చివరపత్ర మున్నదిగాని ముక్కలై పోయినది. ప్రతిపత్రమును చివరఁ గొన్నియక్షరములు గలభాగము విఱిగిపోయినవి. భాష చాలభాగము శుద్ధముగా నున్నది. కల్పనలు మనోహరముగానున్నవి. కొంత మచ్చు చూడుఁడు—

"ఎనిమిదవనాఁటిరాత్రి హేమావతి మణిఖచితతాటంకకాంతులును ముక్తాహారంబులకాంతులును రత్నకంకణంబులకాంతులును దిగంతంబు లావరింపఁ గుంకుమపంకంబు పొంకం బగుచుండఁ జెంతకు వచ్చిన దానిం గాంచి

యోశృంగారవతి రాజగృహంబునకుం బోయెద వేమొ నాముచ్చట విని పోవుదుగాక యని ముగ్ధులు గులుకఁ బలికిన హంసవాక్చాతుర్యంబునకుఁ జిక్కి య్యాకథ వినియెదఁ దెలుపు మనిన నిట్లనియె. పున్నాగపుంజం బను (పురంబున) ధనచిత్తుం డనువైశ్యశిఖామణి యుండు నతండు కాయధాన్యంబులు గలకజంబులును బియ్యంపుగరిసెలును చిల్లరలమ్మెడు దుకాణములును గట్లసంచుఁను దక్కెడయును, అటకయుం గలిగి జాజికాయలును జాపత్రియును... మొలగు సమస్తవస్తువులు బేరంబాడుచుండు నాతనికి వసుమతి యను సతిగలదు. దానిమోము గోము దాని కావిమోవి, దాని కప్పుకొప్పు దానియారుతీరు దానిచెన్నగుచిన్నెలు దానిజగ్గునిగ్గు దానితేటగుమాటలు... దానిం జూచిన మానవుం డాత్మలో మెచ్చి శిరంబు గదల్చి మీసంబులపైఁ గేలువైచి నిట్టార్పుపుచ్చి మజ్జారే యనక మానండు"

—(71) బహువిధగ్రంథములుగల సంపుటము గ్రం. సం. **1244**.—

ఇం దనేకవిషయములు గలవు. అష్టాంగయోగక్రమము- యుగకాల సంఖ్యయునుగలవు.

(1) నానార్థపద్యములు:—ఇవ్వేర సంస్కృతపదముల నానార్థములం దెలుపు ౫౦ కందములు గలవు.

క. సంస్కృతము లక్షణోక్తము, సంస్కృతమన శ్రుతియుగతియుస్వర్గముభూమిన్
సంస్కృతము చెడనిపదవియు, సంస్కృతమనఁబట్టిపండుసభ మొదలయ్యెన్.
క. ఘృత మనఁగ నెయ్యి నీళ్లును, ఘృత మనఁగాఁ బాలుచల్లగుగ్గిలమినుమున్
ఘృత మనఁగఁ దేనె నెత్తురు, ఘృత మనసంసారసుఖముగెల్పునునయ్యెన్.
క. న్యగ్రోధ మనఁగఁ బామును, న్యగ్రోధంబనఁగ వ్రేలు నెత్తురుఁ బొత్తున్
న్యగ్రోధ మనఁగ మఱ్ఱియు, న్యగ్రోధం బనఁగ బార సగడును నయ్యెన్.

(2) శివస్తోత్రము:—ద్విపద సుమారు నూఱుచరణము లుండును. పాల్కురికి సోమనాథకృతమేమొ!

"కులజుండనైన దుష్కులజుఁడనైన, బలుపుణ్యనిధి యైనఁ బాపాత్ముఁడైనఁ
గాని నీసద్భక్తి కలితుఁడనైన, వానినీరూపులో వర్ణింపఁజేయు
పుడమిభక్తులయిండ్లఁబడిపనుల్ సేయు, పడఁతికడ్పునసైనఁ బ్రభవింపఁజేయు
... ...
పరమవరుండైన పాల్కురినిలయు, కరుణతోఁ బ్రోచును గళికాలమల్ల"

(3) షట్స్థలసంబోధతత్త్వరహస్యము:—

సంస్కృతశ్లోకములును, తెనుఁగువివరణమును గల శైవగ్రంథము.

గద్యము:—ఇతి శ్రీగురులింగజంగమపాదారవిందమకరందపానమిళింద మానసే శ్రీమద్గురునల్లమాహ్వయకరుణాకటాక్షవీక్షణంబునం మురుమల్ల నామ్నప్రణీతంబైన షట్స్థలసంబోధతత్వరహస్యంబు......"

తెనుఁగువాడుక మాటలతో నున్నది.

శివతత్వపరే సూక్ష్మ బిందురూపంతు జాయతే
బిందునాదసముత్పన్నం నాదాంతే శక్తిజాయతే
శక్తిస్తు జాయతే శబ్ద శ్శబ్దేజాయంతి వాగ్భవం.

యిట్లు పరమసూక్ష్మమైన వ్యోమాతీతమైన శివతత్వమందు బిందురూపమైన పరాశక్తి బుట్టెను. ఆపరాశక్తి నాదం బుట్టెను. ఆనాదమే ఆదిశక్తివలన ఇచ్ఛాశక్తి బుట్టెను. ఆయిచ్ఛాశక్తియందు శబ్దము బుట్టెను. ఆశబ్దమే జ్ఞానశక్తి ఆజ్ఞానశక్తివలన వాక్కు పుట్టెను. ఆవాక్కుయనెడిదే క్రియాశక్తి......" దీనిని రుధిరోద్గారినామసంవత్సర వైశాఖ శు ౧ సోమవారం సాయంత్రం సర్వ వచనటీక నిమ్మన బసవానందయోగిగారి మాతృకను వున్నట్టుగా మాచిరాజు బుచ్చన్న సంపూర్ణంగ్గా శ్రీసద్గురుపాదాల అనుగ్రహంవల్లను వ్రాసెను.

ఈసంపుటములో మఱియు ద్విపదస్తమకస్తోత్రము వర్ష ఫలము రుద్రాక్షధారణవిషయము సోమనాథుని ప్రభులింగలీలలునుగలవు.

(4) జీవయొఱుకులకొఱవంజి. సన్నిధిరాజు జగన్నాథకవిప్రణీతము.

గద్యము:—శ్రీమద్వైదవేదాంతరహస్య ప్రణవగుహాంతరాళనిలయ పరమహంసపరివ్రాజకాచార్యవర్య సర్వతంత్ర స్వతంత్ర శృంగుభేరిసింహాసనస్థిత శ్రీమచ్ఛంకరాచార్యపాదారవింద మకరందపానమిళిందమాన మానస సన్నిధిరాజవంశపారావార రాకాశశాంక అమ్మయసుపుత్ర జగన్నాథనామధేయప్రణీతంబైన జ్ఞానయరుకలకురువంజి యను మహాప్రబంధంబునందు సర్వంబు నేకాశ్వాసము.

యక్షగానము— వేదాంతవిషయము- మొదటిపత్రము పోయినది. కొంతవినుండు-"...గలిగిన తామరకమల మున్నది. ఆకమలమందు మానస హంస యనేరాజహంస గలదు. దానిఖగాంతరమందు నవరత్నదీపులు గల చిద్బ్రహ్మము వున్నది. అని చెప్పగాను దాని పట్టి తెమ్మనుమని మాళింగ్గి అని

కొట్టె దేవరా నేను ప్రాకృతపురుషుణ్ణి గనక రాజహంసను పట్టి తేతే ననగా నామీద కోపించ్చి రాజహంసకొరకు సుకర్ణ్మేచ్ఛచేత పారిపోయి వచ్చినది. సామీ, నేను దాని వెనుకవచ్చినాను సామీ, మాశింగ్గిని నేను విడిచిపెట్టితే యీఅనంత్తకోటి బ్రహ్మాండాలు చెడిపోవడానకు హేతు వౌతుంద్ది గనక శింగిని జూడవచ్చినాను సామీ, యని యన్నంత హాస్తగాడు అడిగీమాట, వారి శింగ్గా మీశింగ్గిని నీవు చూడకపోతే యీఅనంత్తకోటి బ్రహ్మాండాలు చెడిపోతున్నవని తెలియజెప్పు మనిన, చెప్పమంటావు సామీ, ఎనిమిదిశరీరాలున్ను నాలుగుపాదాలున్ను మూడుస్థానాలున్ను అయిదుగురుదేవతలున్ను వీటితోగూడిన ప్రణవజ్యోతిరూపమైన పరబ్రహ్మము నన్ను చేపట్టి సర్వలోకాలున్ను ఆడిస్తూవున్నాడు సామీ, నన్నుగాదని మాశింగ్గి తనపేరు చెచ్చకోవలెనని విడనాడి వచ్చినదిసామీ.”

ఇది ద్వితీయభాగము.